గురువారం
20•2•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 236
• పేజీలు : 12 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD









# తెలంగాణ దేశానికి మోడల్

- రాజ్యాంగ స్ఫూర్తికి.. మానవీయ ఆర్తికి దిక్సూచి
- గోదావరికి కొత్తనడక నేర్పిన పాలకుడు సీఎం కేసీఆర్
- ఆరేండ్ల క్రితం గోదావరిలో చుక్కనీరు లేదు.. ఇప్పుడు నది పొడవునా నీరే
- నీటి స్పృహ ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- రైతు ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి
- నమస్తే తెలంగాణ ఇంటర్వ్యూలో వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్

**వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ :**

ఈ దేశంలో నీటి స్పృహ ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత రాజేంద్రసింగ్ అన్నారు. గోదావరి నదికి కొత్త నడకలు నేర్పిన పాలకుడు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అని.. రాష్ట్రం ఏర్పడి ఆరేండ్లే అయినప్పటికీ, నదీజలాల వినియోగం, చిన్ననీటి వనరుల పరిరక్షణ విషయంలో తెలంగాణ.. దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని చెప్పటానికి తనకెలాంటి సంకోచంలేదని తెలిపారు. సీఎం కేసీఆర్‌కు నీటి ఆవశ్యకత, ప్రజల కష్టాలు బాగా తెలుసుకాబట్టే గోదావరి.. సముద్రంలో కలువడానికి ఇష్టపడటంలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వ నీటివిధానాల వల్ల రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని చెప్పారు. గోదావరి జలాల పరిరక్షణ ఉద్యమంలో భాగంగా నది జన్మస్థలం నాసిక్ త్రయంబకేశ్వర్ నుంచి రాజమహేంద్రవరం వరకు ఈ నెల 14 నుంచి 22 వరకు తలపెట్టిన యాత్రలో భాగంగా బుధవారం వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజేంద్రసింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా

మిగతా 2వ పేజీలో

> **ఆరేండ్ల** క్రితం గోదావరిని చూస్తే ఆందోళన కలిగింది. ఇప్పుడు ఆనందం కలుగుతున్నది. ఉపనదులైన ప్రాణహిత, ఇంద్రావతి, శబరి వంటి నదుల నీటితో మహారాష్ట్ర కంటే తెలంగాణలో కిలోమీటర్ల పొడవునా నదీప్రవాహం కొనసాగుతున్నది. అద్భుతమైన దృశ్యం తెలంగాణలో ఆవిష్కృతమైంది.
>
> – డాక్టర్ రాజేంద్రసింగ్

## బయోఏషియా-2020

# సూపర్‌హిట్



> **సుల్తాన్‌పూర్** మెడికల్ డివైజెస్ పార్క్‌లో ఇప్పటికే 20 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. వచ్చే జూలైలో ఆరు కంపెనీలు తమ వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించడానికి సిద్ధమవుతున్నాయి. ఇది ఇండియాలో అతి పెద్ద వైద్యపరికరాల పార్క్. ఏషియాలో అతిపెద్ద స్టెంట్ల యూనిట్ సహజానంద్ టెక్నాలజీ డిసెంబర్ నాటికి తమ యూనిట్‌ను ప్రారంభించేందుకు సిద్ధమైంది.
>
> - మంత్రి కేటీఆర్

- హైదరాబాద్‌లోనే వైద్యపరికరాల తయారీ
- సుల్తాన్‌పూర్ మెడిటెక్‌లో 20 కంపెనీలకు భూ కేటాయింపులు
- జూలై నుంచి 6 కంపెనీల వాణిజ్య కార్యకలాపాలు
- తక్కువ ఖర్చులో వైద్యం అందుబాటులోకి..
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్
- దిగ్విజయంగా ముగిసిన బయోఏషియా సదస్సు



**బుధవారం బయోఏషియా సదస్సు ముగింపు సందర్భంగా పలువురు పారిశ్రామికవేత్తలు, సదస్సు నిర్వాహకులు, అధికారులతో మంత్రి కే తారకరామారావు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రానున్న రోజుల్లో దేశానికి అవసరమైన వైద్యపరికరాలు హైదరాబాద్‌లోనే తయారవుతాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు తెలిపారు. దేశంలోనే అతి పెద్దదైన సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజెస్ పార్క్‌లో ఇప్పటికే 20 కంపెనీలకు భూకేటాయింపులు జరిపామన్నారు. వచ్చే జూలై నుంచి ఆరు కంపెనీలు తమ వాణిజ్యకార్యకలాపాలను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. మూడురోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించిన బయోఏషియా 2020 సదస్సు బుధవారం దిగ్విజయంగా ముగిసింది. ముగింపు సదస్సులో మంత్రి కేటీఆర్ పాల్గొని.. సదస్సు విజయవంతంకావడం పట్ల ఆనందం వ్యక్తంచేశారు. వివిధ దేశాల ప్రతినిధులు, కంపెనీల సీఈవోలు హాజరై అనేక అంశాలపై సదస్సులో చర్చించారన్నారు. ప్రస్తుతం 80% మేర దిగుమతి చేసుకొంటున్న వైద్యపరికరాలను ఇక్కడే తయారుచేయడంద్వారా వాటి వ్యయం తగ్గటమే కాకుండా.. రోగులకు తక్కువ ఖర్చుతో చికిత్సలు అందించవచ్చని చెప్పారు. ఆసియాలో అతిపెద్ద స్టెంట్ల యూనిట్ అయిన సహజానంద్ టెక్నాలజీ.. డిసెంబర్ నాటికి వాణిజ్యకార్యకలాపాలు ప్రారంభించడానికి సిద్ధమైందని తెలిపారు. పార్కుకు కేటాయించిన 276 ఎకరాల్లో భూ కేటాయింపులు దాదాపుగా పూర్తయ్యాయని.. దీంతో పార్క్‌కు మరికొంత స్థలాన్ని కేటాయించనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మేకిన్ ఇండియా నినాదం ఇప్పటికే ఇచ్చిందని.. తెలంగాణ, ఒడిశా వంటి రాష్ట్రాలు ఉత్పాదకతను పెంచుకోవడానికి కృషిచేస్తున్నాయని అన్నారు. సదస్సులో పాల్గొన్న ప్రముఖులతో భేటీకావడం తనకు లభించిన ప్రత్యేక అవకాశంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. సదస్సుకు హాజరైనవారందరికీ మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది సదస్సుకు 35 దేశాల ప్రతినిధులు హాజరయ్యారని, 2021 సదస్సు ఇంతకంటే పెద్దదిగా విస్తృతంగా జరుగుతుందన్న ధీమా వ్యక్తంచేశారు. సదస్సును విజయవంతంగా నిర్వహించిన బయోఏషియా సీఈవో శక్తినాగప్పన్‌తోపాటు ఆయన బృందాన్ని అభినందించారు. ఒడిశా మంత్రి అశోక్ చంద్రపాండ మాట్లాడుతూ ఒడిశాలోనూ లైఫ్‌సైన్సెస్‌కు మంచి పెట్టుబడి అవకాశాలున్నాయన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య, టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నరసింహారెడ్డి, బయోఏషియా సీఈవో శక్తి నాగప్పన్ పాల్గొన్నారు.

**ఇంటెల్ ఆధ్వర్యంలో**

ఇంటెల్ సంస్థ ఏర్పాటుచేయనున్న 'అప్లైడ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రిసెర్చ్ సెంటర్ ఫర్

మిగతా 2వ పేజీలో

## వరదకాల్వకు

# ఒక టీఎంసీ

- పునర్జీవ పథకం ద్వారా నీటి విడుదలకు సీఎం కేసీఆర్ ఆదేశం
- ఎల్లంపల్లి పరిధిలో ఐదు లిఫ్టులను ఆన్ చేయాలని నిర్దేశం
- ఉమ్మడి కరీంనగర్‌లోని 180కి పైగా చెరువులకు జలకళ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**



శ్రీరాంసాగర్ పునర్జీవ పథకంద్వారా వరదకాల్వలోకి ఒక టీఎంసీ నీటిని విడుదలచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు బుధవారం నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. వరదకాల్వలోకి నీటిని విడుదల చేసేందుకు ఎస్సారెస్పీలో తగిన నిల్వలు లేనందున ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారని కరీంనగర్ ఉమ్మడిజిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం.. వరదకాల్వకు ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా నీటిని విడుదలచేయాలని అధికారులకు సూచించారు. సీఎం ఆదేశాల మేరకు నీటిని విడుదల చేస్తామని కరీంనగర్ ఈఎన్సీ అనిల్‌కుమార్ తెలిపారు. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని పలు నియోజకవర్గాలకు యాసంగి పంటకు సరిపడ సాగునీరందనున్నది. ప్రస్తుతం కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా ఎల్లంపల్లి నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయం మీదుగా ఎల్ఎండీకి నీటి విడుదల కొనసాగుతున్నది. నంది, గాయత్రీ పంపుహౌజుల్లోని భారీ మోటర్ల ద్వారా ఎత్తిపోత జరుగుతున్నది. వరదకాల్వ ద్వారా ఎలాగూ శ్రీరాజరాజేశ్వర జలాశయానికి జలాలు తరలుతున్నందున ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా వరదకాల్వలో

మిగతా 2వ పేజీలో

## మూడువారాల్లో వర్సిటీలకు

# వీసీల నియామకం

అధికారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం 2

## జీఎస్టీ 21వ శతాబ్దపు

# పిచ్చి నిర్ణయం

- బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి సంచలన వ్యాఖ్య
- ఆదాయం పన్ను విధానాన్ని రద్దుచేయాలి
- ఆర్థిక సంస్కరణలను తెచ్చిన పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వాలి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జీఎస్టీ విధానం.. 21వ శతాబ్దపు అతి పెద్ద పిచ్చి నిర్ణయమని బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు సుబ్రమణ్యస్వామి సంచలన వ్యాఖ్య చేశారు. 2030 నాటికి భారతదేశం అగ్రరాజ్యంగా నిలువాలంటే ఏటా పదిశాతం చొప్పున అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉన్నదని స్పష్టంచేశారు. బుధవారం హైదరాబాద్‌లో ప్రజ్ఞాభారతి సంస్థ ఏర్పాటుచేసిన సమావేశంలో 'భారత్- 2030 నాటికి అగ్రరాజ్యం' అన్న అంశంపై సుబ్రమణ్యస్వామి ప్రసంగించారు. దేశంలో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టింది మాజీ ప్రధాని పీవీ నరసింహారావేనని.. పీవీ చేపట్టిన సంస్కరణలను గుర్తించి ఆయనకు భారతరత్నను ప్రకటించాలని డిమాండ్‌చేశారు. మన దేశం 8శాతం చొప్పున ఆర్థికంగా వృద్ధి చెందుతున్నప్పటికీ.. పీవీ ప్రవేశపెట్టిన సంస్కరణల ఫలితాల్లో మెరుగుదల కనిపించడంలేదని పేర్కొన్నారు. అవినీతిపై

మిగతా 2వ పేజీలో

### ఆ 1800 కిలోల బంగారం ఎక్కడ?

శ్రీకృష్ణా జువెలరీ
కుంభకోణంలో వెలుగులోకి
చీకటి కోణాలు

బంగారం తరలింపులో
కీలకవ్యక్తి సునీల్ అరెస్టు

3



**రామమందిరం ట్రస్ట్ అధ్యక్షుడిగా**

### నృత్యగోపాల్ దాస్

మందిర నిర్మాణ కమిటీ
అధ్యక్షుడిగా నృపేంద్రమిశ్రా

ట్రస్ట్ తొలి సమావేశంలో ఎన్నిక

5

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 54.00 | రిటైల్ లైవ్ | 76.00 |
| డ్రెస్డ్ | 110.00 | స్కిన్‌లెస్ | 125.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 340.00 | రంగారెడ్డి | 340.00 |
| మెదక్ | 340.00 | కరీంనగర్ | 342.00 |
| వరంగల్ | 342.00 | డజన్ ధర | 60.00 |

### పంటల బీమా ఇక స్వచ్ఛందమే

కేంద్ర మంత్రివర్గం నిర్ణయం




LOK | SAATCHI & SAATCHI

# వీసీలను నియమించండి

- మూడువారాల్లోగా ప్రక్రియ పూర్తిచేయండి
- అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వివిధ యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్ల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. సెర్చ్ కమిటీ నుంచి పేర్లు తెప్పించుకొని ముందుగా ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ (ఈసీ) మెంబర్ల నియామకాలు సత్వరం పూర్తిచేయాలని సూచించారు. దీని వల్ల వీసీల నియామకం సులభమవుతుందని చెప్పారు. రెండుమూడువారాల్లోనే ఈసీ, వీసీల నియామక ప్రక్రియ పూర్తికావాలని సీఎం కేసీఆర్ అధికారులకు స్పష్టంచేశారు.



స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

# 'టీనేజ్ టెంప్టేషన్స్' సదస్సు పోస్టర్ ఆవిష్కరించిన గవర్నర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ టీనేజ్ టెంప్టేషన్స్‌పై మార్చి నుంచి ప్రారంభించే అవగాహన శిబిరాల పోస్టర్‌ను గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ బుధవారం రాజ్‌భవన్‌లో ఆవిష్కరించారు. స్ఫూర్తి సంస్థ కార్యక్రమాలను ఈ సందర్భంగా గవర్నర్ అభినందించారు. కౌమార దశలో బాల, బాలికల మధ్య తలెత్తే ఆకర్షణల్లో ఏది ప్రేమ, ఏది స్నేహం.. ఏ విధమైన ప్రవర్తన కలిగి ఉండాలి.. ఇలా అనేక అంశాలపై యువతలో అవగాహన కల్పించేందుకు గత కొన్నేండ్లుగా స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ 'టీనేజ్ టెంప్టేషన్స్' పేరిట విద్యార్థులకు, అధ్యాపకులకు, తల్లిదండ్రులకు అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నది. కార్యక్రమంలో టీనేజ్ టెంప్టేషన్స్ కన్వీనర్, సైకాలజిస్ట్ డాక్టర్ సీ వీరేందర్, వీవీరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన పొదుపులో ఆర్టీసీకి అవార్డులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంధన పొదుపులో ఆర్టీసీ ఎప్పుడూ ముందంజలో ఉందని ఎండీ సునీల్‌శర్మ తెలిపారు. ఇంధన వినియోగంలో ఉత్తమ పనితీరు చూపిన డిపోలకు అవార్డుల ప్రదాన కార్యక్రమం 'సక్షం- 2020 సంరక్షణ్ క్షమతా మహోత్సవ్' రాడిసన్ బ్లూహోటల్‌లో బుధవారం జరిగింది. పెట్రోలియం ఉత్పత్తులు తగ్గుతున్న సమయంలో చమురు సంరక్షణను బలోపేతం చేసేలా ఇంధన పొదుపు ప్రధానమని సునీల్‌శర్మ సూచించారు. డీజిల్ (హెచ్ఎస్డీ), ఆయిల్ (ఎల్‌యూబీ), కేఎంపీఎల్ అవార్డులను ప్రదానం చేశారు. 11 రీజియన్లలో కరీంనగర్ 2018-19 ఏడాదికి 5.71 హెచ్ఎస్డీతో అవార్డు దక్కించుకొన్నది. అవార్డుతో పాటు ప్రశంసాపత్రం, నగదు అందించారు, కేఎంపీఎల్‌లో ఆర్మూర్ డిపోను ఉత్తమ డిపోగా ఎంపికచేశారు. కార్పొరేట్ స్థాయిలో ఫలక్‌నుమా డిపోకు అవార్డు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ జీఎం ప్రవీణ్‌సావంత్, డీజీఎం రోహిత్ గార్గ్, ఈడీ యాదగిరి, వెంకటేశ్వర్లు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



# వరదకాల్వకు ఒక టీఎంసీ

మొదటిపేజీ తరువాయి...

ఎగువకు నీటిని ఎత్తిపోయనున్నారు. దీని కోసం పునర్జీవ పథకంలో భాగంగా నిర్మించిన రాంపూర్, రాజేశ్వరరావుపేట పంపుహౌజుల్లో మూడు చొప్పున మోటర్లను ఆన్ చేస్తారు. రాంపూర్ పంపుహౌజ్ ద్వారా ఎత్తిపోసిన జలాలు వరదకాల్వ 34 కిలోమీటర్ వరకు అందుబాటులోకి వస్తాయి. ఆ తర్వాత రాజేశ్వరరావుపేట పంపుహౌజ్ ద్వారా వరదకాల్వ మొదటి పాయింట్ వరకు చేరుతుంది. దీంతో వరదకాల్వపై ఉన్న ఓటీల ద్వారా నీటిని విడుదలచేసి దాదాపు 50 చెరువులను నింపుతారు. తద్వారా బాల్కొండ, జగిత్యాల, వేములవాడ, ధర్మపురి, కరీంనగర్ నియోజకవర్గాల పరిధిలో యాసంగికి సాగునీరు అందుతుంది. ఎల్లంపల్లి ఫోర్‌షోర్, దానికి అనుసంధానంగా ఉన్న ఐదు లిఫ్టుల ద్వారా నీటిని విడుదల చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించిన దరిమిలా అధికారులు ఆ ప్రక్రియను కూడా నిర్వహిస్తున్నారు. ఈ నీటి విడుదలతో మరో 130 చెరువులకు జలకళ అంది చొప్పదండి, ధర్మపురి, వేములవాడ నియోజకవర్గాల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందనున్నదని ఈఎన్సీ అనిల్‌కుమార్ తెలిపారు.

# జీఎస్టీ 21వ శతాబ్దపు పిచ్చి నిర్ణయం

మొదటిపేజీ తరువాయి...

పోరాటం, పెట్టుబడులు పెట్టేవారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఆదాయం పన్ను, జీఎస్టీలతో పెట్టుబడిదారులను భయభ్రాంతులకు గురిచేయకూడదని అభిప్రాయపడ్డారు. జీఎస్టీ చాలా సంక్లిష్టంగా మారిందని.. అది ఎవరికీ అర్థం కావడం లేదన్నారు. అసలు కరంటే లేకపోతే.. జీఎస్టీ పత్రాన్ని ఎలా అప్‌లోడ్‌చేయాలని ఓ రాజస్థాన్ రైతు తనను ప్రశ్నించారని.. 'నీ తల మీద అప్‌లోడ్‌చేసుకొని వెళ్లి ప్రధాని మోదీకి చూపెట్టాల'ని సమాధానమిచ్చినట్టు స్వామి తెలిపారు. పదిశాతం చొప్పున మన దేశం వృద్ధిచెందితే.. చైనాను తేలికగా అధిగమించవచ్చన్నారు. రానున్న యాభై ఏండ్లలో మొదటిస్థానం కోసం అమెరికాకు సవాలు విసిరేస్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. ప్రస్తుతం ఖర్చుచేయడానికి ప్రజల వద్ద తగినంత సొమ్ము లేక ఆర్థికాభివృద్ధికి అడ్డంకులు ఏర్పడ్డాయని తెలిపారు. జీడీపీకి ఇన్వెస్ట్‌మెంట్ రేట్ 37% ఉన్నప్పుడే 10% వృద్ధి సాధించవచ్చన్నారు. దేశంలో ఆదాయంపన్ను విధానం రద్దుచేసినప్పుడే అవినీతి తగ్గుముఖం పడుతుందని తెలిపారు. ప్రతి ఎకరాకు వ్యవసాయఉత్పత్తి ప్రపంచంలోనే అతి తక్కువగా భారతదేశంలోనే ఉన్నదని, మెరుగైన నీటి పారుదల సౌకర్యం అందుబాటులో లేనందువల్లే ఇలా జరుగుతున్నదని సుబ్రమణ్యస్వామి విచారం వ్యక్తంచేశారు.

### ముహూర్తం

సూర్యోదయం: 6.41 గంటలకు

సూర్యాస్తమయం: 6.12 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం ద్వాదశి సాయంత్రం 4.00 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: పూర్వాషాఢ ఉదయం 7.29 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 1.52 నుంచి 3.20 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.07 నుంచి సాయంత్రం 4.41 వరకు, వర్జ్యం: సాయంత్రం 4.04 నుంచి 5.47 వరకు.

### లోకం పోకడ




స్వచ్ఛభారత్‌కు మీరు పిలుపిచ్చారు.. మిమ్మల్ని ఊడ్చేసి మేము అమలు పరిచాం అమిత్‌షాజీ!



బయోఏషియా సదస్సు నిర్వాహకుల బృందంతో మంత్రి కే తారకరామారావు




మంత్రి కే తారకరామారావు సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సైయెంట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, రిచ్ డైరెక్టర్ జనరల్ అజిత్ మంగ్నేకర్

# అద్భుత ఆవిష్కరణల వేదిక

- స్టార్టప్‌లకు ఊతమిచ్చిన బయోఏషియా-2020 సదస్సు
- ప్రపంచ ప్రఖ్యాత వైద్యుల మార్గదర్శనం
- సదస్సును దిగ్విజయం చేసిన మంత్రి కేటీఆర్

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ :**

'బయోఏషియా టుడే ఫర్ టుమారో' అనే నినాదంతో హైదరాబాద్ హైటెక్స్ వేదికగా మూడురోజులపాటు జరిగిన బయోఏషియా-2020 వైద్యరంగంలో వినూత్నమైన పరిశోధనలకు, శాస్త్రసాంకేతికపరంగా వస్తున్న విప్లవాత్మక మార్పులకు వేదికగా నిలిచింది. లైఫ్‌సైన్సెస్‌లో పరిశోధనల ఫలితంగా తెరపైకి వచ్చిన కొత్త ఆవిష్కరణలకు బయోఏషియా 17వ ఎడిషన్ సదస్సు అద్దంపట్టింది. బయోటెక్, బయోఫార్మా కంపెనీలు కనుక్కొన్న కొత్త విధానాలు, ఔషధాలకు సదస్సు మంచి గుర్తింపునిచ్చింది.. ప్రపంచవ్యాప్తంగా వేగంగా దూసుకు వస్తున్న 'సూపర్ ఫ్లూడ్ మార్కెట్'కు అనుగుణంగా లైఫ్‌సైన్సెస్ కంపెనీలు ఏ విధంగా తమ ఉత్పత్తి విధానాలను మార్చుకోవాలనే విషయంపై ఒక దిశను సూచించగలిగింది. ప్రాణాంతకమైన క్యాన్సర్ నుంచి సాధారణ వ్యాధిగా మారిన మధుమేహం, బీపీ వ్యాధుల వరకు నివారణ, నియంత్రణకు నూతన చికిత్సావిధానాలు, పరిశోధనల్లో కనుక్కొన్న కొత్త పరికరాలు, ఔషధాలను పరిచయం చేసింది. ప్రపంచవ్యాప్తంగా కంపెనీలు ఈ సదస్సులో పాల్గొని శాస్త్ర,సాంకేతికపరంగా జీవశాస్త్రంలో వస్తున్న మార్పులు, సమీప భవిష్యత్‌లో వైద్య రంగంలో ఆధారంగా సవాళ్లపై చర్చించి పరస్పరం విలువైన సమాచారాన్ని తెలుసుకోవడానికి వీలుకలిగింది. బయోటెక్నాలజీలో కొత్త ఆవిష్కరణలతో మార్కెట్‌లోకి రానున్న స్టార్టప్ కంపెనీలకు సదస్సు ఉత్సాహాన్నిచ్చింది. పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో వివిధ ఔషధ కంపెనీల సహకారంతో ఈ నెల 17న ప్రారంభమైన బయోఏషియా సదస్సు బుధవారం విజయవంతంగా ముగిసింది. దేశ, విదేశాల నుంచి దాదాపు వందమంది ప్రపంచ ప్రఖ్యాత వైద్యనిపుణులు పాల్గొన్నారు. అమెరికా పెన్సిల్వేనియా యూనివర్సిటీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత క్యాన్సర్ వైద్యనిపుణుడు డాక్టర్ కార్ల్ జూన్, బ్రిటన్ స్కూల్ ఆఫ్ హైజీన్, ట్రాపికల్ మెడిసిన్ గ్లోబల్ హెల్త్‌డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ పీటర్ ప్లాట్, నోవార్టిస్ సీఈవో డాక్టర్ వాసంత్ నర్సింహన్ తదితరులు వైద్య రంగంలో వస్తున్న మార్పులపై నిర్దిష్టమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా 37 దేశాల నుంచి దాదాపు 2,100 మంది ప్రతినిధులు బయోఏషియా -2020 సదస్సులో పాల్గొన్నారు. దాదాపు 78 కంపెనీలు తమ ఉత్పత్తులు, పరిశోధనలను ప్రదర్శించాయి. పలు స్టార్టప్ కంపెనీలు నూతన ఆవిష్కరణలను పరిచయం చేశాయి. త్వరలో మార్కెట్‌లోకి కొత్త ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తేనున్నట్లు ప్రకటించాయి. మూడురోజులలో దాదాపు రెండువేల భాగస్వామ్య సమావేశాలు జరిగాయి. తెలంగాణ ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కేటీఆర్ బయోఏషియా సదస్సులో అన్నీతానై వ్యవహరించారు. పలు చర్చాగోష్ఠులకు సమన్వయకర్తగా వ్యవహరించి నిపుణుల నుంచి విలువైన సమాచారాన్ని రాబట్టారు. వివిధ దేశాల నుంచి వచ్చిన కంపెనీల ప్రతినిధులతో చర్చించి.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటూ ఆహ్వానించారు. హైదరాబాద్ ఔషధరంగానికి ఏ విధంగా డెస్టినేషన్ పాయింట్‌గా మారిందనే విషయాన్ని వివరించారు. తెలంగాణలో పెట్టుబడులకు పూర్తిగా అనుకూల వాతావరణం ఉన్నదనే విశ్వాసం కలిగించారు. బయోఫార్మా, బయోటెక్నాలజీరంగాల్లో వస్తున్న మార్పులు, చోటుచేసుకుంటున్న పరిణామాలపై కేటీఆర్ పూర్తి అవగాహనతో సాధికారికంగా మాట్లాడిన తీరు ఆకట్టుకున్నది. ప్రతినిధులందరూ బయోఏషియా సదస్సు నిర్వహణపై సంతృప్తి వ్యక్తంచేశారు. సదస్సు ఎంతో ఫలప్రదంగా జరిగిందని నోవార్టిస్ సీఈవో వాసంత్ నర్సింహన్ ప్రశంసించారు.

### బలహీన శిశువులకు వార్మ్ బ్లాంకెట్

నూతన ఆవిష్కరణలు

బయోఏషియా సదస్సులో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ కొత్త కొత్త వైద్యవిధానాలు, స్టార్టప్ కంపెనీల కొత్త ఆవిష్కరణలతో ఆకర్షణీయంగా నిలిచింది. యువ శాస్త్రవేత్తలు, వైద్యనిపుణులు కనుగొన్న కొత్త ఆవిష్కరణలను ఇందులో ప్రదర్శించారు. హైదరాబాద్ బాచుపల్లిలోని పరిశోధన టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కొత్తగా రూపొందించిన 'ఎయిర్ యాక్టివేటెడ్ ఇన్‌స్టాంట్ వార్మ్ బ్లాంకెట్' త్వరలో మార్కెట్‌లోకి రానున్నది. నెలలు నిండకముందు పుట్టిన, లేదా బలహీనంగా ఉన్న నవజాత శిశువును మారుమూల పల్లెప్రాంతాల నుంచి సురక్షితంగా వెచ్చని బ్లాంకెట్‌లో దవాఖానలకు తీసుకురావడానికి వీలుగా దీనిని రూపొందించారు. నియోవార్మ్ లైఫ్ సేవింగ్ బ్లాంకెట్ ఇప్పటికే నీలోఫర్ దవాఖానలో వాడుతున్నట్టు పరిశోధన టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు సత్యనారాయణ తెలిపారు. ఒడిశాతోపాటు ఇతర రాష్ట్రాల్లో కూడా వీటిని నేరుగా సరఫరా చేస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రోత్సాహంతో అన్ని ప్రభుత్వ దవాఖానలకు వీటిని సరఫరా చేయనున్నట్టు వెల్లడించారు.



ఎయిర్ యాక్టివేటెడ్ ఇన్‌స్టాంట్ వార్మ్ బ్లాంకెట్



దివ్యాంగుల కోసం ఫ్లెక్సోక్రచ్ పరికరం

#### వ్యర్థం నుంచి సంపద

వేస్ట్ టు వెల్త్ (వ్యర్థం నుంచి సంపద) నినాదంతో జేఎన్టీయూహెచ్-హబ్ అధ్యాపకులు, విద్యార్థులు ఇథనాల్ ఇంధనాన్ని తయారుచేస్తున్నారు. వ్యర్థంగా పారేసిన కూరగాయల నుంచి బయోటెక్నాలజీ, మైక్రో ఆర్గనిజం ద్వారా ఈ ఇంధనాన్ని తయారుచేయడంలో సఫలమవుతున్నారు. బయో ఫ్యూయల్ పాలసీకి అనుగుణంగా దీనిని ఉత్పత్తి చేస్తున్నట్టు జేఎన్టీయూ బయోటెక్నాలజీ అధిపతి ప్రొఫెసర్ ఉమ తెలిపారు. కాలినగాయాలతో కోలుకోలేని వారికి ఇన్నోస్కిన్ అనే స్టార్టప్‌సంస్థ ల్యాబ్‌లో రూపొందిస్తున్న త్రీ డైమెన్షన్ చర్మం, ఐఐటీ ఢిల్లీ విద్యార్థులు దివ్యాంగుల కోసం రూపొందించిన 'ఫ్లెక్సోక్రచ్' అందరి దృష్టిని ఆకర్షించాయి.

# తెలంగాణలో మహిళలకు అద్భుత అవకాశాలు

- లైఫ్‌సైన్సెస్ వృద్ధిలో తెలంగాణది కీలకపాత్ర
- ఫార్మా, బయోటెక్ హబ్‌గా రాష్ట్రం
- మిలియన్ అవకాశాలున్న లైఫ్‌సైన్సెస్ రంగం
- ప్యానల్ డిస్కషన్‌లో పిరమిల్ వైస్‌చైర్‌పర్సన్ స్వాతి పిరమల్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లైఫ్‌సైన్సెస్ రంగంలో మహిళలకు తెలంగాణ ప్రభుత్వం ఎన్నో అవకాశాలను కల్పిస్తుండటం గొప్ప విషయమని పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ వైస్‌చైర్‌పర్సన్ స్వాతి పిరమల్ అన్నారు. ఈ రంగంలోకి రావడానికి తన తండ్రే కారణమని తెలిపారు. తాను రూ.10 కోట్లతో కొనుగోలు చేసిన కంపెనీ, ప్రస్తుతం రూ.5 వేల కోట్ల టర్నోవర్‌కు చేరుకొన్నదని చెప్పారు. బయోఏషియా-2020 సదస్సులో భాగంగా బుధవారం హెచ్ఐసీసీలో జరిగిన ప్యానల్ డిస్కషన్‌లో ఈవై గ్లోబల్ హెల్త్‌సైన్సెస్ అండ్ వెల్‌నెస్ లీడ్ పార్టనర్ పమేలా స్పెన్స్ మాడరేటర్‌గా వ్యవహరించగా.. స్వాతి పిరమల్, బయోకాన్ బయోలాజిక్స్ ఇండియా సీఈవో క్రిస్టినా హామచెర్, సాన్‌డోజ్ డెవలప్‌మెంట్ సెంటర్ హెడ్ అరంకా స్టెఫాని, కంట్రీ హెడ్ నివృతి రాయ్ ప్యానలిస్టులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఉమెన్ ఇన్ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ అండ్ టెక్-ద జర్నీ ఫ్రం ఆస్పైర్ టు ఇన్‌స్పైర్'పై చర్చించారు. స్వాతి పిరమల్ మాట్లాడుతూ.. లైఫ్‌సైన్సెస్ రంగాన్ని అభివృద్ధి చేయడంలో తెలంగాణ కీలకపాత్ర పోషిస్తున్నదని ప్రశంసించారు. ఫార్మా, బయోటెక్ హబ్‌గా తెలంగాణ నిలుస్తున్నదని తెలిపారు. లైఫ్‌సైన్సెస్ రంగాన్ని అభివృద్ధి చేయడంలో తెలంగాణ నుంచి మిలియన్ అవకాశాలున్నాయని, ఆ దిశగా ఎదిగేందుకు అవసరమైన పది లక్షల మంది బాలికలను సిద్ధంచేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. నివృతిరాయ్, అలెంకా స్టెఫాని తమ తమ కంపెనీల్లో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకొన్నారు. లైఫ్‌సైన్సెస్‌లో రాణించాలకొనే మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలని సూచించారు.

#### ఏఐతో కచ్చితత్వం

మెడికల్ పరికరాల కచ్చితత్వం మెరుగుపర్చేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను అభివృద్ధి చేయాలని టెక్నాలజీ రంగ ప్రముఖులు పేర్కొన్నారు. అధునాతన సాంకేతికతను ఉపయోగించి మెడ్‌టెక్ కంపెనీలు సరైన వ్యూహాలను అమలుచేయాలని సూచించారు. హెల్త్‌కేర్ వార్షిక డాటా అవుట్‌పుట్ 2025 కల్లా 8.5 రెట్లు పెరుగుతుందన్నారు. మెడికల్ పరికరాల రూపకల్పన సవాళ్లతో కూడుకొని ఉంటుందని స్పష్టంచేశారు.

#### ఇన్నోవేట్ ఇన్ ఇండియా

'ఫ్యూయలింగ్ ఇన్నోవేషన్ ఇన్ మెడిటెక్' అనే అంశంపై నిర్వహించిన డిస్కషన్‌కు ఈవై గ్లోబల్ హెల్త్ సైన్సెస్ అండ్ వెల్‌నెస్ లీడ్ అనలిస్ట్ ఎలెన్ లిక్కింగ్ మాడరేటర్‌గా వ్యవహరించగా.. మెడ్‌ట్రోనిక్ ఇండియా ఎండీ మదన్ క్రిష్ణన్, ఎస్ఎంటీ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ భార్గవ్ కొటాడియా, జిమ్మర్ బయోమెట్ సౌత్ ఏషియా వైస్‌ప్రెసిడెంట్ కౌత్సవ్ బెనర్జీ, హిందూస్తాన్ సినర్జీస్ అండ్ మెడికల్ డివైజెస్ లిమిటెడ్ ఎండీ రాజీవ్‌నాథ్, స్విట్జర్లాండ్‌కు చెందిన రీసెర్చ్ ఇంజినీర్ స్టాపెల్ ఫెల్డ్ ప్యానలిస్టులుగా పాల్గొన్నారు. మేకిన్ ఇండియా మాదిరిగానే వైద్య సంబంధ పరికరాల కోసం ఇన్నోవేట్ ఇన్ ఇండియాపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. ఇండియాలో ఇప్పటికే పెరిగిన ఇన్నోవేషన్ ప్రాధాన్యాన్ని పూర్తిస్థాయిలో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. ఫిజీషియన్ల నైపుణ్యాన్ని పెంచడంపై పెట్టుబడి పెట్టాలని, అది మెడికల్ డివైజెస్ ఎకో సిస్టం అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు.

#### వినూత్న ఆవిష్కరణలకు గుర్తింపు

బయోఏషియా- 2020 సదస్సుకు 350 స్టార్టప్‌లు దరఖాస్తు చేసుకోగా.. 75 స్టార్టప్‌లను మాత్రమే ఎంపికచేశారు. ఈ స్టార్టప్‌లు తమ ఆవిష్కరణలను ప్రదర్శించి, వాటి ఉపయోగాలను వివరించాయి. వినూత్నమైన, ఉపయోగకరమైన ఆవిష్కరణలను తయారుచేసిన 5 ఉత్తమ స్టార్టప్‌లకు అవార్డులతో పాటు నగదు బహుమతులను అందజేశారు. ఉత్తమ స్టార్టప్‌లుగా ఎంపికైనవాటిలో లైకాన్ త్రీడీ, కాల్జీ, ఒంకోసిమిస్ బయోటెక్, హీమాక్ హెల్త్‌కేర్, ఫెక్సిమోటివ్ టెక్నాలజీస్ ఉన్నాయి.

# బయోఏషియా సూపర్‌హిట్

మొదటిపేజీ తరువాయి...

మొబిలిటీ అండ్ హెల్త్ కేర్' హబ్ ఏర్పాటుకు మంత్రి కేటీఆర్ శ్రీకారంచుట్టారు. ఈ సంస్థను ఇంటెల్ సంస్థ ఏర్పాటు చేయనుండగా, కేంద్ర ప్రభుత్వం, రిచ్, ఇతర సంస్థలు భాగస్వామ్యం కానున్నాయి. బయోఏషియాలో మెడ్‌టెక్ ప్రాజెక్టు కోసం సైయెంట్ కంపెనీ తెలంగాణ ప్రభుత్వ సంస్థ రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్(రిచ్)తో ఎంవోయూ కుదుర్చుకొన్నది. సైయెంట్ సంస్థ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, రిచ్ డైరెక్టర్ జనరల్ అజిత్ మంగ్నేకర్ ఒప్పందాలపై సంతకాలుచేశారు. సుల్తాన్‌పూర్‌లోని మెడికల్ డివైజెస్ పార్క్‌లో ఐదు కంపెనీలకు భూ కేటాయింపులు చేశారు. భూ కేటాయింపులకు సంబంధించిన పత్రాలను మంత్రి వారికి అందించారు.

#### మెడ్‌టెక్ సీఈవోతో మంత్రి కేటీఆర్ సమావేశం

మెడికల్ టెక్నాలజీ కంపెనీలకు సంబంధించిన సీఈవోలతో మంత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ప్రఖ్యాతిగాంచిన కంపెనీల సీఈవోలు పాల్గొన్నారు. మెడ్‌టెక్ కంపెనీలకు రాష్ట్రంలో ఉన్న పెట్టుబడుల అవకాశాలను మంత్రి కేటీఆర్ వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వపరంగా అన్నివిధాలుగా సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కంపెనీల స్థాపనలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. సుల్తాన్‌పూర్ మెడ్‌టెక్ పార్క్‌లో అన్ని వసతులు ఉన్నాయని, త్వరలో పార్క్‌ను మరింత విస్తరించనున్నామని చెప్పారు. ఇందుకు అవసరమైన భూమిని కేటాయిస్తామన్నారు.

# తెలంగాణ దేశానికి మోడల్

మొదటిపేజీ తరువాయి...

నమస్తే తెలంగాణకు ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

**గోదావరి జలాల పరిరక్షణ కోసం మీరు ప్రత్యేకంగా యాత్ర చేపట్టాల్సిన నేపథ్యాన్ని వివరిస్తారా?**

గోదావరి.. దక్షిణగంగ. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మీదుగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది. గోదావరి తీరప్రాంతాలను పరిపుష్టం చేసే క్రమంలో కొత్త రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణ జాతీయస్థాయిలో కాళేశ్వరం ప్రాజెక్టుతో రికార్డు నెలకొల్పింది. దీని ఫలితాలు ఎలా ఉన్నాయి? గోదావరి ఉపనదులైన ప్రాణహిత, ఇంద్రావతి, శబరి వంటి వాటి స్థితిగతులు ఎలా ఉన్నాయి? భవిష్యత్ ఎలా ఉండబోతున్నదన్న అంశాన్ని తెలుసుకోవటంతోపాటు, ప్రతి ఒక్కరికీ నీటి చైతన్యం పట్ల అవగాహన పెంపొందించాలి. అందుకోసం యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కాలేజీల పరిశోధన, భాగస్వామ్యాన్ని నాకు తోచినరీతిలో నా అనుభవంలోంచి చెప్పాలని.. గోదావరి పుట్టిన నాసిక్ నుంచి ఫిబ్రవరి 14న బయలుదేరాను. నేను చేపట్టిన గోదావరి పరిరక్షణ యాత్ర ఈ నెల 22న రాజమండ్రిలో ముగుస్తుంది.

**మీరు గతంలో కూడా తెలంగాణలో గోదావరి పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. అప్పటికీ ఇప్పటికీ మార్పులేమైనా వచ్చాయా?**

ఆరేండ్ల క్రితం గోదావరి పరీవాహక ప్రాంతాల్లో పర్యటించాను. అప్పుడు గోదావరిని చూస్తే ఆందోళన కలిగింది. ఇప్పుడు ఆనందం కలుగుతున్నది. గోదావరి ఉపనదులైన ప్రాణహిత, ఇంద్రావతి, శబరి వంటి నదుల నీటితో మహారాష్ట్ర కంటే తెలంగాణలో కిలోమీటర్ల పొడవునా నదీప్రవాహం ఉన్నది. అద్భుతమైన దృశ్యం తెలంగాణలో ఆవిష్కృతమైంది. తెలంగాణ కొత్తగా ఏర్పడిందే అయినా వందేండ్ల ముందుచూపుతో వ్యవహరిస్తున్నది. నీటి వనరుల వినియోగం మాత్రమే కాకుండా.. వాటిని పరిరక్షించాల్సిన అనివార్యతలను గుర్తించిన రాష్ట్రంగా తెలంగాణ అద్భుతమైన నీటిస్పృహతో ముందుకు సాగుతున్నది. వాతావరణ సమతుల్యతను కాపాడటం, ఆరోగ్యవంతమైన, ఆకుపచ్చని తెలంగాణను ఆవిష్కరించుకోవాలన్న దూరదృష్టితో కూడిన పాలనను ఇక్కడ సీఎం కేసీఆర్ చేపట్టారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు ఇక్కడిస్తున్న ప్రాధాన్యం మరెక్కడా నేను చూడలేదు. గ్రామీణ నేపథ్యాన్ని పురోగమపథంలో నడిపించడం గొప్పవిషయం. ఈ దేశ భౌగోళిక అస్తిత్వాన్ని అందిపుచ్చుకొని అందుకు అనువైన ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్న రాష్ట్రంగా తెలంగాణ ఇవ్వాళ దేశానికే సరికొత్త నీటిపాఠాలు నేర్పిస్తున్నది. తెలంగాణ చేపట్టిన విప్లవాత్మక చర్యల వల్ల రైతు ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి. నీటివినియోగంలో తెలంగాణ చేసిన ప్రయోగం ఫలవంతమయ్యేదిశగా ముందుకు సాగుతున్నది. సహజవనరుల పరిరక్షణ, నదీజలాల పరిరక్షణ, వినియోగం విషయంలో యావత్‌దేశం తెలంగాణను కచ్చితంగా ఆదర్శంగా తీసుకోవాలి. రాజ్యాంగంలోని 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకు అపారమైన బాధ్యతల్ని ఇచ్చింది. నీటివనరుల వినియోగం అన్నది పరిపాలనలో అంతర్భాగమైన అంశమని చాలా మందికి తెలియదు. తెలంగాణ రాజ్యాంగ స్ఫూర్తిని పుణికిపుచ్చుకొన్నది. మానవీయ ఆర్తిని ఇనుమడింపచేసేందుకు ప్రయత్నిస్తున్నది. అందులో భాగంగానే మొదట చిన్న నీటి వనరుల పరిరక్షణ కోసం చెరువుల పునరుద్ధరణను చేపట్టింది. తర్వాత భారీ ప్రాజెక్టులను చేపట్టి, కాళేశ్వరం వంటి ప్రాజెక్టును రికార్డుస్థాయిలో నిర్మించింది. మహారాష్ట్ర, గుజరాత్ కొద్దిగా ప్రయత్నించాయి. కానీ తెలంగాణ అలా కాదు.. ప్రయత్నించి.. ఫలితాలను కూడా రైతులకు అందిస్తున్నది.



'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతున్న వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్

**మీరు అనేక రాష్ట్రాలు, దేశాలు పర్యటించారు. ఈ కోణంలో చూసినప్పుడు తెలంగాణ అనుసరిస్తున్న కార్యాచరణపై మీ కామెంట్?**

మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు సందర్భానికి అనుగుణంగా ప్రజలకు వాగ్దానాలుచేస్తాయి. కానీ ఇక్కడ (తెలంగాణ) అలాకాదు. సహజంగా నీరు కిందికి (పల్లం) ప్రవహిస్తుంది. కానీ తెలంగాణలో మాత్రం పైకి ప్రవహించేలా ప్రణాళికలు రూపొందించి విజయవంతంగా అమలుచేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే నీటిని వెనుకకు నడిపించి గోదావరికి కొత్త నడక నేర్పారు. ఇది నిజంగా సాహసోపేతమైన చర్య. ఇటువంటి సాహసాలు ప్రజల యోగక్షేమాల పట్ల చిత్తశుద్ధి ఉన్న పాలకులు మాత్రమే చేస్తారు. నిజానికి నదులను ఇతర నీటివనరుల పరిరక్షణ అన్న స్ఫూర్తి పూర్వకాలంలో ఉండేది. కానీ ఇప్పుడు ఆ స్పృహ పాలకులకు కొరవడింది. పాలనకు గైడింగ్ ఫోర్స్‌గా ఉండే మధ్యతరగతి, మేధావి, విద్యార్థివర్గానికి ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితులు కనిష్ఠస్థాయికి వెళ్లాయి.

**మీ గోదావరియాత్రలో ప్రధానంగా యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కాలేజీలను ఎంచుకోవడం వెనుక కారణమేమిటి?**

ఇప్పటికే యూరప్ దేశాల్లో నీటియుద్ధాలు జరుగుతున్నాయి. మన దేశంలోనూ పలు రాష్ట్రాల మధ్య నదీజలాల వివాదాలు పతాకస్థాయిలో ఉన్నాయి. నీటి వనరుల సంరక్షణ పట్ల ముందుచూపులేదు. రాజకీయ కారణాలూ వీటికి కారణమవుతున్నాయి. గోదావరి వినియోగం, పరిరక్షణ, సఖ్యత వంటి అంశాల్లో తెలంగాణ ఫార్ బెటర్. తనకు తానుగా ఎగువ (మహారాష్ట్ర) దిగువ (ఆంధ్రప్రదేశ్) రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపింది. పంతాలకు, భేషజాలకు పోకుండా చిన్నరాష్ట్రమే అయినా పెద్దన్నలాగా వ్యవహరించింది. పరస్పర అవగాహన, ప్రయోజనం, సంప్రదింపుల ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయన్న కొత్త చరిత్రకు తెలంగాణ శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే ఇవ్వాళ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, ప్రారంభ సమయంలో మిగిలిన రెండు రాష్ట్రాల పాలకులు హాజరై సౌహార్ద సంకేతమిచ్చారు. ఇదొక మంచి సంకేతం. ఈ క్రమంలో విద్యార్థులు, టెక్నోక్రాట్లలో అవగాహన కల్పించాలి. అందులో భాగంగానే నా యాత్ర నాసిక్ యూనివర్సిటీ నుంచి మొదలుపెడితే ఇక్కడి ఇంజినీరింగ్ (నిట్) కాలేజ్, కాకతీయ యూనివర్సిటీ దాకా.. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులతో మాట్లాడుతున్నా. అదృష్టవశాత్తు అందరూ తమ జీవన ప్రమాణాల పెంపుతోపాటు చాలాకాలం ఆరోగ్యంగా బతకాలని కోరుకుంటున్నారు (నవ్వుతూ). అలా సాగాలంటే వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణ, నీటి నిల్వల ప్రాధాన్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానాలపై చర్చిస్తున్నాం. సమాజ జీవన చిత్రం మార్పుకోసం మనవంతుగా ఏంచేయాలన్నదానిపై ప్రతిఒక్కరిలో అవగాహన కలగాలి. వాటర్ లిటరసీ పెరగాలి.

**నీటి నిలువ, పరిరక్షణ, వినియోగం వంటి అంశాల్లో మీరు ఇంకా ఏవైనా సూచనలు చేస్తారా?**

అన్ని నిధుల కన్నా జలనిధులే ముఖ్యమన్న స్పృహ అందరిలో కలగాలి. మిషన్ కాకతీయ సందర్భంగా ఇక్కడ కలిగింది. ఇదే విషయాన్ని నేను స్టాక్‌హోం సదస్సులో ప్రస్తావించాను. చిన్ననీటి వనరుల నిర్మాణ వినియోగంలో ప్రజల భాగస్వామ్యం గొప్పగా ఉన్నది. కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టుల నిర్మాణం తొలిదశ పూర్తయింది. ప్రాజెక్టు నిర్మాణదశలో ప్రజల భాగస్వామ్యం సాధ్యం కాదు. రెండోదశ వినియోగం, పరిరక్షణ విషయంలో ప్రజలను భాగస్వాములను చేసేదిశగా ఇక్కడ విధాననిర్ణయాలు తీసుకొంటున్నారని (నీరటి దగ్గరి నుంచి ఈఎన్సీ వరకు వ్యవస్థను బలోపేతంచేయడమే కాదు నీటిసంఘాలను మరింత పటిష్ఠం చేయడం కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలు) తెలిసింది. అది స్వాగతించవలసిన పరిణామం. దీంతోపాటు గోదావరి పరిరక్షణ, వినియోగంపై సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతున్న తెలంగాణ.. ఇందు కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి.



బుధవారం మాదాపూర్‌లోని సీసీఆర్టీ ప్రాంగణంలో మొక్కనాటిన ప్రఖ్యాత డ్రమ్మిస్ట్ శివమణి తదితరులు

## గ్రీన్‌చాలెంజ్‌లో శివమణి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రతిఒక్కరూ మొక్కలునాటాలని, పుట్టినరోజు బహుమతులుగా కూడా మొక్కలనే ఇవ్వాలని ప్రపంచ ప్రఖ్యాత డ్రమ్మిస్ట్ శివమణి పిలుపునిచ్చారు. గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా హైదరాబాద్ మాదాపూర్‌లోని సీసీఆర్టీ ప్రాంగణంలో బుధవారం శివమణితోపాటు ప్రముఖ గిటారిస్టు మోహిని డే, సంగీతకారుడు వేణుగాన నాగరాజు, గాయని మణి నాగరాజు, సీసీఆర్టీ అధికారులు తాడేపల్లి సత్యనారాయణ, చంద్రశేఖర్ మొక్కలునాటారు. కార్యక్రమంలో గ్రీన్‌చాలెంజ్ ప్రతినిధులు రాఘవ, కిశోర్‌గౌడ్, కాదంబరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని మిడ్ మానేరు జలాశయం కాళేశ్వరం నీటితో కళకళలాడుతున్నది. ఎటు చూసినా గోదారి జలసిరి కనువిందుచేస్తున్నది. ఓ వైపు నీటి పరవళ్లు.. మరోవైపు పచ్చని పైర్లతో పుడమితల్లి పులకరిస్తున్నది. ఈ దృశ్యం పర్యాటకులకు కనువిందుచేస్తున్నది.







బుధవారం సీఎస్ సోమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ వీ మమత తదితరులు

## పీఆర్సీ త్వరలోనే వస్తుంది

- ఈ మేరకు సీఎస్ హామీ ఇచ్చారు
- ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** త్వరలోనే పీఆర్సీ వస్తుందని, కమిషన్ గడువు పెంపునకు పీఆర్సీ ప్రకటనకు సంబంధం లేదని, దీనిపై ఉద్యోగులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ వీ మమత స్పష్టంచేశారు. పీఆర్సీ నివేదిక సిద్ధంగా ఉన్నదని, నెలరోజుల్లో కమిషన్ నివేదిక అందిస్తారని చెప్పారు. వేతన సవరణ కమిషన్ గడువు పెంపు నేపథ్యంలో ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు బుధవారం సీఎస్ సోమేశ్‌కుమార్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. అనంతరం పలు ఉద్యోగ సంఘాలతో కలిసి జేఏసీ అధ్యక్షుడు, సెక్రటరీ జనరల్ మీడియాతో మాట్లాడారు. పీఆర్సీ అనేది వేతన సవరణ కోసమే ఏర్పాటు చేయలేదని, ఉద్యోగులకు సంబంధించిన అనేక విషయాలపై అధ్యయనానికి ఈ కమిటీ ఏర్పాటుచేశారన్నారు. పీఆర్సీ గడువు పెంచుతూ జీవో రావడంతో ఉద్యోగులు కొంత ఆందోళన చెందారని, ఈ ఏడాది కూడా వేతనాలు పెంచరనే అనుమానంతో ఉన్నారని, అందుకే సీఎస్‌ను కలిసి వివరించాల్సి వచ్చిందని తెలిపారు. సీఎస్ కూడా గడువు పెంపుపై ఆందోళన వద్దని స్పష్టంగా చెప్పారన్నారు. మార్చిలో పీఆర్సీ వస్తుందని, త్వరలోనే ఉద్యోగ సంఘాలను పిలిచి మాట్లాడుతామని సీఎస్ చెప్పారని వివరించారు. సీఎస్‌ను కలిసినవారిలో జేఏసీ సెక్రటరీలు మామిళ్ల రాజేందర్, ఏనుగుల సత్యనారాయణ, పలు సంఘాల ప్రతినిధులు రేచల్, వెంకటేశ్వర్లు, ఉమ, కొండల్‌రెడ్డి, లక్ష్మణ్, పతాప్, శ్రీకాంత్, ఎంబీ కృష్ణయాదవ్, గండూరి వెంకటేశ్వర్లు, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పద్మాచారి, టీటీయూ అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, జేఎల్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, విశ్వవిద్యాలయాల ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మధుకర్ పాల్గొన్నారు.

# మొక్క మొక్కకూ లెక్క



- ఆన్‌లైన్ ద్వారా మొక్కల పర్యవేక్షణ
- నాటిన నాటినుంచి సంరక్షణ
- అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రయోగం
- ప్రతిసెంటర్‌లో కనీసం రెండుమొక్కల పెంపకం
- మహిళా దినోత్సవం నాటికి 37,500 కేంద్రాల్లో హరితహారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాటే ప్రతిమొక్కనూ ఇకనుంచి ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షించేలా మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో దీన్ని ప్రయోగాత్మకంగా చేపడుతున్నారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా గత సోమవారం నుంచే అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం అంగన్‌వాడీల్లో హరితహారం నినాదంతో మొక్కలు నాటడం, సంరక్షించడం చేపట్టారు. అయితే క్షేత్రస్థాయిలో నాటుతున్న మొక్కలను సంరక్షించడం లేదనే ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రత్యేక పరిరక్షణ చేపట్టింది. రాష్ట్రంలో మొత్తం 37,500 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంతోపాటు మినీ అంగన్‌వాడీలు, ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో రెండు మొక్కలను కచ్చితంగా నాటాలని ఆదేశాలు జారీచేశారు. మార్చి 8న మహిళా దినోత్సవం నాటికి ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటాలని పేర్కొన్నారు.

### నాటిన మొక్కలన్నీ వెబ్‌సైట్‌లో

అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటినవెంటనే దానిని ఫొటోతీసి..'అంగన్‌వాడీల్లో హరితహారం' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. దీంతో ఎన్నికేంద్రాల్లో ఎన్ని మొక్కలు నాటారనే లెక్కలు ఉంటాయి. మొక్కను వెబ్‌సైట్‌లో నమోదుచేశాక ప్రతివారం దాని ప్రగతిని వివరించాలి. వారం తర్వాత ఆ మొక్క ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నదో తెలిపేలా మళ్లీ ఫొటోతీసి వెబ్‌సైట్‌లో ఉంచాలి. ఎక్కడెక్కడ నుంచి మొక్కల సంరక్షణ ఫొటోలు రాలేదనే వివరాలు కూడా వెంటవెంటనే తెలుసుకునేలా వెబ్‌సైట్ రూపొందించారు. జిల్లా, మండలం, గ్రామం, అంగన్‌వాడీ కేంద్రం నంబర్ వేసిమొక్కఫొటోతో ఒకసారి అప్‌లోడ్ చేశాక దాని వివరాలు వెబ్‌సైట్‌లో సమగ్రంగా ఉంటాయి. దీన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత మంత్రి ఎక్కడినుంచైనా తెలుసుకునే వీలుంటుంది. ముందుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం సోమవారం నుంచే మొదలైంది. ప్రతిమొక్కను సంరక్షించేవిధంగా చర్యలు తీసుకునే నేపథ్యంలోనే ఈ వెబ్‌సైట్‌ను రూపొందించామని మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి దివ్య తెలిపారు. ఎక్కడినుంచైనా.. ఎక్కడి మొక్క సంరక్షణ, పరిస్థితి తెలసుకునూ వీలుంటుందని చెప్పారు. దీంతో మొక్కల సంరక్షణపై అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు, సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకుంటారని పేర్కొన్నారు.

### హరితహారం మొక్కలకు ట్యాంకర్లతో నీళ్లు

హరితహారంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నాటిన మొక్కలను బతికించుకునేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలకశాఖ ప్రత్యేక దృష్టిపెట్టింది. ఇప్పటికే నాటిన మొక్కలతోపాటు సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం నాటినవాటినీ సంరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. కనీసం 80శాతం మొక్కలను బతికించుకొని రాష్ట్రంలో పచ్చదనం నింపేందుకు కృషిచేస్తున్నారు. ఇందుకోసం ఉపాధి నిధులను వినియోగిస్తున్నారు. ఉపాధిహామీ కూలీలతో మొక్కలకు కంచె ఏర్పాటుచేయిస్తున్నారు. నీరుపోసే బాధ్యతను కూడా వారికే అప్పగించారు. నీళ్లకోసం గ్రామాల్లో వాటర్ ట్యాంకర్‌ను ఏర్పాటుచేస్తున్నారు. ప్రభుత్వమే ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి గ్రామాలకు ఇస్తున్నది. ట్యాంకర్‌ను కూడా కచ్చితంగా కొనుగోలు చేయాలని నిబంధన విధించింది. ఇంకా కొనుగోలు చేయని పక్షంలో అద్దె ప్రాతిపదికన ట్యాంకర్లు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

### రోడ్ల వెంట అందుబాటులో నీరు

రాష్ట్రంలోని 18,592 రహదారుల వెంట 66,947 కిలోమీటర్లలో 82 లక్షల మొక్కలు నాటినట్టు పంచాయతీరాజ్‌శాఖ నివేదిక పేర్కొన్నది. మరో 10 వేల ఇతర దారుల వెంట 24వేల కిలోమీటర్ల పరిధిలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఆయారోడ్ల రోడ్ల వెంట నాటిన మొక్కలను సంరక్షించేందుకు నీటివసతులను గుర్తిస్తున్నారు. కొన్నిప్రాంతాల్లో పశువుల కోసం గతంలో నిర్మించిన నీటి గుంతలను సంబంధిత అధికారులు తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. వీటిసాయంతో మొక్కలకు నీరు పోయనున్నారు. మొక్కల సంరక్షణకు పంచాయతీరాజ్‌శాఖ కీలకంగా వ్యవహరిస్తున్నది. గ్రామాల్లో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు మొక్కల సంరక్షణపై ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. మొక్కల సంరక్షణలో వచ్చే నాలుగు నెలలు కీలకమని పంచాయతీరాజ్‌శాఖ తమ సిబ్బందికి సూచించింది. జూన్, జూలై వరకు మొక్కలను రక్షించుకొంటే తర్వాత ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటుచేసేందుకు పంచాయతీరాజ్‌శాఖనుంచి ప్రత్యేకంగా నిధులను కేటాయించారు. వీటికికూడా ఉపాధిహామీ పథకం నుంచి నిధులను చెల్లిస్తున్నారు. ఎండాకాలంలో మాత్రం ఎవెన్యూ ప్లాంటేషన్ రక్షణ కోసం రోజువిడిచి రోజు ఉదయం, సాయంత్రం నీరు పట్టించాలని స్పష్టంచేశారు. నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో రోజువారిగా నీళ్లు పోయాల్సి ఉంటుందని సూచించారు.

## ఆ 1800 కిలోల బంగారం ఎక్కడ?

- శ్రీకృష్ణా జువెలరీ కుంభకోణంలో చీకటి కోణాలు
- బంగారం తరలింపులో కీలకవ్యక్తి సునీల్ అరెస్టు



రంగురాళ్లు అమర్చిన చెవి రింగు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 1,800 కిలోల బంగారాన్ని పక్కదారి పట్టించారు. సెజ్‌లో ఆభరణాలపై తనిఖీలు లేకపోవడాన్ని అదునుగా భావించి వందల కోట్ల విలువైన బంగారాన్ని పక్కదారి పట్టించారు. దీనిపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) దృష్టిపెట్టి రూ.756 కోట్ల విలువైన బంగారాన్ని సెజ్‌ల పేరిట తప్పించిన వైనాన్ని వెలుగులోకి తెచ్చింది. గతేడాది మే 3న నమోదైన ఈ కేసులో ఇప్పటికే శ్రీకృష్ణ జువెలర్స్ ఎండీ ప్రదీప్‌తోపాటు ఐదుగురిని డీఆర్‌ఐ అధికారులు అరెస్టు చేశారు. కీలక నిందితుడైన శ్రీకృష్ణ జువెలర్స్ ఉద్యోగి సునీల్‌ను తమిళనాడులో మంగళవారం అరెస్టు చేశారు. నిందితుడిని మదురై కోర్టులో ప్రవేశపెట్టిన అధికారు లు.. బుధవారం నాంపల్లిలోని ఆర్థిక నేరాల విభాగం ప్రత్యేకకోర్టులో హాజరుపర్చారు. చంచల్‌గూడ జైలుకు తరలించారు.

### ఇరుక్కొంటామని అజ్ఞాతంలో ఉంచారు

సునీల్‌ను అరెస్టుచేస్తే తాము ఇరుక్కోక తప్పదని గ్రహించిన శ్రీకృష్ణ జువెలర్స్ యజమాని ప్రదీప్.. సునీల్‌తోపాటు అతడి భార్య, కొడుకును అజ్ఞాతంలో ఉంచి సదుపాయాలు కల్పించాడు. నెలకు రూ.10వేల జీతం అందిస్తూ సునీల్ కుమార్తె చదువు ఖర్చులు ప్రదీప్ భరించినట్టు సమాచారం. తొమ్మిది నెలలుగా సునీల్‌ను కనిపెట్టేందుకు డీఆర్‌ఐ అధికారులు తీవ్రంగా యత్నించారు. పుణె నుంచి తమిళనాడుకు మారినట్టు తెలుసుకొన్న అధికారులు.. సునీల్ చిరునామా కనిపెట్టి అరెస్టుచేశారు.

### పాలుపోస్తూ నమ్మకస్థుడయ్యాడు

ప్రదీప్ కుటుంబానికి 20 ఏండ్ల క్రితం సునీల్ పాలుపోసేవాడు. ఆ క్రమంలో నమ్మకస్థుడిగా మారిన సునీల్‌ను తన సంస్థలో ఉద్యోగిగా తీసుకొన్నాడు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో జెమ్స్ సెజ్‌లో బంగారు దిగుమతి చేసుకొని ఆభరణాలుగా మార్చి విదేశాలకు ఎగుమతిచేసే యూనిట్‌ను ప్రదీప్ ఏర్పాటుచేశారు. ఈ సెజ్‌లో ఆభరణాల పేరిట తెచ్చే బంగారాన్ని పక్కదారి పట్టించి, బంగారు బిస్కెట్లపై నంబర్లు, ఇతర వివరాలను చెరిపి, వాటిని బంజారాహిల్స్‌లోని శ్రీకృష్ణ జువెలర్స్‌కు తరలించడంలో సునీల్ కీలకపాత్ర పోషించేవాడు.

### ఇదీ అసలు కుంభకోణం

రావిర్యాలలోని జెమ్స్ అండ్ జువెలరీ సెజ్‌లో పెద్దమొత్తంలో బంగారం పక్కదారిపట్టినట్టు అందిన సమాచారం మేరకు డీఆర్‌ఐ అధికారులు నిఘా పెట్టారు. గతేడాది మే 3న సెజ్‌లోని శ్రీకృష్ణ జువెలరీకి చెందిన యూనిట్‌లో తనిఖీలు చేపట్టారు. ఆభరణాలు తయారుచేసి ఎగుమతి చేయాల్సి ఉండగా.. కొద్దిమొత్తంలో బంగారానికి విలువైన రంగురాళ్లు కలిపి తయారుచేస్తున్నారని, అందులో మిగిల్చిన బంగారాన్ని స్థానిక మార్కెట్‌లోకి తరలిస్తున్నట్టు గుర్తించారు. మొత్తం 1,800 కిలోల బంగారం పక్కదారి పట్టించినట్టు తేల్చారు. ఇప్పటివరకు రూ.16.71 కోట్ల విలువైన 51.5 కిలోల బంగారాన్ని, రూ.2.92 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, ఆభరణాల తయారీలోవాడే ఖరీదైన రాళ్లు, వజ్రాలతోపాటు రూ.2.24 కోట్ల నగదు స్వాధీనం చేసుకొన్నారు. మిగిలిన బంగారం కోసం డీఆర్‌ఐ తనిఖీలు ముమ్మరం చేసినట్టు తెలిసింది.

## విద్యుత్ అమ్మే స్థాయికి తెలంగాణ

- సరఫరా, పంపిణీ నష్టాలను తగ్గించుకోవాలి
- విద్యుత్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రా



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రా

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తెలంగాణ విద్యుత్‌ను కొనుగోలు చేసుకొనే స్థాయినుంచి విక్రయించే స్థాయికి చేరుకోబోతున్నదని విద్యుత్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రా తెలిపారు. రెండుమూడేండ్లలో తెలంగాణ సొంతంగా తొమ్మిది వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందని, మన అవసరాలతోపాటు ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తామన్నారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ శతాబ్దివేడుకల్లో భాగంగా బుధవారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్యభవన్‌లో నిర్వహించిన 'పాలసీస్ ఆఫ్ గవర్నమెంట్స్ పారడైమ్స్ చాలెంజెస్ అండ్ అపార్చునిటీస్ ఫర్ సస్టెయినబుల్ ఎలక్ట్రికల్ పవర్ ఇన్ ఇండియా' అంశంపై రెండురోజుల జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని, 2014 లో 7 వేల మెగావాట్ల సరఫరా ఉంటే ఇప్పుడు 16 వేల మెగావాట్లకు చేరుకుందని, అయినా వ్యవసాయం ఇతర రంగాలకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్‌నందిస్తున్నామని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తిలోనూ తెలంగాణ పురోగమిస్తున్నదని, గతంలో 4,500 మెగావాట్లు ఉత్పత్తిచేయగా, ఇప్పుడు 8వేల మెగావాట్లను ఉత్పత్తిచేస్తున్నామని, ఇటీవల విద్యుత్ డిమాండ్ ఒకరోజు 12,800 మెగావాట్లకు చేరిందని చెప్పారు. డిస్కంలు సరఫరా, పంపిణీ నష్టాలను తగ్గించుకోవాలని, సాంకేతిక సామర్థ్యం పెరిగినా 10 -12 శాతం నష్టాలను చవిచూస్తున్నామని తెలిపారు.

**అందుబాటులోకి విండ్, సోలార్ విద్యుత్**

ప్రస్తుతమున్న జల, థర్మల్ విద్యుత్‌తోపాటు, విండ్, సోలార్, బయోమాస్, జియోథర్మల్ విద్యుత్‌లు అందుబాటులోకి వస్తున్నాయని తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ వైస్‌చైర్మన్, ఎండీ ఎన్ జానయ్య చెప్పారు. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరిగి, ఈ మొబిలిటీ విస్తృతం కానుందని, కేంద్రం టారిఫ్‌ను ఖరారుచేసిందని, తెలంగాణవ్యాప్తంగా 139 ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్‌స్టేషన్లు మంజూరైతే గ్రేటర్ హైదరాబాద్‌లోనే 120, వరంగల్, కరీంనగర్‌లలో మరో 19 స్టేషన్లు ఏర్పాటుకానున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ జీ రామేశ్వర్‌రావు, గౌరవ కార్యదర్శి టీ అంజయ్య, గౌరవ సంయుక్త కార్యదర్శి డాక్టర్ రమణ్‌నాయక్, కార్యక్రమ కన్వీనర్ ప్రొఫెసర్ సీ రామానుజాచార్యులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రిన్సిపాల్ పోస్టులకు నోటిఫికేషన్

దరఖాస్తులకు మార్చి 20 గడువు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్)లో ఇప్పటికే విడుదలచేసిన 19 డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ (మహిళ) పోస్టులకు అదనంగా తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్)లో 15 డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోస్టుల భర్తీకి బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. అర్హులైన అభ్యర్థులు మార్చి 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. వివరాల కోసం 'www.treirb.net', 'www.telangana.gov.in' వెబ్‌సైట్లలో చూడాలని పేర్కొన్నారు.

## శివరాత్రికి టీఎస్‌టీడీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహాశివరాత్రి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌టీడీసీ) వేములవాడకు ప్రత్యేక టూర్ ప్యాకేజీ ప్రకటించింది. గురువారంనుంచి మూడ్రోజులు ఈ ప్యాకేజీ ఉంటుందని బుధవారం ఒక ప్రకటనలో అధికారులు తెలిపారు. హైదరాబాద్-వేములవాడ-హైదరాబాద్ టూర్ ఉంటుందని, పెద్దలకు రూ.550, పిల్లలకు రూ.440 టికెట్‌గా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. బషీర్‌బాగ్ పర్యాటకభవన్ నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరే బస్సు.. మధ్యాహ్నం వేములవాడకు చేరుకుంటుందని, ప్రత్యేక దర్శనం కల్పిస్తామని వెల్లడించారు. ఈ టూర్ ప్యాకేజీని గురువారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభిస్తారని తెలిపారు.

# కమలనాథుల్లో కలవరం

- వివాదాస్పద వ్యాఖ్యలతో అభాసుపాలవుతున్న బీజేపీ
- వివరణ ఇచ్చుకోలేక.. మౌనమే నా భాష అంటున్న కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'కాంగ్రెస్ పార్టీకి ఓట్లేయకుంటే తెలంగాణను తీస్కపోయి మళ్లీ ఆంధ్రల కలుపుతం..' వంటి వివాదాస్పద, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేత లు కేరాఫ్‌గా ఉండేవారు. వారి కంటే తామేం తక్కువ తిన్నామన్నట్టు బీజేపీ నేతలు కూడా వారి సరసన నిలుస్తున్నారు. ఇందుకు తాజా గా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి చేసిన 'ఎర్రబస్సు' వ్యాఖ్యలే నిదర్శనం. ము ఖ్యంగా తెలంగాణ ప్రజలన్నా.. ఇక్కడి ప్రజల మనోభావాలన్నా.. గౌరవంలేని ఈ ఢిల్లీ పార్టీలకు ఇదో ఆనవాయితీగా మారింది. అందుకే ఎర్రబస్సు వ్యాఖ్యలుచేసి రెండురోజులవుతు న్నా కనీసం తెలంగాణ సమాజానికి వివరణ ఇచ్చుకోలేని, ఇవ్వడం ఇష్టంలేని, మౌనంగా ఉన్న దీనస్థితిలో కిషన్‌రెడ్డి కొట్టుమిట్టాడుతున్నారని ఆ పార్టీ నేతలే పెదవి విరుస్తున్నారు. ఇలాంటి పరిణామాలు ఆ పార్టీలో కలవరానికి గురిచేస్తున్నాయి. అధికార పార్టీకి తామే ప్రత్యామ్నాయం అంటూ ప్రకటనలుచేసే నేతలేనా ఇలాంటి వ్యాఖ్యలు చేసేది? అంటూ సొంత గూటిలో మంటలు రేగుతున్నాయి.

### డైలమాలో బీజేపీ నాయకులు

బీజేపీ నేతలంతా ఇప్పుడు డైలమాలో పడ్డారు. ప్రభుత్వాన్ని విమర్శించేందుకు కాచుకొని కూర్చున వారు.. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలతో తామే గోతిలో పడ్డటయింది. ఇప్పటికే బీజేపీ పార్లమెంట్ మినహా వరుస ఎన్నికల్లో చావు తప్పినట్టు ఎం తోకొంత ఓట్లు రాబట్టుకున్నప్పటికీ ఎక్కడా కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోతున్నది. ఈ సమయంలో కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఎలా సమర్థించుకోవాలో తెలియక తలపట్టుకొంటున్నారు. రాష్ట్ర అధ్యక్షుడితోపాటు నేతలెవ్వరూ ఈ ప్రకటనను సమర్థించుకొనే సాహసం చేయడంలేదు.

### గతంలో ప్రచారంపై మండిపాటు

ఇటీవల ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ రాష్ట్రానికి వచ్చినప్పుడు ఎంపీలు అర్వింద్, బాపూరావుతోపాటు కొత్తగా బీజేపీలో చేరిన కొందరు నేతలు ఆరెస్సెస్ యూనిఫాంలో హల్‌చల్‌చేశారు. దీనిపై ఆరెస్సెస్ వర్గాలు తీవ్ర అభ్యంత రం వ్యక్తంచేశాయి. గతంలో ఇలాంటి సంస్కృ తి పార్టీలో లేదని, ఆరెస్సెస్ కార్యకర్తలు ఇలాం టి ఫొటోలతో సోషల్‌మీడియాకు ఎక్కలేదని, కొత్తగా పార్టీలోకి వచ్చి, ఆరెస్సెఎస్ సిద్ధాంతాలు తెలియనివారు ఇలాంటి ప్రచారం చేసుకోవడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. కేంద్ర బడ్జెట్, రైల్వేకు కేటాయింపులు వంటి అంశాల్లో రాష్ట్రాన్ని బద్నాం చేసేందుకు ప్రయత్నించిన బొక్కబోర్లా పడిన బీజేపీ అదే రైల్వే అంశంలో కిషన్‌రెడ్డి చెరుపుకోలేని వ్యాఖ్యలు చేసిన ఇరుక్కుపోయారు. ఈ వరుస పరిణామాలు కమలనాథుల్లో కలకలం రేపుతున్నాయి.

## తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టకు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి టీఆర్‌ఎస్వీ హితవు



ఓయూలో మీడియాతో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్వీ నాయకులు

**ఉస్మానియా యూనివర్సిటీ:** కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి నిజాలు మాట్లాడాలని టీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండగాని కిరణ్‌గౌడ్ సూచించారు. ప్రధాని మోదీ మెప్పు కోసం తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టకూడదని హితవుపలికారు. మోదీ పుట్టకముందే తెలంగాణలో రైల్వే వ్యవస్థ ప్రారంభమైందని, చరిత్రను వక్రీకరిస్తే చరిత్ర హీనుడిగా మిగలక తప్పదని హెచ్చరించారు. ఉస్మానియా వర్సిటీ లా కళాశాలలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మోదీ రాకముందు తెలంగాణవాళ్లకు ఎర్రబస్సు తప్ప రైళ్లు తెలియదని కిషన్‌రెడ్డి మతితప్పి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చరిత్రను వక్రీకరించడం రాజకీయ లబ్ధి కోసం మతాల మధ్య చిచ్చు పెట్టినంత సులువు కాదన్నారు. తెలంగాణలో 1870లోనే రైల్వే వ్యవస్థ ఏర్పడిందని గుర్తుచేశారు. తెలంగాణ సమాజాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కిషన్‌రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో టీఆర్‌ఎస్వీ నాయకులు శ్రీమాన్, ప్రదీప్, మనోహర్, వీరబాబు, ఉదయ్, ముజాహిద్, నరేశ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## పీజీ ఈసెట్ షెడ్యూల్ విడుదల

- మార్చి 12 నుంచి ఏప్రిల్ 30 వరకు దరఖాస్తుల స్వీకరణ
- మే 28 నుంచి 31 వరకు పరీక్షలు.. జూన్ 15న ఫలితాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ఉస్మానియా యూనివర్సిటీ:** రాష్ట్రంలో ఎంటెక్, ఎంఫార్మా ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ పీజీ ఈసెట్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి బుధవారం విడుదలచేశారు. మార్చి నాలుగున నోటిఫికేషన్ జారీచేయనున్నారు. మార్చి 12 నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. రూ.10వేల ఆల స్య రుసుంతో మే 26 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. మే 20 నుంచి 27 వరకు హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం కల్పించారు. మే 28 నుంచి 31 వరకు రెండుపూటలా పరీక్షలు నిర్వహిస్తారు. హైదరాబాద్, వరంగల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. జూన్ 15న ఫలితాలు వెల్లడిస్తారు.

## పెబ్బేరు ఆర్‌ఐకి రెండేండ్ల జైలు

లంచం కేసులో ఏసీబీ కోర్టు తీర్పు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లంచం తీసుకున్న కేసులో మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షఫీకి రెండేండ్ల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ బుధవారం ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ప్రిన్సిపల్ జడ్జి సాంబశివరావునాయుడు తీర్పు వెల్లడించారు. నాగరాల గ్రామానికి చెందిన కాల ప్రభాకర్ ల్యాం డ్ కన్వర్షన్ ఫిర్యాదులపై దర్యాప్తు జరిపి తాసీల్దార్‌కు నివేదిక ఇచ్చేందుకు 2011 జూన్ 27న రూ.25 వేలు లంచం తీసుకుంటూ ఆర్‌ఐ మహ్మద్ షఫీ ఏసీబీకి చిక్కాడు. మహ్మద్ షఫీ లంచం తీసుకున్న నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి శిక్ష ఖరారు చేశారు.


**TELANGANA UNIVERSITY**
Dichpally, Nizamabad - 503 322

**Tender Notification No. 02/REG/TU/NZB/2020, Date 20-02-2020**

Sealed Tenders are invited from the registered Outsourcing Agencies / Service Providers for Manpower (Computer Operators / Programmers, Jr. Asst-Cum-DEO, Attenders, Sweepers & Etc.), Security Guards and Monthly Sanitation Maintenance. The Tender form and other details can be had from the University website: **www.telanganauniversity.ac.in.** The last date for submission of tenders is 29-02-2020 till 3.00 P.M.

**Sd/- REGISTRAR**

**JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY HYDERABAD**
Kukatpally Hyderabad – 500 085, Telangana, India

**TS ECET-2020 NOTIFICATION (On behalf of TSCHE)**

**Engineering Common Entrance Test for Diploma & B.Sc. (Mathematics) Degree Candidates**

Computer Based Test (CBT) for Diploma & B.Sc (Mathematics) Degree Candidates will be conducted by JNTUH on behalf of TSCHE for lateral entry admissions in B.E/B.Tech/ B.Pharm courses offered for the academic year **2020-21** in the State of Telangana. Submission of Application and Examination of TS ECET– 2020 are in **Online mode only**. Detailed information regarding Syllabi, List of courses & Procedure is given in the **"Instruction Booklet"** available in the website **https://ecet.tsche.ac.in**

| | |
|---|---|
| Online Submission | 24-02-2020 to 28-03-2020 (without late fee) |
| Test Date & Time | 02-05-2020 (Saturday)10.00AM to 1.00PM and 3.00PM to 6.00PM |
| Registration Fee | Rs. 400/- (for SC/ST & PH candidates) and Rs. 800/- (for others) |

Note: This is only a Notification for entrance test. Candidate has to fulfill the eligibility criteria laid down in the relevant G.Os at the time of admission.

Hyderabad.
Date : 19.02.2020

Sd/-
CONVENER, TS ECET-2020



చీఫ్ విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ), చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ (సీఐసీ) నియామకాల్లో కేంద్రం పారదర్శకతకు పాతరేసింది. అధికార అనుంగు అనుయాయుల పేర్లను జేబులోంచి తీసి నియామకాలు ప్రకటించింది. మోదీ చెబుతున్న నవభారత్‌లో జవాబుదారీతనానికి, రాజ్యాంగ ప్రక్రియకు తిలోదకాలిచ్చారు. న్యాయవ్యవస్థలను రాజకీయం చేసి ప్రజాస్వామ్యాన్ని మంటగలిపారు.

**రణ్‌దీప్‌సింగ్ సుర్జేవాలా, కాంగ్రెస్ అధికార ప్రతినిధి**

గౌరవ హోంమంత్రి అమిత్ షాతో నా సమావేశం అర్థవంతంగా, ఫలవంతంగా ముగిసింది. ఢిల్లీ అభివృద్ధి కోసం అనేక విషయాలపై చర్చించుకున్నాం. ఇద్దరం ఢిల్లీ అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించాం.

**అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



**1872**

పేపర్ బ్యాగ్ తయారీ యంత్రాన్ని కనిపెట్టిన లూథర్ క్రోవెల్.

**1909**

'లీ ఫిగారో' పత్రికలో ఫ్రెంచి ఫ్యూచరిస్టుల మ్యానిఫెస్టో ప్రకటన.






**1947**

భారత చివరి వైస్రాయ్‌గా లార్డ్ మౌంట్ బాటెన్ నియామకం. భారత స్వతంత్ర ప్రకటనకు ముమ్మరమైన ప్రయత్నాలు.

బీహార్‌లో అప్పడే ప్రధాన రాజకీయ పక్షాలన్నీ ప్రచారానికి తెరలేపాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో జేడీ(యూ). బీజేపీ, ఎల్‌జేపీతో కూడిన ఎన్డీయే కూటమి 40 ఎంపీ స్థానాలకు గాను 39 గెలిచి పట్టుబిగించాయి. 243 అసెంబ్లీ స్థానాల్లో 90% సీట్లలో ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి. కానీ ఈ మధ్య ఢిల్లీ ఎన్నికలు మొదలు ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి ఎదురుగాలి వీస్తున్న నేపథ్యంలో ప్రతిపక్షాలు బీహార్‌పై సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. సీపీఐ నేత కన్హయకుమార్, తేజస్వీయాదవ్, ప్రశాంత్‌కిశోర్ లాంటివారు ప్రచార యాత్రలతో పాగా వేయటానికి ప్రయత్నిస్తుండటం గమనార్హం.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

పర్యావరణంలో వచ్చిన మార్పులతో దేశంలో వలస పక్షులకు గడ్డు పరిస్థితి ఎదురవుతున్నది. ఈ మధ్యకాలంలో విరివిగా వినియోగిస్తున్న రసాయనిక ఎరువులు, పురుగుమందులు, పక్షుల వేటగాళ్లతో వలసపక్షుల ఆవాస ప్రాంతాలన్నీ ప్రమాదకరంగా మారాయి. వలసపక్షులు సేదతీరి నివాసం ఉండటానికి వీల్లేకుండా పక్షుల ఆవాస ప్రాంతాలన్నీ తయారయ్యాయని 'భారత్‌లో పక్షుల పరిస్థితి-2020' అధ్యయనం తెలిపింది. ఈ పరిస్థితుల్లో పర్యావరణ వేత్తలు, పక్షి ప్రేమికులు వలసపక్షుల ఆవాసాల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరింది.

**ది హిందూ**



# అంతర్గత కంచెలు!

ఈశాన్య రాష్ట్రాల్లో శాంతిస్థాపనకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు మరింత అశాంతికే ఊతమిచ్చేవిధంగా ఉంటున్నాయా అంటే, అవుననే సమాధానం వస్తున్నది. తాజాగా అసోంలో తలపెట్టిన అంతర్గత అనుమతి (ఇన్నర్ లైన్ పర్మిట్) మరింత వివాదాస్పదమవుతున్నది. దీనిప్రకారం భారత్‌లోని ఇతర ప్రాంతాల నుంచి అసోంలోకి ప్రవేశించాలన్నా స్థానిక పాలనాధికారుల అనుమతి అవసరమని ఇన్నర్‌లైన్ పర్మిట్ చెబుతున్నది. అసోం ఒప్పందంలోని ఆరవ ప్రకరణను అమలు చేసేందుకుగాను కేంద్రం తీసుకుంటున్న చర్యల్లో ఈ ఇన్నర్‌లైన్ పర్మిట్ విధానాన్ని తెస్తూ, దాని విధివిధానాలు, అమలు కోసం కేంద్రప్రభుత్వం ప్రత్యేక కమిటీని కూడా నియమించింది. కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశంలో ఇప్పటికే సామాజిక సమూహాల మధ్య కనిపించని కంచెలు మొలుస్తున్నాయి. మైనారిటీలంతా తీవ్ర అభద్రతకులోనై సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. తాజాగా అసోం విషయంలో కేంద్ర నిర్ణయం మిగతా దేశం నుంచి వేరుచేస్తూ నేరుగా కనిపించే కంచెనే వేస్తున్నది. ఇన్నర్‌లైన్ పర్మిట్ విధానం కారణంగా అసోం పూర్తిగా ప్రత్యేక ప్రాంతంగా అవతరించబోతున్నది. దేశంలోని ఇతరప్రాంతాల నుంచి అసోం వెళ్లాలంటే అనుమతి అవసరమని చెప్పటం మరో రూపంలో వీసా కావాలని నిబంధన పెట్టడం లాంటిదేనని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. మరోవైపు అసోంలోని వివిధ ఆదివాసీ సమూహాల మధ్య కూడా మరిన్ని అనుమానాలకు తావిచ్చేవిధంగా కేంద్రప్రభుత్వ విధానాలున్నాయని ఆగ్రహిస్తున్నారు.

ఈశాన్యభారతంలో ముఖ్యంగా అసోంలో శాంతి నెలకొల్పేందుకు కేంద్రం గత నెల జనవరి 27న అసోంలోని వివిధ వేర్పాటువాద నేతలతో శాంతి ఒప్పందం కుదుర్చుకున్నది. గతంలో కన్నా భిన్నంగా ఈసారి అసోంలో ప్రాబల్యం కలిగిన యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం (ఉల్ఫా), బోడో, కర్బీ పోరాటకారులు కూడా ఒప్పందంలో భాగస్వాములు కావటం గమనార్హం. అయితే తాజా ఒప్పందంతో ఆయా ప్రాంతాల్లోని గిరిజనులు, వారి ఆకాంక్షలపై ఆధారపడి, వారి అనుమానాలు తీర్చేవిధంగా కేంద్రం విధాన నిర్ణయాలుంటే బాగుండేది. కానీ కేంద్రం వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్‌లో జరిగే ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని ఆయా గిరిజన సమాజాలను సంతృప్తిపర్చే చర్యలకే ప్రాధాన్యం ఇచ్చింది. బెంగాళీలు అధికంగా ఉన్న బరాక్ లోయలో ఉన్న 15 అసెంబ్లీ సీట్లు, బోడోలాండ్ టెరిటోరియల్ ఏరియా డిస్ట్రిక్స్ (బీటీఏడీ) ఏర్పాటుతో 12 సీట్లు, కర్బీలు అధికంగా ఉన్నప్రాంతంలోని ఐదు సీట్లు గెల్చుకునేందుకు పావులు కదిపింది తప్పితే సమస్య పరిష్కారం కోసం కాదనే విమర్శలు ఊపందుకుంటున్నాయి. 'బీటీఏడీ'తో బోడోల ఆధిపత్యంతో మిగతా ఆదివాసీ తెగలకు అస్తిత్వ సమస్య ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఏర్పడుతాయనే ఆందోళన వ్యక్తమవుతున్నది. అసోంలోని వివిధ గిరిజన తెగల జీవనపరిస్థితులు, వారి సంస్కృతిక నేపథ్యం, ఆవాసస్థితులపై ఆధారపడి కేంద్రం స్వయంప్రతిపత్తి ప్రాంతాలను (జిల్లాలను) ప్రకటించి ఉంటే బాగుండేది. కానీ కేవలం ఓట్ల రాజకీయం కోసం ఆయా ప్రాంతాల్లో కృత్రిమంగా విభజనరేఖలు గీయటం మరిన్న సమస్యలకు కారణమయ్యే పరిస్థితి ఉన్నది. ముఖ్యంగా కొక్రాఝర్, చిరాగ్, బక్సా, ఉదల్‌గురి జిల్లాల్లో బోడోలు 46 శాతంగా ఉంటారు. వీరికి ఎస్టీ ప్రతిపత్తి కలిగించవద్దని కర్బీలు డిమాండ్ చేస్తున్నారు. అలా కల్పించినట్లయితే, వారు తమ ప్రాంతాలపై రాజకీయాధిపత్యం చెలాయిస్తారని ఆందోళన చెందుతున్నారు.

> **ఏదేమైనా స్వాతంత్ర్యోద్యమకాలం నుంచి ఈశాన్య భారతం కుంపటిలా రాజుకుంటూనే ఉన్నది. లుక్ ఈస్ట్ పేరిట ఆ రాష్ట్రాలన్నింటినీ అభివృద్ధిబాటలో నడిపించి వేర్పాటువాదాలకు కళ్లెం వేస్తానని మోదీ చెప్పుకొచ్చారు. అభివృద్ధితోనే హింసను, వేర్పాటువాదాన్ని తుదముట్టిస్తానని అన్నారు. కానీ ఒక్క అసోంలో చేసిన ప్రయత్నమే విఫల ప్రయోగంగా కనిపిస్తున్నది. ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధి చెందాలంటే దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వ్యాపార సంబంధాల కోసం రాకపోకలకు సంపూర్ణ స్వేచ్ఛ ఉండాలి. అలాంటి స్వేచ్ఛకు ఆటంకంగా ఇన్నర్ లైన్ పర్మిట్ మారుతుందనటంలో సందేహం లేదు.**

నిజానికి అసోం ఓ మినీ ఆదివాసీ ప్రపంచం. 33 జిల్లాలతో ఉన్న అసోంలో 14 గుర్తింపు పొందిన మైదాన గిరిజన సమూహాలున్నాయి. 15 పర్వత ప్రాంత ఆదివాసీ తెగలు, మరో 16 షెడ్యూల్డ్ క్యాస్ట్ సమూహాలున్నాయి. ఈ అన్నితెగలు, సమూహాల మధ్య దశాబ్దాలుగా రాజకీయ, ఆర్థిక ఆధిపత్య పోరు కొనసాగుతున్నది. ముఖ్యంగా 80వ దశకంలో ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్, ఉల్ఫా నేతృత్వంలో స్థానికేతరులకు వ్యతిరేకంగా సాగిన పోరాటం చరిత్రాత్మకమైనది. ఉద్యమాన్ని నిర్వహించిన విద్యార్థినేతలు నేరుగా కాలేజీ హాస్టళ్ల నుంచి అసెంబ్లీకి వెళ్లి పాలనాధికారాలు చేపట్టారు. దాంతోనైనా అసోం శాంతిబాటన పడుతుందని ఆశించినవారికి అడియాసే మిగిలింది. అనేక చిన్నచిన్న సమూహాలుగా ఉన్న ఆదివాసీ తెగ సమూహాల మధ్య ఉన్న ఆధిపత్య వైరుధ్యం పరిష్కారం కాలేదు. తాజా మోదీ ఒప్పందం కూడా కొత్తసీసాలో పాతసారా లాగా ఉన్నదనే విమర్శలొస్తున్నాయి. ఏదేమైనా స్వాతంత్ర్యోద్యమకాలం నుంచి ఈశాన్య భారతం కుంపటిలా రాజుకుంటూనే ఉన్నది. లుక్ ఈస్ట్ పేరిట ఆ రాష్ట్రాలన్నింటినీ అభివృద్ధిబాటలో నడిపించి వేర్పాటువాదాలకు కళ్లెం వేస్తానని మోదీ చెప్పుకొచ్చారు. అభివృద్ధితోనే హింసను, వేర్పాటువాదాన్ని తుదముట్టిస్తానని అన్నారు. కానీ ఒక్క అసోంలో చేసిన ప్రయత్నమే విఫల ప్రయోగంగా కనిపిస్తున్నది. ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధి చెందాలంటే దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వ్యాపార సంబంధాల కోసం రాకపోకలకు సంపూర్ణ స్వేచ్ఛ ఉండాలి. అలాంటి స్వేచ్ఛకు ఆటంకంగా ఇన్నర్ లైన్ పర్మిట్ మారుతుందనటంలో సందేహం లేదు.

**జనగళం**

### అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలె

రానున్నది ఎండాకాలం. ఎండాకాలంలో అగ్నిప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయనే విషయం తెలిసిందే. కాబట్టి అగ్నిప్రమాదాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉన్నది. ఒకవేళ ఎక్కడైనా అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నట్లయితే ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా అగ్నిమాపక శాఖాధికారులు సర్వసన్నద్ధంగా ఉండాలి. నిత్యం అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

**- మొగుళ్ల సునీల్, బేగంపేట్, హైదరాబాద్**

### ప్రాణాలు తీస్తున్న ఈత సరదా

ఈత సరదా ప్రాణాలు తీస్తున్నది. తరుచుగా చెరువుల్లో మునిగి విద్యార్థుల మృతి అని వస్తున్న వార్తలు చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నది. కాబట్టి తల్లిదండ్రులు ఈత పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలి. పెద్దలు లేకుండా ఎట్టి పరిస్థితుల్లో పిల్లలను చెరువులోకి పంపించ కూడదు. పెద్దల సమక్షంలోనే పిల్లలకు ఈత నేర్పించాలి. అంతేకాకుండా రాష్ట్రంలో ప్రతి పెద్ద చెరువు వద్ద లేక్ వ్యూ పోలీసులను నియమించాలి. అప్పుడే ప్రమాదాలు తగ్గుతాయి.

**- బి.వెంకటేశ్ గౌడ్, గజ్వేల్, సిద్దిపేట జిల్లా**

### భాషా ఉన్నతిని నిలుపుదాం

వెలుగు జిలుగులు విరజిమ్మిన తెలుగు భాషకు పరభాషా వ్యామోహమనే గ్రహణం పట్టింది. దాంతో మన తెలుగు సంస్కృతికి సంబంధించిన అలవాట్లు, అభిరుచులు, సంస్కృతీ సంప్రదాయాలు ఒక్కొక్కటి కనుమరుగవుతున్నాయి. కొందరైతే తెలుగు మాట్లాడితే తమ అంతస్తుకు, గొప్పతనానికి భంగమనుకుంటున్నారు. ఇలాంటివారు తమ పద్ధతి మార్చుకొని తెలుగు భాషను గౌరవించడం నేర్చుకోవాలి. అప్పుడే మన తెలుగుభాషలోని మాధుర్యం, నుడికారపు సొంపు తొణికిసలాడుతుంది. మనది తెలుగు భాష, మనం తెలుగు వాళ్లం. మనది తెలుగు జాతి. మనభాష చెక్కు చెదరకుండా చూసుకోవాలి. మన దేశంలో అత్యధికులు మాట్లాడే నాలుగోది తెలుగు భాష. ఇంతటి గొప్ప భాష ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలి.

**- కాయల నాగేంద్ర, హైదరాబాద్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**ఆలోకన**



**టంకశాల అశోక్**

# ఢిల్లీ ఎన్నికల్లో ఎన్నెన్ని విజయాలు

**ఢిల్లీ ఎన్నికల్లో 'ఆప్' గెలువటం ఒక్కటే కాదు. దేనికదిగా మరెన్నో విజయాలున్నాయి. ఒక సోకాల్డ్ జాతీయపార్టీపై ఒక ఫెడరల్ పార్టీ గెలిచింది. జాతిని విచ్ఛిన్నం చేయబూనిన పార్టీని సకలజనుల సహజీవన పార్టీ చిత్తుచేసింది. మాటల్లో తప్ప చేతల్లో అభివృద్ధి కన్పించని పార్టీపై సామాన్యుల పురోగతే తన లక్ష్యమని ఆచరణలో చూపిన పార్టీ పైచేయి సాధించింది. అహంభావంతో విర్రవీగిన పార్టీని వినయవిధేయతల పార్టీ మట్టికరిపించింది. అన్ని ప్రాంతాల ప్రజలు నివసించే రాజధానీవాసులు దేశ ప్రజాస్వామ్యం కోసం మరెన్నో విజయాలు సాధించుకున్నారు.**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అన్నింటికన్న కొట్టొచ్చినట్లు కన్పించిన విషయం బీజేపీ సాగించిన పరమ భయంకరమైన మత తత్వ విద్వేష ప్రచారం. చివరికి ఫలితాలు వెలువడినప్పుడు తిరిగి అదేవిధంగా అన్నింటికన్న కొట్టొచ్చినట్లు కన్పించింది అటువంటి విషప్రచారాల పార్టీని ప్రజలు చిత్తు చేయటం. గత 72 ఏండ్ల స్వతంత్ర భారత చరిత్రలో ఒక పార్టీ, ఒక ప్రధాని, ఒక హోంమంత్రి ఇంతహీనమైన స్థాయికి పతనమై ప్రచారాలు చేయటం ఎన్నడూ లేదు. అటువంటి ప్రచారాన్ని ప్రజలు నేలమట్టం చేయటం కూడా ఎప్పుడూ జరుగలేదు. ఈ స్థితిలో కొంత పోల్చదగిన విద్వేష ప్రచారం ఒకే ఒకటి ఉన్నది. అది 1984లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హత్య తర్వాత జరిగిన ఎన్నికల్లో కొత్త ప్రధాని రాజీవ్‌గాంధీ ఆధ్వర్యాన సాగిన సిక్కు వ్యతిరేక ప్రచారం. అందుకు ప్రత్యక్ష సాక్షి అయిన ఈ రచయిత ఉద్దేశంలో, అపుడు కాంగ్రెస్ కన్న ఇప్పుడు బీజేపీ రెండాకులు ఎక్కువ చదివింది. అధికారం కోసం ఆ రోజుల్లో కాంగ్రెస్ ఎంతపతనం అయిందో ఈసారి బీజేపీ అంతకన్న పతనమైంది. అపుడు కాంగ్రెస్ ఆ విధమైన ప్రచారాన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. అప్పటి నుంచి 35 ఏండ్లు తిరిగేసరికి ఈ రెండు పార్టీల పాత్రలు తారుమారయ్యాయి. లక్ష్యం అప్పుడు సిక్కులు కాగా ఇప్పుడు ముస్లింలు. ఆ విధంగా వేర్వేరు దశల్లో ఈ రెండు సోకాల్డ్ జాతీయపార్టీలు బోనెక్కవలసిన దోషానికి పాల్పడ్డాయి. ఎన్నికల ఫలితాలకు సంబంధించి అప్పటికి ఇప్పటికి కొట్టొచ్చినట్లు కన్పించే తేడా ఒకటున్నది. అప్పుడు ఇందిరా హత్య వల్ల కలిగిన ఉద్వేగంలో ప్రజలు సిక్కు వ్యతిరేక ప్రచారానికిలోనై కాంగ్రెస్‌కు ఘనవిజయం కట్టబెట్టారు. అప్పుడు ఆ స్థితిని విమర్శించి, ఆ విధమైన ఓటింగ్‌తో నష్టపోయిన బీజేపీ, ఈ 35 సంవత్సరాల్లో ఎటువంటి గుణపాఠం నేర్వలేదుగాని, సాధారణ ప్రజలు మాత్రం తగినంత నేర్చినట్లు ఈ అసెంబ్లీ ఫలితాలు చూపుతున్నాయి. బీజేపీ సంకుచిత ప్రచారాలు ఏవీ వారిపై ప్రభావం చూపలేదు.

ఈ సారి ఢిల్లీ ఎన్నికలు యావద్దేశ దృష్టినే కాదు, ప్రపంచదేశాల దృష్టిని ఆకర్షించాయి. అందుకు కారణాలు తెలిసినవే గనుక ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. కానీ గమనించదగినదేమంటే, ఆప్ గెలుస్తుందా లేదా అన్న దానికంటే బీజేపీ విషప్రచారం ఎంత ప్రభావం చూపగలదన్నదే దేశ విదేశాల్లో ప్రశ్నగా మారింది. ఆప్ జయాపజయాలు ఢిల్లీకి పరిమితమైన విషయం. కానీ ఒక జాతీయపార్టీగా, కేంద్రంలోని అధికారపక్షంగా, దేశమంతటా అల్పసంఖ్యాక వర్గాలపై బాహాటంగా కత్తిగట్టిన పార్టీగా బీజేపీ గెలుపోటముల ప్రభావం ఢిల్లీ పరిధిని దాటి దేశవ్యాప్తంగా ఉంటుంది. అంతర్జాతీయంగానూ ఉంటుంది. భవిష్యత్తును నిర్దేశిస్తుంది. పైన కాంగ్రెస్ పార్టీ సిక్కు వ్యతిరేక ప్రచారం గురించి చెప్పుకున్నాం. అప్పుడది ఢిల్లీకి, కొద్దిపాటి ఉత్తరాది రాష్ట్రాలకు పరిమితమైనటువంటిది. అందుకు భిన్నంగా బీజేపీ ప్రచారం దేశవ్యాప్తమైనది. అంతర్జాతీయమైనది. మొత్తం దేశ భవిష్యత్తుకు సంబంధించినది. ఈ దేశ సామాజిక సాంప్రదాయాలకు, సంస్కృతికి, రాజ్యాంగానికి అక్షరరీత్యా-స్ఫూర్తిరీత్యా కూడా విరుద్ధమైనది. తాముచేసిన పనికి కాంగ్రెస్‌వారు కొంతకాలం తర్వాతనైనా పశ్చాత్తాపం ప్రకటించారు. కానీ బీజేపీ లక్ష్యాలు, అందుకోసం సాగించే విద్వేష ప్రచారం, చర్యలూ పశ్చాత్తాప ప్రకటనకే ఆస్కారం లేనటువంటివి. తమ విషపూరిత విధానాలు లక్ష్యాన్ని సాధించలేకపోతే విచారిస్తారు వారు. కసితో మరింత విషం కక్కుతారు.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు, అందులోనూ బీజేపీ ధోరణి, ఎన్నికల్లో ఆ పార్టీ జయాపజయాలూ మొత్తం దేశ, ప్రపంచ దృష్టిని ఆకర్షించటం వెనుక ఇదంతా ఉన్నది. ఇందులో అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వాన గల ఆమ్ ఆద్మీ పార్టీది నిమిత్త మాత్రమైన పాత్ర. ఎన్నికల్లో ప్రచారం ఎంత దుర్మార్గమైన విధంగా సాగినా అది బీజేపీ దిగువ శ్రేణులకు పరిమితమై ఉంటే ఎవరూ ఇంత సీరియస్‌గా తీసుకొని ఉండేవారుకాదు. కానీ సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలుమార్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ వాళ్లను వారి దుస్తులతో గుర్తించవచ్చు (ముస్లింలని భావం) అన్నారు. షాహీన్‌బాగ్ ధర్నా దేశద్రోహులు చేస్తున్న ఒక ప్రయోగం అన్నారు. ఆ ప్రయోగం సఫలమైతే అంతటా అదే పని చేస్తారని తన ఉద్దేశం. హోంమంత్రి అమిత్ షా, వారిని చెదలు అంటూ అభివర్ణించారు. ఓటింగ్ నాడు ఈవీఎం మీట నొక్కితే ఆ ఫలితాలు షాహీన్‌బాగ్‌లో కరెంట్‌షాక్ కావాలన్నారు. ఇటువంటివారే ఇంత బాధ్యతారహితంగా, దారుణంగా మాట్లాడినప్పుడు కేంద్రమంత్రి అయిన అనురాగ్ ఠాకూర్ గోలీమారో పిలుపుగాని, మరొక మంత్రి ప్రకాశ్ జవదేకర్ కేజ్రీవాల్‌ను టెర్రరిస్టు అనటం గాని, యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ బిర్యానీ వ్యాఖ్యలుగాని, ఇతర మంత్రులు, ఎంపీలు, తదితరుల విపరీత ధోరణి గాని మోదీ, అమిత్ షాలను అనుకరించేవి మాత్రమే అవుతాయి. ఫలితాలు వెలువడిన తర్వాత హోంమంత్రి అటువంటి వ్యాఖ్యలను ఆయా వ్యక్తులు చేసి ఉండవలసింది కాదన్నారు. కానీ స్వయంగా తాను, మోదీ చేసిన వ్యాఖ్యల గురించి ఏమీ మాట్లాడలేదు. తమతో సహా తక్కినవారంతా చేసిన ప్రచారంలోని విద్వేషం గురించి అప్పుడే తెలియదా ఆయనకు? తెలిసి కూడా ఉద్దేశపూర్వకంగా పదేపదే చేశారు. అందువల్ల గెలుస్తామనుకున్నారు. గెలిచి ఉంటే అదే సరైన ధోరణి అని భావించేవారు. గెలువలేదు గనుక నీతివాక్యాలు చెప్తున్నారు. పోనీ ఇటువంటి అనుభవంతో ముందు వారి ధోరణి మారుతుందా అన్నది ప్రశ్న. ఇప్పటికైతే అటువంటి ఆశ కలుగటం లేదు. వారి మౌలిక సిద్ధాంతాల్లోనే, దీర్ఘకాలిక సామాజిక-రాజకీయ లక్ష్యాల్లోనే సామాజిక విచ్ఛిన్నత, దేశ రాజ్యాంగ భంగమన్నవి మిళితమై ఉన్నాయి. భారత సమాజంలో కులవ్యవస్థను సృష్టించి వేల ఏండ్లుగా దళిత బహుజనులను పీడించి అణిచివేస్తున్నది ఈ శక్తులే. అల్పసంఖ్యాక వర్గాలను అణిచివేసి నిర్మూలించజూస్తున్న మతతత్వశక్తులు కూడా ఇవే. వారి లెక్కల్లో ఢిల్లీ ఓటమి ఒక చిన్న ఎదురుదెబ్బ మాత్రమే. కనుక తక్కిన దేశంలో గానీ, అందులో భాగంగా తెలంగాణలో గాని తమ విచ్ఛిన్నకర అజెండాను ముందుకు తీసుకుపోయేందుకు వారు ప్రయత్నిస్తారు. తెలంగాణలో అదేపని పదేపదే చేయటం కన్పిస్తున్నదే.

జనసంఘ్ పార్టీ బీజేపీగా మారిన తర్వాత వారి అధికార రాజకీయపు ఎత్తుగడలు రకరకాలుగా మారుతూ వస్తున్నాయి. మొదట జనసంఘ్‌గా మత తత్వానికి పెద్దపీట వేశారు. తర్వాత వాజపేయి-అద్వానీల కాలంలో ఉదారవాదంతో కూడిన అభివృద్ధిని, మతతత్వాన్ని తమ రథానికి రెండు గుర్రాలుగా మార్చుకున్నారు. అదొక తెలివైన ఎత్తుగడ. ఆ విధంగా రథం కొంతముందుకు వెళ్లి ఆగిపోయింది. తర్వాత నరేంద్ర మోదీ మొదటి విడుత పాలనలో అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు నటించారు. ఈ రెండవ విడుతలో మత తత్వానిది పెద్దపీట అవుతున్నది. రెండవసారి గెలువటమే గాక మెజారిటీ పెరుగటం పెద్ద అహంకారాన్ని తెచ్చిపెట్టింది. ప్రతిపక్షాల బలహీనత మరింత ధైర్యాన్నిచ్చింది. ఇటువంటి పరిస్థితులు అన్నీ లేకపోయినట్లయితే ఢిల్లీ ఎన్నికల్లో వారి ధోరణి స్వయంగా ప్రధానమంత్రిని మొదలుకొని కిందిస్థాయి వరకు ఇంత భయం గొలిపేదిగా మారి ఉండేది కాదు.

బీజేపీ ప్రదర్శించిన అన్ని అవలక్షణాలకు ఒక నాయకునిగా కేజ్రీవాల్, ఆయన పార్టీ, దేశ రాజధాని ప్రజలు సంపూర్ణమైన రీతిలో విరుగుడును చూపించారు. దాని అర్థం విషప్రచారపు ప్రభావం అసలు లేదని కాదు. బీజేపీ ఓట్లు, సీట్లు ఎంతో కొంత పెరుగటమే అందుకు నిదర్శనం. కానీ ఆ ప్రచార మహోధృతితో, అందులో పాల్గొన్న అతిరథ, మహారథులతో వారి అధికార బలం, ధనబలం, అంగ బలంతో, వారు చిమ్మిన విషతీవ్రతతో లెక్కలు కట్టినట్లయితే 62 సీట్లు వారికి, 8 సీట్లు ఆప్‌కు రావలసింది. కథ అందుకు విరుద్ధంగా నడిచిందంటే దాని అర్థ తాత్పర్యాలను ప్రజలు ఎవరికివారే చెప్పుకోగలరు. ఇదే విషయాన్ని రెండవ వైపునుంచి చూసినట్లయితే, బీజేపీ రాజకీయాలకు ఆప్ పార్టీ ఒక విరుగుడు ప్రయోగమవుతున్నది. అటువంటి ప్రయోగానికి తెలంగాణ మరొక దృష్టాంతమైంది ఇప్పటికే. అభివృద్ధి-సంక్షేమాలతో పాటు సామాజిక సామరస్యతలు కేజ్రీవాల్ ఆధ్వర్యంలో వలెనే ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన ఎట్లా రూపుదిద్దుకొని సాగుతున్నాయో తెలిసిందే. మొత్తం దేశంలోనే ఏ బీజేపీయేతర రాష్ట్రం కూడా మోదీ బీజేపీని చూసి జంకనవసరం లేదని, ప్రశాంతంగా, స్థిరచిత్తంతో పాజిటివ్ విధానాలను అనుసరిస్తే సరిపోతుందని ఈ అనుభవాలు చెబుతున్నాయి. ఫలితాలు దేశంలో కొత్త రాజకీయాలకు నాంది పలికాయని కేజ్రీవాల్ అన్నారు గాని, తను ప్రస్తావించిన పని సంస్కృతిని ప్రజలు ఆదరించటం మొదటినుంచి ఉన్నదే. వాస్తవానికి ప్రజాస్వామ్యంలో గాని, రాజ్యాంగరీత్యా గాని ప్రజలు ఆశించేది అదేనన్నది సార్వత్రిక నీతి. దానిని స్వప్రయోజనాల కోసం విస్మరించటం వల్లనే మన తొలిదశ పార్టీలు ఓడిపోవటం మొదలైంది. మరుగునపడిన ఈ సంస్కృతిని తిరిగి ముందుకు తీసుకురావటం ఆయా పార్టీలకు, దేశానికి మంచి చేయటంతో పాటు బీజేపీ తరహా విచ్ఛిన్నకరశక్తులకు విరుగుడు కాగలదు. ఇతర పార్టీలు ఈ సంస్కృతిని విడనాడటం వల్లనే ప్రజాదరణ కోల్పోయి శూన్యం ఏర్పడి ఆ శూన్యంలోకి బీజేపీ వంటి అప్రజాస్వామికశక్తులు ప్రవేశించాయి.

> బీజేపీ ప్రదర్శించిన అన్ని అవలక్షణాలకు ఒక నాయకునిగా కేజ్రీవాల్, ఆయన పార్టీ, దేశ రాజధాని ప్రజలు సంపూర్ణమైన రీతిలో విరుగుడును చూపించారు. దాని అర్థం విషప్రచారపు ప్రభావం అసలు లేదని కాదు. బీజేపీ ఓట్లు, సీట్లు ఎంతో కొంత పెరుగటమే అందుకు నిదర్శనం. కానీ ఆ ప్రచార మహోధృతితో, అందులో పాల్గొన్న అతిరథ, మహారథులతో వారి అధికార బలం, ధనబలం, అంగ బలంతో, వారు చిమ్మిన విషతీవ్రతతో లెక్కలు కట్టినట్లయితే 62 సీట్లు వారికి, 8 సీట్లు ఆప్‌కు రావలసింది. కథ అందుకు విరుద్ధంగా నడిచిందంటే దాని అర్థతాత్పర్యాలను ప్రజలు ఎవరికివారే చెప్పుకోగలరు.

# తెలంగాణ సంస్కృత వాచస్పతి

**పురస్కారం**



**ఇట్టేడు అర్కనందనాదేవి**

సంస్కృతి అంటే పరిష్కరణం, సంస్కరణం. సంస్కృతి అంటే సాహిత్య సౌరభం. సంస్కృతి అంటేనే సంస్కృతం. భారతదేశ అఖండత్వానికి ప్రతీకగా నిలిచిన అమరభాష సంస్కృతం. సంస్కృత భాష ఎంత ప్రాచీనమైందో సంస్కృత వాఙ్మయం అంత విస్తృతమైంది. సంస్కృత వాఙ్మయంలో లేని శాస్త్రం లేదు. లేని విషయాలు లేవు. సంస్కృత భాష నిర్జీవమైంది కాదనీ, అమర భాషను కూడా ఆధునిక ఒరవడిక పరిచయం చేయవచ్చనీ నిరూపించిన తెలంగాణ పాండితీయశోవిభవం శ్రీభాష్యం విజయసారథి.

సమన్వయం మన సనాతన ధర్మానికి పెట్టనికోట. సంస్కృత భాషా సంప్రదాయాన్ని ఆధునిక రచనా కౌశలంతో సమన్వయం చేసిన తెలంగాణ సంస్కృత వాచస్పతి శ్రీభాష్యం విజయసారథికి ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది.

**యుగకర్తా, యుగోద్ధర్తా చక్రవర్తీ యుగస్యచ।**
**సరస్వతీ సుతోత్తంసః జీయాద్విజయ సారథిః॥**

సంస్కృత భాషలో కూలంకషమైన పాండిత్యంతో పాటు మధుర మంజుల మనోహరంగా కవిత్వం చెప్పగల మహాకవి, సంస్కృతం అంటే కేవలం అమర భాష కాదని, మానవీయతను చాటే ప్రజల భాషని నిరూపించిన ఆధునిక కవి శ్రీభాష్యం విజయసారథి.

శ్రీభాష్యం విజయసారథి 1936లో కరీంనగర్ జిల్లాలోని చేగుర్తి గ్రామంలో గోపమాంబ, నరసింహాచార్య దంపతులకు జన్మించారు. నిజాం పరిపాలనలో ఉర్దూ అధికార భాషగా ఉన్నప్పటికీ, గీతగోవిందంలోని లయకు ఆకర్షితులై, ప్రేరణ పొంది సంస్కృత భాషను అభ్యసించారు శ్రీభాష్యం. వరంగల్‌లోని విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలలోనే చదువుకొని అదే కళాశాలలో అధ్యాపకునిగా పని చేసి పదవీ విరమణ పొందారు విజయసారథి. సంస్కృతం, తెలుగు, ఉర్దూ భాషల్లో నిష్ణాతులైన శ్రీభాష్యం విజయసారథి సంస్కృత భాషా సాహిత్యంలో చేపట్టని ప్రక్రియ లేదు. సుప్రభాత, కావ్య, దేశభక్తి, లేఖా, సూక్తి, మాలికా, ఉదాహరణ, సంగీత, సాంఘిక, చైతన్య, అనువాద, తెలుగు విమర్శ, స్తుతి, గద్య, నవల, ప్రహసన, ప్రహేళికల వంటి ఎన్నో ప్రక్రియలను శతాధిక గ్రంథరచన ద్వారా సుసంపన్నం చేశారు.

శ్రీభాష్యం విజయసారథి పదేండ్ల వయస్సులోనే శారదాపదకింకిణి అనే గ్రంథం రాశారు. పదిహేడేళ్ల వయస్సులో మనోరమ అనే నవలను రాయడం ద్వారా మొదలైన శ్రీభాష్యం రచనా ప్రక్రియ నేటికీ నిర్విరామంగా కొనసాగుతూనే ఉంది. మందాకినీ కావ్యరచనతో భారతదేశంలో వినుతికెక్కిన శ్రీభాష్యం విజయసారథి మహాకవిగా, మందాకినీ కవిగా పేరు గడించారు. మందాకినీ అంటే గంగా ప్రవాహం. కేవలం 48 గంటల్లో 200ల ధాతువుల ప్రయోగంతో 2000 లైన్లతో మందాకినీ కావ్యాన్ని రచించారు శ్రీభాష్యం. వీరికి పేరు తెచ్చిన భారతభారతీ, ప్రవీణ భారతం, రాసకేళి, సంగీత మాధవం, ప్రహేళికలు వీరు రచించిన అనేక గ్రంథాల్లో ఆణిముత్యాలు. శ్రీభాష్యం విజయసారథి రచనల్లో వస్తువర్ణన ఏదైనా ముఖ్యోద్దేశంగా ధ్వనించే ప్రధాన విషయం సమాజం. విశ్వ పౌరత్వం, సకల మానవ సౌభ్రాతృత్వం, మానవతావాదం వీరి రచనలో పరిఢవిల్లే ఆలోచనా పరిమళాలు.



రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం వారి మహామహోపాధ్యాయ, కె.కె.బిర్లా ఫౌండేషన్ వారి వాచస్పతి, తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠం వారి ఇందిరా బిహారీ గోల్డ్‌మెడల్, తెలుగు విశ్వవిద్యాలయం వారి ఉత్తమ సంస్కృత పండిత పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారి విశిష్ట పురస్కారం, ప్రజ్ఞాభారతి వారి ప్రతిభా పురస్కారం, సృజనాత్మక సంస్కృతకవి, మహాకవి అనే బిరుదుల సత్కారం శ్రీభాష్యం విజయసారథి ప్రతిభకు పట్టం కట్టాయి. పద్మశ్రీ పురస్కారం సంస్కృత భాషకూ, సాహిత్యానికి దక్కిన అపూర్వ గౌరవంగా భావించే సుహృదయత శ్రీభాష్యం వారికే దక్కుతుంది. భారతదేశంలోని ఎందరో మహాకవులతో కవి సమ్మేళనాల్లో పాల్గొని ఘనతకెక్కిన శ్రీభాష్యం విజయసారథి తెలంగాణ కవి కాళోజీ గారితో సంభాషించినప్పుడు, 'ఎందుకూ అక్కరకు రాని భాషను పట్టుకున్నావేంటని' కాళోజీ నారాయణరావు శ్రీభాష్యంతో అన్నప్పుడు 'సంస్కృతం ప్రపంచంలోకెల్లా గొప్ప భాష. నీవు ఉపయోగించే 'ప్రభుత్వం', 'కార్యకర్త', 'అధ్యక్షుడు'.. లాంటివన్నీ సంస్కృతమే కదా! అని సమాధానమిచ్చారట. కాళోజీ తర్వాత అనేక సందర్భాల్లో, కవి సమ్మేళనాల్లో 'వాడు రాలేదా!' అని శ్రీభాష్యం గారిని గుర్తుచేసుకునేవారట.

తెలంగాణలో కవులు శూన్యమనే ఆంధ్రుల అభిప్రాయాన్ని తోసిపుచ్చిన కవిపసేణ్యులు శ్రీభాష్యం విజయసారథి. మందాకినీ కావ్యం విని సారస్వత లోకమంతా పరవశించింది. శ్రీభాష్యం వారికి దక్కిన పద్మశ్రీ పురస్కారంతో సంస్కృతభాష పరిమళించింది. తెలంగాణ సంస్కృత వాచస్పతిగా సాహితీ ప్రపంచానికి ప్రేరణై నిలిచిన శ్రీభాష్యం విజయసారథి సంప్రదాయ మందాకినిలో పునీతులై, ఆధునిక వాఙ్మయ ఝరిలో సుస్నాతులై, సంస్కృతీ సంస్కృతాలకు ప్రతీకలై తెలంగాణ ఘనతను పద్మశ్రీతో మరోసారి ప్రపంచానికి చాటిచెప్పారు.

శ్రీభాష్యం విజయసారథి వారి లాంటి ఎందరో మేధావులు నాటి నుంచి నేటివరకూ తమతమ రచనల ద్వారా సంస్కృత భాషను సుసమృద్ధం చేస్తూ వస్తున్నారు. వారందరికీ వందనములు, అభినందనలు.

> తెలంగాణలో కవులు శూన్యమనే ఆంధ్రుల అభిప్రాయాన్ని తోసిపుచ్చిన కవిపసేణ్యులు శ్రీభాష్యం విజయసారథి. మందాకినీ కావ్యం విని సారస్వత లోకమంతా పరవశించింది. శ్రీభాష్యం వారికి దక్కిన పద్మశ్రీ పురస్కారంతో సంస్కృతభాష పరిమళించింది. తెలంగాణ సంస్కృత వాచస్పతిగా సాహితీ ప్రపంచానికి ప్రేరణై నిలిచిన శ్రీభాష్యం విజయసారథి సంప్రదాయ మందాకినిలో పునీతులై, ఆధునిక వాఙ్మయ ఝరిలో సుస్నాతులై, సంస్కృతీ సంస్కృతాలకు ప్రతీకలై తెలంగాణ ఘనతను పద్మశ్రీతో మరోసారి ప్రపంచానికి చాటిచెప్పారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

# బాలల్ని పట్టించుకోని ప్రపంచం

- బాలల ఆరోగ్యంపై శ్రద్ధ చూపని ప్రభుత్వాలు
- ధనిక దేశాల ఉద్గారాలతో పిల్లలకు ముప్పు
- చిరుతిళ్లు, తియ్యటి పానీయాల వల్ల హాని
- డబ్ల్యూహెచ్‌ఓ ఆరోగ్య నిపుణుల హెచ్చరిక

**న్యూయార్క్:** ప్రపంచవ్యాప్తంగా బాలల ఆరోగ్యాన్ని, వారి పరిసరాలను, భవిష్యత్తును ఏ ఒక్క దేశం కూడా పట్టించుకోవడం లేదని 40 మంది ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాసెస్ చేసిన ఫాస్ట్ ఫుడ్, తియ్యటి శీతల పానీయాలు, మద్యం, పొగాకు వల్ల పిల్లల ఆరోగ్యం దెబ్బతింటున్నదని పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ), యూనిసెఫ్, లాన్సెట్ జర్నల్ సంయుక్తంగా ఈ ఆరోగ్య నిపుణులతో ఏర్పాటు చేసిన కమిషన్ ఇచ్చిన నివేదికను బుధవారం విడుదల చేశారు. పర్యావరణం దెబ్బతినడం, వాతావరణ మార్పులు, దోపిడీతో కూడిన మార్కెటింగ్ విధానాల కారణంగా ప్రపంచంలోని బాలలు, టీనేజర్లకు ముప్పు అత్యంత సమీపంలో ఉన్నదని ఆ నివేదిక పేర్కొంది. గత 20 ఏండ్లలో బాలలు, టీనేజర్ల ఆరోగ్యం మెరుగుపడినప్పటికీ, పురోగతి మాత్రం ఆగిపోయిందని, అయితే మళ్లీ క్షీణించే ప్రమాదం ఉన్నదని న్యూజిలాండ్ మాజీ ప్రధాని, కమిషన్ కో చైర్మన్ హెలెన్ క్లార్క్ పేర్కొన్నారు.



అల్ప, మధ్యాదాయ దేశాలలో ఐదేండ్ల లోపు పిల్లలు దాదాపు రెండున్నర కోట్ల మంది లో పేదరికం కారణంగా తగిన ఎదుగుదల లేదని చెప్పారు. వాణిజ్యపరమైన విధానాలు, వాతావరణ మార్పుల కారణంగా ప్రపంచంలోని పిల్లలందరూ ప్రస్తుతం అస్తిత్వ పోరాటం చేస్తున్నారని తెలిపారు. అత్యంత పేద దేశాలు తమ పిల్లలు ఆరోగ్యకరమైన జీవనం సాగించడానికి వారి సామర్థ్యాన్ని పెంపొందించే చర్యలు చేపట్టాలని ఆ నివేదిక సూచించింది. సంపన్న దేశాలలో అధికంగా విడుదలవుతున్న కర్బన ఉద్గారాలతో ప్రపంచంలోని పిల్లలందరికీ ముప్పు వాటిల్లుతున్నదని హెచ్చరించింది. 2100 సంవత్సరం నాటికి భూతాపం నాలుగు డిగ్రీల సెల్సియస్‌కు మించి పెరిగిపోతే.. సముద్ర మట్టం పెరుగటం, వడగాలుల ఉద్ధృతి, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల విజృంభణ, పోషకాహార లోపం వల్ల బాలల ఆరోగ్యంపై విపత్కర ప్రభావం పడుతుందని కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. అటువంటి విపత్కర పరిస్థితుల్లో నార్వే, కొరియన్ రిపబ్లిక్, నెదర్లాండ్స్‌లలోని పిల్లలు మాత్రమే ఆరోగ్యంగా ఉంటూ జీవించగలుగుతారని తెలిపింది. ఇక సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, చాద్, సోమాలియా, నైజర్, మాలీ వంటి దేశాలలో తీవ్ర పరిణామాలు చోటుచేసుకుంటాయని పేర్కొంది. కర్బన ఉద్గారాలను పూర్తిగా నియంత్రించాలని, హానికరమైన ఆహార పదార్థాలు, పానీయాల మార్కెటింగ్‌ను అరికట్టాలని సూచించింది.

## అమెరికా డీసీ సర్క్యూట్ కోర్టు సీజేగా శ్రీనివాసన్

ఈ పదవి చేపట్టిన తొలి దక్షిణాసియా వ్యక్తిగా రికార్డు



**వాషింగ్టన్:** అమెరికాకు చెందిన ప్రవాస భారతీయ న్యాయమూర్తి శ్రీనివాసన్ సరికొత్త రికార్డు సృష్టించారు. ఫెడరల్ సర్క్యూట్ కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. తద్వారా ఆ పదవిని చేపట్టిన తొలి దక్షిణాసియా వ్యక్తిగా రికార్డు సృష్టించారు. భారత్‌లో హైకోర్టుల స్థాయిలో అమెరికాలో సర్క్యూట్ కోర్టులు ఉంటాయి. సుప్రీంకోర్టు తర్వాత శక్తిమంతమైన కోర్టులుగా వీటిని పరిగణిస్తారు. ఈ కోర్టుల పరిధిలో కొన్ని నగరాలు లేదా కొన్ని రాష్ట్రాలు ఉంటాయి. శ్రీనివాసన్ (52) 'యూఎస్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ ఫర్ ద డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియా సర్క్యూట్' (డీసీ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టు) ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఈ నెల 12న ఆయన బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాసన్‌కు అమెరికా న్యాయ వ్యవస్థలో మంచి పేరున్నది.



# ఆవేదన.. ఆక్రోశం!

- సుప్రీంకోర్టు కమిటీ ఎదుట షాహీన్‌బాగ్ నిరసనకారుల గోడు
- సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌ను రద్దు చేశాకే ఆందోళన విరమిస్తామని స్పష్టీకరణ



షాహీన్‌బాగ్‌లో మాట్లాడుతున్న సంజయ్ హెగ్డే, సాధన రామచంద్రన్.. హాజరైన నిరసనకారులు

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా గత రెండు నెలలుగా నిరవధికంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఢిల్లీలోని షాహీన్‌బాగ్ నిరసనకారులు బుధవారం సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ కమిటీ ముందు తమ ఆక్రోశాన్ని, ఆవేదనను తెలియజేశారు. నిరసనకారులతో చర్చించి ప్రతిష్టంభనను తొలిగించేందుకు సుప్రీంకోర్టు నియమించిన ద్విసభ్య కమిటీలో సభ్యులైన న్యాయవాదులు సంజయ్ హెగ్డే, సాధనా రామచంద్రన్‌తోపాటు మాజీ ఉన్నతాధికారి వజాహత్ హబీబుల్లా బుధవారం షాహీన్ బాగ్‌కు వెళ్లారు. నిరసనకారులతో దాదాపు మూడు గంటలపాటు చర్చలు జరిపారు. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌ను రద్దు చేశాకే తాము ఆందోళన విరమిస్తామని నిరసనకారులు కమిటీకి స్పష్టంచేశారు. దీనిపై రామచంద్రన్ స్పందిస్తూ.. 'నిరసన తెలియజేసేందుకు మీకు హక్కు ఉన్నదని సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. అయితే ఇతర పౌరులకు కూడా హక్కులున్నాయి. వారి హక్కులనూ కాపాడాలి. అందరం కలిసి సమస్యకు పరిష్కారం కనుగొనాలని మేం భావిస్తున్నాం. మీరు చెప్పిన అంశాలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్తాం' అని చెప్పారు.

**అంగుళం కూడా కదలం..**

నిరసనకారులు మధ్యవర్తులకు తమ వాదనను వినిపించారు. మొదటి నుంచీ దీక్షలో పాల్గొన్న 'దాదీ'లలో (వృద్ధ మహిళల్లో) ఒకరైన బిల్కిస్ అనే మహిళ మాట్లాడుతూ.. తమపై తుపాకీ ఎక్కుపెట్టినా ఒక్క అంగుళం కూడా కదలబోమని స్పష్టంచేశారు. 'మేమేమీ రహదారిని దిగ్బంధించలేదు. రోడ్డులో దీక్షా శిబిరం ఉన్నది 100-150 మీటర్లు మాత్రమే. భద్రత పేరిట పోలీసులే బారికేడ్లు ఏర్పాటుచేసి రహదారిని మూసివేశారు. ఇందుకు మమ్మల్ని ఎందుకు నిందిస్తున్నారు' అని పేర్కొన్నారు. సీఏఏను రద్దు చేసే వరకు తాము ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. మరో మహిళ మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణ కోసం తాము నిరసన చేపడుతున్నామని, కానీ కొందరు ప్రజలు కేవలం అసౌకర్యాన్నే చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 'రాత్రిల్లు చలిలో, ఆహారం లేకుండా, పిల్లలను కూర్చొబెట్టుకుని మేం కూడా అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నాం' అని పేర్కొన్నారు. ఇంకో మహిళ మాట్లాడుతూ.. ఈ ఆందోళన తమకు తీవ్ర మానసిక వేదనను కలిగిస్తున్నదని చెప్పారు.

# పంట బీమా స్వచ్ఛందమే

పీఎంఎఫ్‌బీవై, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకాల నిబంధనల్లో మార్పు

4,500 కోట్లతో కొత్తగా ఎఫ్‌పీఓల ఏర్పాటు

స్వచ్ఛభారత్ రెండో దశకు ఆమోదం..కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలు




క్యాబినెట్ నిర్ణయాలు వెల్లడిస్తున్న మంత్రులు నరేంద్రసింగ్ తోమర్, ప్రకాశ్ జవదేకర్, స్మృతి ఇరానీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న పంట బీమా పథకాలను ఇకపై స్వచ్ఛందం చేసింది. ప్రస్తుతమున్న పంట రుణాలపై గానీ లేదా కొత్తగా తీసుకునే రుణాలపై గానీ బీమా సదుపాయాన్ని పొందవచ్చని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ పంట బీమా పథకాల అమలుపై రైతు సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వాలు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన ఢిల్లీలో సమావేశమైన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ, కేంద్ర మంత్రివర్గం పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. పంట బీమా పథకాల అమలులో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంట బీమా పథకం (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్)'ను సంస్కరించాలని క్యాబినెట్ నిర్ణయించింది. ప్రస్తుతమున్న నిబంధనల ప్రకారం పంట రుణం తీసుకున్న రైతులు పీఎంఎఫ్‌బీవై పథకం కింద తప్పకుండా బీమా చేయించాలి. విత్తనాలు వేయక ముందు నుంచి కోత కోసేంత వరకు ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పీఎంఎఫ్‌బీవై కింద బీమా సదుపాయం కల్పిస్తున్నారు. ఇందుకుగాను వానాకాలం పంటలకైతే రెండు శాతం, యాసంగి పంటలకు ఒకటిన్నర శాతం, ఉద్యానవనాలు, వాణిజ్య పంటలకు ఐదు శాతం చొప్పున ప్రీమియం చెల్లించాలి. పీఎంఎఫ్‌బీవై, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్‌లోని కొన్ని పరిమితులు/నిబంధనల సవరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 'ఈ రెండు పథకాలలో రైతులు స్వచ్ఛందంగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు' అని వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ చెప్పారు. ఇక పాడి పరిశ్రమకిచ్చే రుణాలపై వడ్డీ రాయితీని రెండు శాతం నుంచి రెండున్నర శాతానికి పెంచారు.

**కొత్తగా పదివేల రైతు ఉత్పత్తుల సంఘాలు**

2024 నాటికి రూ.4,500 కోట్ల బడ్జెట్ కేటాయింపులతో కొత్తగా పదివేల రైతు ఉత్పత్తుల సంస్థ (ఎఫ్‌పీఓ)లను ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం రైతు ఉత్పత్తుల సంస్థలను ఏర్పాటుచేస్తున్నది. ఎఫ్‌పీఓ ఏర్పాటైన నాటి నుంచి ఐదేండ్ల పాటు ప్రభుత్వం డబ్బు రూపేణా సహకారం అందజేస్తుందని మంత్రి తోమర్ తెలిపారు. ఈ పథకం దాదాపు ఒకటిన్నర లక్షల ఉద్యోగాలను సృష్టించగలదని అన్నారు.

**22వ లా కమిషన్ ఏర్పాటుకు ఆమోదం**

చట్టపరంగా క్లిష్టమైన అంశాలలో ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు 22వ లా కమిషన్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 21వ లా కమిషన్ గడువు 2018, ఆగస్టు 31తో ముగిసింది. కొత్తగా ఏర్పడే కమిషన్ గడువు మూడేండ్లు ఉంటుంది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లేదా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కమిషన్‌కు చైర్‌పర్సన్‌గా ఉంటారు. స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) రెండో దశకూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రెండో దశను 2020-21 నుంచి 2024-25 మధ్య అమలు చేయనున్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌ను రూ.52,497 కోట్లుగా అంచనా వేశారు.

## చావాలనుకునేవారిని ఎవరూ కాపాడలేరు



**లక్నో:** యూపీలో సీఏఏ నిరసనకారులపై పోలీసులు జరిపిన కాల్పులను ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ సమర్థించారు. అసెంబ్లీలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. నిరసనలు ప్రజాస్వామికంగా జరిగితే మద్దతు ఇస్తామని, హింసకు పాల్పడే వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టంచేశారు. 'చావాలన్న ఉద్దేశంతో వచ్చేవాడు ఎలా బతుకుతాడు. ఒకడు ఓ అమాయకుడిని చంపాలని వస్తాడు.. అతడిని పోలీసు అడ్డుకుంటాడు. ఈ పరిస్థితుల్లో ఆ దుండగుడు లేదా పోలీసు మరణించాల్సిందే కదా?' అని వ్యాఖ్యానించారు. పోలీసు కాల్పుల్లో ఒక్కరూ మరణించలేదని, నిరసనకారుల్లో వారికి వారే కాల్పులు జరుపుకొన్నారని చెప్పారు. యూపీలో గత డిసెంబర్‌లో జరిగిన కాల్పుల్లో 20 మంది మృతిచెందారు.



సెట్స్‌లో కుప్పకూలిన క్రేన్

## భారతీయుడు-2 సెట్స్‌లో విషాదం

క్రేన్ విరిగిపడి ముగ్గురు దుర్మరణం

దర్శకుడు శంకర్‌తోపాటు మరో పదిమందికి తీవ్రగాయాలు

**చెన్నై, ఫిబ్రవరి 19:** శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ కథానాయకుడిగా నటిస్తున్న 'భారతీయుడు-2' సినిమా చిత్రీకరణ సందర్భంగా బుధవారం రాత్రి ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. శంకర్‌కు తీవ్రగాయాలైనట్లు తెలుస్తున్నది. చెన్నైలోని ఈవీపీ ఫిల్మ్ సిటీలో సెట్స్ వేస్తుండగా ఒక క్రేన్ విరిగిపడడంతో ఈ దుర్ఘటన సంభవించింది. శంకర్ వ్యక్తిగత సహాయకుడు మధు, అసిస్టెంట్ డైరెక్టర్ సాయికృష్ణ, ఆహార సరఫరాదారు చంద్రన్ మృతిచెందినట్లు సమాచారం. దర్శకుడు శంకర్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయని, ఆయన కాలు విరిగినట్లు సమాచారం. మరో పది మంది వరకు గాయపడినట్లు తెలిసింది. క్షతగాత్రులను వెంటనే దవాఖానకు తరలించారు. ఘటనా స్థలంలోనే ఉన్న కమల్‌హాసన్.. గాయపడిన వారిని దవాఖానకు తరలించడంలో సాయపడ్డారు. సెట్స్‌లో భారీగా ఆస్తినష్టం సంభవించినట్లు తెలుస్తున్నది.

## మేజిస్ట్రేట్లు, సివిల్ జడ్జీలు జిల్లా జడ్జి పోస్టులకు అర్హులు కాదు

**న్యూఢిల్లీ:** మేజిస్ట్రేట్లు, సివిల్ జడ్జీలు ప్రత్యక్ష నియామకం ద్వారా జరిగే జిల్లా జడ్జి పోస్టులకు అర్హులు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏడేండ్లు న్యాయవాదులుగా పనిచేసిన వారు మాత్రమే ఈ ప్రత్యక్ష నియామకాలకు అర్హులని తెలిపింది. అయితే మేజిస్ట్రేట్లు, సివిల్ జడ్జీలు యోగ్యత, సీనియారిటీ ఆధారంగా పదోన్నతి పొందవచ్చని లేదా జిల్లా జడ్జి పోస్టు కోసం నిర్వహించే పోటీ పరీక్ష ద్వారా నియామకం పొందవచ్చని వివరించింది. జిల్లా జడ్జి నియామకాల కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 233ను ధర్మాసనం ఈ సందర్భంగా ప్రస్తావించింది. జిల్లా జడ్జి పోస్టు కోసం జరిగే ప్రత్యక్ష నియామకాలలో న్యాయవాదులకు కోటా ఉంటుందని, వారు ఏడేండ్లపాటు న్యాయవాదిగా పనిచేసి ఉండాలని, నియామకం జరిగే సమయానికి వారు ప్రభుత్వ పదవులలో ఉండరాదని తెలిపింది.

## 'డైమండ్ ప్రిన్సెస్' నుంచి విముక్తి!

- కరోనా 'నెగెటివ్' రావడంతో 500 మంది విడుదల
- మరో భారతీయుడికి వైరస్
- చైనాలో రెండువేలు దాటిన మృతులు



నౌక నుంచి బయటికొస్తున్న ప్రయాణికులు

**యొకోహామా:** కరోనా వైరస్ (కొవిడ్-19) భయాందోళనల నేపథ్యంలో జపాన్ తీరంలో నిలిపివేసిన 'డైమండ్ ప్రిన్సెస్' నౌకలోని 500 మందికి ఎట్టకేలకు విముక్తి లభించింది. వైద్య పరీక్షల్లో 'నెగెటివ్' వచ్చినవారిని బయటకు పంపించారు. 14 రోజులుగా వీరు నౌకలోనే ఉన్న సంగతి తెలిసిందే. పరీక్ష ఫలితాలు రావాల్సి ఉన్నందున మిగిలిన వారిని ఇంకా ఓడలోనే ఉంచారు. నౌకలో మరో భారతీయుడు వైరస్ బారిన పడినట్లు భారత రాయబార కార్యాలయం తెలిసింది. ఇప్పటికే ఆరుగురికి వైరస్ సోకిన సంగతి తెలిసిందే. కాగా, కరోనా వైరస్‌కు 2022నాటికి వ్యాక్సిన్‌ను తయారుచేస్తామని పుణేకు చెందిన సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎస్ఐఐ) పేర్కొంది. మరో ఆరు నెలల్లో మనుషులపై పరీక్ష దశకు చేరుకుంటుందని తెలిపింది.

**వైద్య సిబ్బందికి మరింత రక్షణ: జిన్‌పింగ్**

చైనాలో కరోనా మృతుల సంఖ్య బుధవారంనాటికి 2,004కు చేరుకున్నట్లు చైనా జాతీయ వైద్య కమిషన్ బుధవారం తెలిపింది. మరో 74,100 మందికి వైరస్ నిర్ధారణ అయినట్లు వెల్లడించింది. కరోనా బారినపడుతున్న వైద్య సిబ్బంది సంఖ్య నానాటికీ పెరుగుతుండడంపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్పందించారు. మహమ్మారిని ఓడించడంలో వైద్య సిబ్బంది వెన్నెముకలాంటివారని, వారి రక్షణకు మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. వారిపై ఒత్తిడి తగ్గించేందుకు చర్యలు చేపడుతామని, తగిన విశ్రాంతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. హాంకాంగ్‌లో కరోనాకు మరొకరు బలయ్యారు.

## కశ్మీర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతం

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన ఓ కమాండర్‌తోపాటు మరో ఇద్దరు ఉగ్రవాదులు మరణించినట్లు డీజీపీ దిల్బాగ్ సింగ్ తెలిపారు. త్రాల్ ప్రాంతంలో ఉగ్రవాదులున్నట్లు మంగళవారం రాత్రి సమాచారం అందడంతో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఈ క్రమంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు చోటుచేసుకున్నట్లు చెప్పారు. చనిపోయిన ఉగ్రవాదులను జహంగీర్ అహ్మద్ వనీ, రాజా ఉమర్ మక్బూల్, సదాత్ అహ్మద్ థోకర్‌గా గుర్తించామన్నారు. వీరు పలు హత్య కేసుల్లో నిందితులని చెప్పారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి

**చర్ల రూరల్:** ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం జరిగిన వేర్వేరు ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మరణించారు. సుక్మా జిల్లాలోని చింతగుఫా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీప్రాంతంలో భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడ్డారని, ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు చనిపోయినట్లు సుక్మా జిల్లా ఎస్పీ శలభ్ సిన్హా తెలిపారు. నారాయణపూర్ జిల్లా ఓర్చా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీప్రాంతంలో జవాన్లు, మావోయిస్టుల మధ్య జరిగిన కాల్పుల్లో ఓ మావోయిస్టు చనిపోయినట్లు ఎస్పీ మోహిత్‌గార్గ్ తెలిపారు.

## టైమ్స్ 'వర్ధమాన' 100లో.. 11 భారత వర్సిటీలు

**లండన్:** వర్ధమాన దేశాల్లోని విశ్వవిద్యాలయాలలో భారత్‌కు చెందిన 11 యూనివర్సిటీలు మంచి పనితీరును కనబరిచి టాప్ 100లో స్థానం పొందాయని టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ తెలిపింది. వర్ధమాన దేశాల్లోని వర్సిటీల ర్యాంకింగ్‌లను మంగళవారం సాయంత్రం లండన్‌లో విడుదల చేసింది. మొత్తం 47 దేశాల్లోని వర్సిటీలకు ర్యాంక్‌లు ప్రకటించగా, వాటిలో చైనాకు చెందినవి 30 ఉన్నాయి. వర్ధమాన దేశాలలోని మొత్తం 533 వర్సిటీల్లో భారత్‌కు చెందిన 56 విశ్వవిద్యాలయాలకు ర్యాంక్‌లు ఇచ్చారు. కాగా టాప్ 100లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) 16వ స్థానంలో నిలిచింది. గత ఏడాదితో పోలిస్తే అమృత విశ్వవిద్యాపీఠం 51 స్థానాలు మెరుగుపరచుకొని టాప్ 100లో స్థానం సంపాదించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ 23 స్థానాలు ఎగబాకి 32వ స్థానానికి, ఐఐటీ ఢిల్లీ 38కి, ఐఐటీ మద్రాస్ 63వ స్థానానికి వచ్చాయి.

## ఏ వయస్సులో తల్లి కావచ్చు?

అధ్యయనానికి టాస్క్‌ఫోర్స్: కేంద్రం

**న్యూఢిల్లీ:** ఒక యువతి ఏ వయస్సులో మాతృత్వ దశలోకి ప్రవేశించాలో అధ్యయనం చేయడానికి ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని కేంద్రం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. పెండ్లి చేసుకునేందుకు స్త్రీ, పురుషులకు సమానంగా ఒకే వయోపరిమితిని విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా కేంద్రం తరఫు న్యాయవాది ఇటీవల పార్లమెంట్‌లో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించిన విషయాన్ని ప్రస్తావించారు. టాస్క్‌ఫోర్స్‌కు ఆరునెలల సమయం ఇచ్చారని చెప్పారు. దీంతో కేంద్రానికి మరింత గడువునిస్తున్నామని పేర్కొంటూ కేసు విచారణను హైకోర్టు మే 28కి వాయిదా వేసింది. పెండ్లి వయసు పురుషులకు 21గా, మహిళలకు 18గా నిర్దేశించడం వివక్ష అని పిటిషనర్ చెప్పారు.



సమావేశమైన రామమందిరం ట్రస్ట్ సభ్యులు

## రామాలయ ట్రస్ట్ అధ్యక్షుడిగా గోపాల్‌దాస్

మందిర నిర్మాణ కమిటీ అధ్యక్షుడిగా నృపేంద్ర మిశ్రా

ట్రస్ట్ తొలి సమావేశంలో ఎన్నిక

**న్యూఢిల్లీ:** అయోధ్యలో రామాలయం నిర్మాణ పర్యవేక్షణకు ఏర్పాటుచేసిన 'శ్రీ రామజన్మ భూమి తీర్థ క్షేత్ర' ట్రస్ట్ అధ్యక్షుడిగా మహంత్ నృత్యగోపాల్ దాస్, ప్రధాన కార్యదర్శిగా వీహెచ్‌పీ ఉపాధ్యక్షుడు చంపత్ రాయ్ ఎన్నికయ్యారు. సీనియర్ న్యాయవాది కే పరాశరణ్ నివాసంలో బుధవారం జరిగిన ట్రస్ట్ తొలి సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. ప్రధాని మోదీకి గతంలో ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన నృపేంద్ర మిశ్రాను మందిర నిర్మాణ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. రామాలయ నిర్మాణానికి వీహెచ్‌పీ ఏర్పాటు చేసిన 'రామజన్మభూమి న్యాస్' ట్రస్ట్‌కు గోపాల్‌దాస్ అధిపతిగా ఉన్నారు. రామమందిర నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు విధివిధానాల రూపకల్పనే లక్ష్యంగా ఈ భేటీ జరిగింది. ఏప్రిల్‌లో మందిరం నిర్మాణం మొదలుపెట్టాలని సభ్యులు భావిస్తున్నారు. నిర్మాణం 3-4 ఏండ్లు పట్టొచ్చని సమాచారం. రామాలయ ప్రధాన మోడల్ వీహెచ్‌పీ రూపొందించిన తరహాలోనే ఉంటుందని, అయితే ఎత్తు, వెడల్పు మారొచ్చని దాస్ తెలిపారు. మందిరం నిర్మాణం కోసం విరాళాలు సేకరించేందుకు అయోధ్యలోని ఎస్బీఐ బ్రాంచ్‌లో ఖాతా తెరువాలని నిర్ణయించినట్లు సమావేశం అనంతరం చంపత్‌రాయ్ మీడియాకు వెల్లడించారు. పుణేకు చెందిన స్వామి గోవింద్ దేవ్ గిరిని ట్రస్ట్ కోశాధికారిగా నియమించారు. పెజావర్ మఠానికి చెందిన స్వామి విశ్వప్రసన్నతీర్థ్ ఆయనకు రూ.5లక్షల విరాళం అందజేశారు. సమావేశంలో మొత్తం తొమ్మిది తీర్మానాలు ఆమోదించారు. అయోధ్య వివాదంపై గతేడాది నవంబర్ 9న సుప్రీంకోర్టు వెలువరించిన చారిత్రక తీర్పును అనుసరించి మోదీ సర్కారు 15 మంది సభ్యులతో కూడిన ఈ ట్రస్ట్‌ను ఏర్పాటుచేసింది. ఇదివరకే తొమ్మిది మంది సభ్యులను నామినేట్ చేసింది.



సీఏఏను వ్యతిరేకిస్తూ తమిళ నాడు రాజధాని చెన్నైలో బుధవారం వేలమంది ముస్లింలు భారీ ప్రదర్శన నిర్వహించారు. వివిధ ముస్లిం సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనతో చెపాక్ ప్రాంతం జనసంద్రంగా మారింది.

# నిపుణులకే ఎర్రతివాచీ!

- బ్రెగ్జిట్ నేపథ్యంలో బ్రిటన్ కొత్త వలస విధానం
- 'పాయింట్ల ఆధారిత వీసా' వ్యవస్థకు రూపకల్పన
- 70 పాయింట్లు ఉంటేనే వీసా
- వచ్చే ఏడాది నుంచి అమలు



ప్రీతీ పటేల్

**లండన్, ఫిబ్రవరి 19:** యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి బయటికి వస్తున్న నేపథ్యంలో బ్రిటన్ సరికొత్త వలస విధానాన్ని ప్రకటించింది. నైపుణ్యం ఉన్నవారిని మాత్రమే తమ దేశంలోకి అనుమతించేలా 'పాయింట్ల ఆధారిత వీసా' విధానాన్ని రూపొందించింది. బ్రిటన్ హోంమంత్రి, ప్రవాస భారతీయురాలు ప్రీతీపటేల్ బుధవారం ఈ విధానాన్ని వివరించారు. 'ఇది ప్రపంచానికే చారిత్రాత్మకమైన రోజు. బ్రిటన్‌లోకి ఇష్టారీతిన వచ్చివెళ్లే విధానానికి అంతం పలుకుతున్నాం. మా సరిహద్దులను మా ఆధీనంలోకి తీసుకుంటున్నాం. ప్రజల ఆకాంక్షల మేరకు పాయింట్ల ఆధారిత వలస విధానాన్ని ప్రకటిస్తున్నాం. తద్వారా వలసదారులు తగ్గడంతోపాటు ప్రతిభ ఉన్నవారు, నైపుణ్యం కలిగినవారే బ్రిటన్‌కు వస్తారు' అని ప్రీతీ పటేల్ పేర్కొన్నారు. కొత్త విధానం వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందన్నారు.

**చదువు, నైపుణ్యాలకు పాయింట్లు**

కొత్త విధానం ప్రకారం విద్యార్హతలు, నైపుణ్యాలు వంటివాటిని లెక్కించి పాయింట్లు కేటాయిస్తారు. విదేశీయులు కచ్చితంగా ఇంగ్లిష్‌లో మాట్లాడాలి. కంపెనీ నియామక పత్రం ఉండాలి. ఈ రెండింటికీ కలిపి 50 పాయింట్లు ఇస్తారు. విద్యార్హతలు, అదనపు నైపుణ్యాలు, జీతభత్యాలు, వృత్తి వంటివాటి ఆధారంగా అదనపు పాయింట్లు కేటాయిస్తారు. కనీసం 70 పాయింట్లు సాధించినవారికి మాత్రమే వీసా మంజూరు చేస్తారు. కనీస వార్షిక వేతనాన్ని 25,600 పౌండ్లుగా (రూ.23.75 లక్షలు) నిర్ధారించారు. గతంలో ఇది 30వేల పౌండ్లుగా (రూ.27.85 లక్షలు) ఉండేది. ప్రస్తుతం డిగ్రీ చదివినవారు కూడా వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ, నూతన విధానం ప్రకారం కనీసం పీజీ లేదా సత్సమానమైన అర్హత కలిగి ఉండాలి. నూతన వలస విధాన బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందాల్సి ఉన్నదన్నారు.

**శాస్త్రవేత్తలకు.. విద్యార్థులకు ప్రత్యేక పథకం**

'ద గ్లోబల్ టాలెంట్ స్కీమ్' పేరుతో బ్రిటన్ నూతనంగా రూపొందించిన ఫాస్ట్-ట్రాక్ వీసా విధానం శుక్రవారం నుంచి అమల్లోకి రానున్నది. ఈయూ సభ్యదేశాలకు చెందిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు వంటివారు ఎలాంటి ఉద్యోగ నియామకపత్రం లేకుండా స్వేచ్ఛగా బ్రిటన్‌కు వలస వచ్చేందుకు దీనికి రూపకల్పన చేశారు. బ్రిటన్‌లో చదువాలనుకునే విదేశీ విద్యార్థులకూ పాయింట్ల ఆధారిత నూతన వీసా విధానం రూపొందించినట్టు ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వ అనుమతి పొందిన విద్యాసంస్థలో చేరుతున్నట్టు పత్రాలు చూపించాలి. సొంతంగా చదువు పూర్తిచేసేందుకు తగిన ఆర్థిక స్థోమత ఉన్నదని నిరూపించాలి. కచ్చితంగా ఆంగ్లం మాట్లాడగలగాలి. అయితే ఈయూ పౌరులకు మాత్రం మినహాయింపు ఉంటుంది.

**ప్రశంసలు.. విమర్శలు**

బ్రిటన్ కొత్త వలస విధానంపై ప్రశంసలతో పాటు విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. నూతన వీసా విధానం 'ప్రతికూల వాతావరణాన్ని' సృష్టిస్తుందని, కార్మికులను ఆకర్షించడం కష్టంగా మారుతుందని ప్రతిపక్ష లేబర్ పార్టీ విమర్శించింది. 'జెనో ఫోబియా' (విదేశీయుల పట్ల భయం) కారణంగానే ఈ విధానాన్ని రూపొందించారని డెమోక్రాట్ పార్టీ అధికార ప్రతినిధి క్రిస్టీన్ జార్డెన్ పేర్కొన్నారు. నూతన వీసా విధానాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను, శాస్త్రవేత్తలను, పరిశోధకులను ఆకర్షించవచ్చని లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ అలైస్ గాస్ట్ ప్రశంసించారు.



రవీంద్రనాథ్ త్రిపాఠి

## యూపీ బీజేపీ ఎమ్మెల్యేపై రేప్ కేసు

**బదోహి:** ఓ మహిళపై లైంగికదాడికి పాల్పడిన ఆరోపణలపై ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ త్రిపాఠి, మరో ఆరుగురిపై కేసు నమోదైంది. 2017లో వారంతా నెల రోజులపాటు తనపై లైంగికదాడికి పాల్పడినట్లు ఓ వితంతు మహిళ (40) ఈ నెల 10న బదోహి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. త్రిపాఠి మేనల్లుడు సందీప్ తివారీ 2016లో తొలుత ఆ మహిళపై లైంగికదాడికి పాల్పడ్డాడు. పెండ్లి చేసుకుంటానని నమ్మించాడు. 2017లో యూపీ అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఆమెను నెల రోజులపాటు ఓ హోటల్‌లో ఉంచి తివారీ, రవీంద్రనాథ్, మరో ఐదుగురు లైంగికదాడికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని ఎస్పీ రామ్ బదాన్ సింగ్ తెలిపారు.

## సీవీసీగా సంజయ్ కొఠారీ

సీఐసీగా బిమల్ జుల్కా.. ప్రధాని నేతృత్వంలోని కమిటీ ఎంపిక



**న్యూఢిల్లీ:** చీఫ్ విజిలెన్స్ కమిషనర్(సీవీసీ)గా రాష్ట్రపతి కార్యదర్శి సంజయ్ కొఠారీ, ప్రధాన సమాచార కమిషనర్(సీఐసీ)గా సమాచార కమిషనర్ బిమల్ జుల్కా పేర్లను మోదీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ బుధవారం ఎంపిక చేసింది. విజిలెన్స్ కమిషనర్‌గా సురేశ్ పాటిల్‌ను, సమాచార కమిషనర్‌గా అనితా పాండవ్‌ను నియమించనున్నది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పీఎంవో, సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి తదితరులతో కూడిన కమిటీలోని మెజార్టీ సభ్యుల నిర్ణయం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రపతి ఆమోదం అనంతరం అధికారికంగా ప్రకటించనున్నారు. మరోవైపు ఈ నిర్ణయాన్ని అధిర్‌రంజన్ చౌదరి వ్యతిరేకించారు. వీరి ఎంపిక ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధంగా జరిగిందని, వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీశ్ తివారీ డిమాండ్ చేశారు. సీవీసీని రబ్బర్ స్టాంప్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

## మనుమడిని కలుసుకోనివ్వండి!

తాతానానమ్మలను అడ్డుకోవద్దు.. కోడలికి బాంబే హైకోర్టు చీవాట్లు

**ముంబై:** మనుమడ్ని కలుసుకోవాలనుకుంటున్న తాతానానమ్మలను అడ్డుకోవద్దని ఓ మహిళకు బాంబే హైకోర్టు సూచించింది. ఆమె పిటిషన్‌ను తిరస్కరించింది. ముంబైకు చెందిన ఓ మహిళకు ఓ వ్యక్తితో వివాహమైంది. 2009 డిసెంబర్‌లో వారికి ఓ కుమారుడు జన్మించగా 2010 ఫిబ్రవరిలో భర్త మరణించాడు. అనంతరం ఆమె మరో పెండ్లి చేసుకున్నది. కాగా, మనుమడ్ని ఆమె కలుసుకోనివ్వడం లేదని ఆరోపిస్తూ చనిపోయిన భర్త తల్లిదండ్రులు కుటుంబ కోర్టును ఆశ్రయించగా, ఢిల్లీలో ఉండే వారు ముంబై వచ్చినప్పుడు మనుమడ్ని కలుసుకునేలా చూడాలని 2014లో కోర్టు తీర్పు ఇచ్చింది. ఆమె లెక్కచేయకపోవడంతో వారు మళ్లీ కోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రతి శనివారం కోర్టు ప్రాంగణంలో మనుమడ్ని కలుసుకునేలా చూడాలని, లేనిపక్షంలో జరిమానా విధిస్తామని హెచ్చరించింది. దీన్ని సవాల్ చేసిన ఆ మహిళకు బాంబే హైకోర్టు చీవాట్లు పెట్టింది.







రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు వేములవాడ రాజన్న సన్నిధి, కాళేశ్వరం ముక్తీశ్వరాలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. గురువారం నుంచి జాతర ఉత్సవాలు జరుగనుండగా, అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ ఉత్సవాలకు మన రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లోని బాలబ్రహ్మేశ్వరాలయంలోనూ శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. - వేములవాడ, కాళేశ్వరం




శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. తెల్లవారుజాము నుంచి కృష్ణానదిలో పుణ్య స్నానాలు చేసుకున్న శివస్వాములు స్వామిఅమ్మవార్ల దర్శనానంతరం జ్యోతిర్ముడి విరమణలు చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్లకు మహాపుష్ప పల్లకిల్లో గ్రామోత్సవం వైభవంగా సాగింది. బుధవారం సాయంత్రం అలంకార మండపంలో ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్త పూజలు నిర్వహించి గంగాధర మండపం వద్ద పల్లకిపై వేంచేబు చేశారు.- శ్రీశైలం




కరీంనగర్ జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈటల, గంగుల. చిత్రంలో చైర్‌పర్సన్ విజయ

## పట్టణ ప్రగతితో సమస్యలకు శాశ్వత పరిష్కారం

మంత్రులు ఈటల రాజేందర్, గంగుల కమలాకర్

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా రేపటి తరానికి బంగారు భవిష్యత్తునిద్దామనీ, హరితహారంలో పెద్దసంఖ్యలో మొక్కలు నాటి మన బిడ్డలకు మంచి బతుకునిద్దామని రాష్ట్ర మంత్రులు ఈటల రాజేందర్, గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. పల్లె, పట్టణప్రగతితో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, వచ్చే రెండేండ్లలో సమస్యలను వదిలి అభివృద్ధిపైనే స్థానికసంస్థల సభల్లో చర్చించుకోవాల్సి వస్తుందన్నారు. బుధవారం కరీంనగర్ జెడ్పీ సర్వసభ్య సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ.. ఒకప్పుడు రాష్ట్రంలో కరెంట్ సమస్య తీవ్రంగా ఉండేదనీ, ఇప్పుడు ఏ పల్లెకు వెళ్లి అడిగినా ఈ సమస్య ప్రస్తావనే రాదన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగు నీటిని అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందనీ, కాంట్రాక్టు వ్యవస్థ సరిగ్గా లేక కొంత ఆలస్యం అవుతున్నదనీ, అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీలతో చర్చించి పథకం పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తామని చెప్పారు. అనంతరం మంత్రి గంగుల మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ర్టాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


జనగామలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో మండలి చీఫ్‌విప్ బోడకుంటి తోపాటు ఎమ్మెల్యేలు ఉన్నారు.


నల్లగొండలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. వేదికపై ఎంపీ బడుగుల, జెడ్పీచైర్మన్ బండా, ఎమ్మెల్యే కంచర్ల , ఎమ్మెల్సీ కర్నె తదితరులున్నారు.


మహబూబ్‌నగర్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

# ప్రగతి పనులతో కొత్తరూపు

- మౌలిక సదుపాయాల కల్పనకే పెద్దపీట
- పల్లెలు మురవాలి.. పట్టణాలు మెరవాలి
- పంచాయతీరాజ్ సమ్మేళనాల్లో మంత్రులు
- పలు జిల్లాల్లో అవగాహన సదస్సులు


బుధవారం మెదక్‌లో జరిగిన పల్లెప్రగతి సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరిసుభాశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, క్రాంతికిరణ్ ఉన్నారు.

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనల్లోంచి రూపుదిద్దుకున్న పల్లెప్రగతి, పట్టణప్రగతి కార్యక్రమాలతో గ్రామాలు, పట్టణాలు కొత్తరూపు దిద్దుకొంటున్నాయని పలువురు మంత్రులు పేర్కొన్నారు. బుధవారం మెదక్, జనగామ, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, నిర్మల్, పెద్దపల్లి, వికారాబాద్ జిల్లాల్లో మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి. కొప్పుల ఈశ్వర్, సబితా ఇంద్రారెడ్డి పంచాయతీరాజ్ సమ్మేళనాల్లో పాల్గొని.. ప్రజాప్రతినిధులకు, అధికారులకు అవగాహన కల్పించారు.

**ఆదర్శ పల్లెలకు రూ.10లక్షల నజరానా:**
**మంత్రి ఎర్రబెల్లి**

సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లెప్రగతి ప్రణాళికలో ఆదర్శంగా నిలిచే పల్లెలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తానని పంచాయతీరాజ్‌శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రకటించారు. బుధవారం జనగామ జిల్లాకేంద్రంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులకు పల్లె, పట్టణ ప్రగతి ప్రత్యేక ప్రణాళికపై నిర్వహించిన పంచాయతీరాజ్ సమ్మేళనానికి మండలి చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు యాదగిరిరెడ్డి, రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, కలెక్టర్ నిఖిలతో కలిసి పాల్గొన్నారు. పచ్చదనం-పరిశుభ్రత, డంపింగ్‌యార్డులు, శ్మశానవాటికల నిర్మాణం, హరితహారం తదితర అంశాల్లో ఆదర్శంగా నిలిచిన మండలంలోని ఐదు గ్రామాలకు రూ.10 లక్షలను సీసీ రోడ్ల నిర్మాణానికి బహుమతిగా అందిస్తానని ప్రకటించారు.

**మార్చి 31లోగా పనులు పూర్తిచేయాలి :**
**మంత్రి హరీశ్‌రావు**

పల్లెప్రగతి పనులను మార్చి 31 లోగా పూర్తి చేయాలని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సర్పంచ్‌లకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. బుధవారం మెదక్ కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ సమ్మేళనం కార్యక్రమంలో కలెక్టర్ ధర్మారెడ్డి అధ్యక్షతన ఎంపీ కొత్తప్రభాకర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతశేఖర్‌గౌడ్, ఎమ్మెల్సీ శేరిసుభాశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, క్రాంతికిరణ్‌లతో కలిసి పల్లెప్రగతిపై సమీక్షించారు. జిల్లాలో రెండువిడుతల్లో మిగిలిపోయిన పనులను తొందరగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు రాష్ట్రస్థాయి అధికారులు, స్పెషల్‌స్క్వాడ్ బృందాలు గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించవచ్చుని, పనులు సక్రమంగా లేని గ్రామాల్లో సర్పంచులు, అధికారులపై చర్యలు తప్పవన్నారు.

**దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ:**
**మంత్రి జగదీశ్‌రెడ్డి**

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లాకేంద్రంలో పంచాయతీరాజ్ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. మిషన్ భగీరథ, సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్, టీఎస్ఐపాస్ వంటి అనేక పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయన్నారు. సంక్షేమ రంగంలో రూ.50వేల కోట్లు ఖర్చు పెడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు. త్వరలో చేపట్టబోయే పట్టణ ప్రణాళికలో స్థానిక కౌన్సిలర్లు, అధికారులు భాగస్వాములై వార్డులను సుందరంగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. జెడ్పీచైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, విప్ కర్నె ప్రభాకర్, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ చిన్నపరెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల, చిరుమర్తి, గాదరి, రవీంద్రకుమార్, భాస్కర్‌రావు, కోమటిరెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**ప్రజాప్రతినిధుల గౌరవం పెరిగింది:**
**మంత్రి వేముల**

పల్లెప్రగతి కార్యక్రమం ప్రజాప్రతినిధుల గౌరవం పెంచిందని ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ నగరంలో బుధవారం నిర్వహించిన పంచాయతీరాజ్ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. పల్లెప్రగతి కార్యక్రమం సీఎం కేసీఆర్ మేథోమధనం నుంచి పుట్టిందన్నారు. గ్రామాల్లో ఏం చేస్తే అభివృద్ధి జరుగుతుందో అని చర్చించి ప్రారంభించిన కార్యక్రమం పల్లెప్రగతి అన్నారు.

**పల్లె, పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు:**
**మంత్రి అల్లోల**

పల్లెలు, పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నదని దేవాదాయ శాఖమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. నిర్మల్‌లో బుధవారం నిర్వహించిన పంచాయతీరాజ్ సమ్మేళనంలో మంత్రి పాల్గొన్నారు. స్థానిక సంస్థల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం పల్లెప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలు చేపట్టి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసుకునేందుకు నిధులు కేటాయిస్తున్నదని అన్నారు.

**నిరంతరంగా పట్టణ ప్రగతి :**
**మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

పట్టణ ప్రగతి కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. పట్టణాల స్వరూపాన్ని మార్చేందుకు సీఎం ఆలోచనల నుంచి రూపుదాల్చుకున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన పంచాయతీరాజ్ సమ్మేళనానికి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. పచ్చదనం-పారిశుద్ధ్యం, పార్కులు, శ్మశాన వాటికల నిర్మాణం, వెజ్-నాన్‌వెజ్ మార్కెట్లు, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం పనులను చేపట్టేందుకు మున్సిపల్ చైర్మన్లు కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు.

**సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం:**
**మంత్రి సత్యవతిరాథోడ్**

సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తున్నదని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. బుధవారం మహబూబాబాద్‌లో పంచాయతీరాజ్ సమ్మేళనంలో ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, హరిప్రియనాయక్, సీతక్కలతో కలిసి పాల్గొన్నారు. పట్టణప్రగతి కార్యక్రమంలో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు పిలుపునిచ్చారు.

**సామాజిక ఉద్యమంలా జరగాలి :**
**మంత్రి కొప్పుల ఈశ్వర్**

పల్లెప్రగతి కార్యక్రమాలు సామాజిక ఉద్యమంలా జరగాలని ఎస్సీసంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లాకేంద్రంలో జరిగిన పంచాయతీరాజ్ సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాల అభివృద్ధి విషయంలో పోటీపడి పనిచేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పంచాయతీరాజ్ చట్టంపై క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. పల్లెప్రగతి, పట్టణ ప్రగతి సంపూర్ణంగా జరిగితే 60ఏండ్ల దరిద్రాన్ని మనమందరం కలిసి దూరం చేసిన వాళ్లం అవుతామని చెప్పారు. అందరం పట్టుదలతో పనిచేసి ముఖ్యమంత్రి కేసీఆర్ కలలుగన్న బంగారు తెలంగాణను సాకారం చేసుకుందామన్నారు.

**పట్టణాలను అభివృద్ధి చేసుకుందాం :**
**మంత్రి సబితాఇంద్రారెడ్డి**

మున్సిపాలిటీల్లో పట్టణప్రగతి కార్యక్రమంతో మంత్రి సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం వికారాబాద్ జిల్లా పూడురు మండలం మన్నెగూడలోని జేకే పంక్షన్‌హాల్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం ఆదేశాలమేరకు జిల్లాల్లో పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా పంచాయతీరాజ్ సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ పర్యాద కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


ఛత్రపతి శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. శివాజీ జయంతి సందర్భంగా బుధవారం మెదక్ జిల్లా రామాయంపేటలో ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు, జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ శివాజీ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శివాజీ ధైర్యసాహసాలకు మారుపేరని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. - ధర్మపురి, నమస్తే తెలంగాణ/రామాయంపేట


ఖమ్మం జిల్లా గుదిమల్ల శివారులో నకిలీ విత్తనాలను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

## రూ.48లక్షల మిరప విత్తనాలు సీజ్

**ఖమ్మం రూరల్, నమస్తే తెలంగాణ:** అనుమతులు లేకుండా మిరపవిత్తనాలు తయారు చేస్తున్న ఓ వ్యాపారిని టాస్క్‌ఫోర్స్, వ్యవసాయశాఖ అధికారులు బుధవారం అదుపులోకి తీసుకొని, 122 బస్తాల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం జిల్లా గుదిమళ్ల శివారులోని ఓషెడ్డులో ఖమ్మం నగరానికి చెందిన చింతకాయల బాబు అనే వ్యక్తి అనుమతులు లేకుండా మిరప విత్తనాలు తయారుచేస్తున్నట్టు అధికారులకు సమాచారమందింది. రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, అధికారులు తనిఖీలు చేపట్టి విత్తనాలను సీజ్ చేశారు. వీటి విలువ సుమారు రూ.48లక్షలు ఉంటుందని తెలిపారు. బాబుపై కేసు నమోదు చేసినట్టు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ వెంకట్రావ్ తెలిపారు.

# గోదారమ్మ పరుగులు

- కాళేశ్వరం లింక్-1, 2లో దిగ్విజయంగా ఎత్తిపోతలు
- తాజాగా ఎస్సారెస్పీ పునర్జీవానికి నీటి తరలింపు మొదలు


బుధవారం నందిమేడారం పంప్‌హౌజ్ సిస్టర్న్‌ల వద్ద ఉప్పొంగుతున్న జలాలు

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ప్రాజెక్ట్ లింక్-1, 2లో గోదారి జలాల ఎత్తిపోతలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. పెద్దపల్లి జిల్లాలోని సరస్వతి పంప్‌హౌజ్‌లో 1, 3, 5, 7, 8 మోటర్ల ద్వారా పార్వతి బరాజ్‌లోకి నీటిని ఎత్తిపోస్తున్నారు. అంతర్గాం మండలం గోలివాడలోని పార్వతీ పంప్‌హౌజ్ 3, 6, 7, 8 మోటర్ల ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీటిని ఎత్తిపోస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని ఆరోప్యాకేజీలో నంది పంప్‌హౌజ్‌లో ఎత్తిపోతలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి వరకు 3, 5, 6 మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోశారు. బుధవారం తెల్లవారుజామున మూడో మోటర్‌ను నిలిపేసి, నాలుగో మోటర్‌ను ఆన్ చేసి 9,450 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నట్టు అధికారులు తెలిపారు. నంది రిజర్వాయర్ నుంచి ఏడో ప్యాకేజీలోని జంట సొరంగాల ద్వారా 8 ప్యాకేజీలోని కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌజ్‌కు తరలుతున్నాయి. ఇక్కడ బుధవారం 1, 2, 4 మోటర్ల ద్వారా ఎస్సారార్ రిజర్వాయర్‌తో పాటు తాజాగా ఎస్సారెస్పీ పునర్జీవ పథకానికి నీటిని తరలిస్తున్నారు. ఎత్తిపోతల ప్రక్రియను ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

**ఎస్సారెస్పీ పునర్జీవ పథకానికి ఎత్తిపోతలు..**

ఎస్సారెస్పీ పునర్జీవ పథకంలో భాగంగా జగిత్యాల జిల్లాలోని రాంపూర్, రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌజ్‌ల ద్వారా నిజామాబాద్‌లోని ఎస్సారెస్పీకి అధికారులు నీటిని వదిలారు. గాయత్రి పంప్‌హౌజ్‌లో 1,2,4 మోటర్ల ద్వారా ఎత్తిపోస్తున్న 9,500 క్యూసెక్కుల్లో 3,500 క్యూసెక్కుల నీటిని రామడుగు మండలం షానగర్ సమీపంలోని వరద కాల్వ 102 కిలోమీటర్ వద్ద ఏర్పాటు చేసిన గేట్లు ఎత్తి ఎస్సారెస్పీకి వదిలారు. ఎగువకు విస్తరించిన జలాలు కొద్దిసేపటికే వరదకాల్వ 73వ కిలోమీటర్ వద్ద ఉన్న రాంపూర్ పంప్‌హౌజ్‌కు చేరుకోగా, రాత్రి 10 గంటలకు 3వ మోటర్‌ను ఆన్ చేసి ఎత్తిపోతలు ప్రారంభించారు.

**లక్ష్మీ బరాజ్‌లో 13.382 టీఎంసీల నీటి నిల్వ**

**మహదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి గ్రామ పరిధిలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన లక్ష్మీ బరాజ్‌లో 13.382 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. కొన్నిరోజులుగా లక్ష్మీ బరాజ్‌లోకి నీటి ప్రవాహం వచ్చి చేరగా పూర్తిస్థాయి సామర్థ్యానికి చేరుకున్నది. కన్నెపల్లి పంప్‌హౌజ్ ద్వారా మోటర్లు నడిపిస్తుండగా క్రమక్రమంగా నీటి ప్రవాహం తగ్గుముఖం పడుతున్నది. బుధవారం మోటర్లు నిలిపివేయడంతో 13.382 టీఎంసీల నీటి నిల్వ కొనసాగుతుంది.

## దివ్యహత్య కేసులో లొంగిపోయిన నిందితుడు


వెంకటేశ్

**వేములవాడ, నమస్తే తెలంగాణ / గజ్వేల్ అర్బన్:** బ్యాంక్ ఉద్యోగి దివ్య హత్యకేసులో నిందితుడు వెంకటేశ్ బుధవారం వేములవాడ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో మంగళవారం బ్యాంక్ ఉద్యోగి దివ్య దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. దివ్య కొన్నేండ్ల క్రితం వేములవాడలో కుటుంబంతోకలిసి ఉండేది. ఆ సమయంలో వేములవాడకు చెందిన వెంకటేశ్.. దివ్య కొంతకాలం ప్రేమించుకొని తర్వాత విడిపోయారు. కాగా ఇటీవల దివ్యకు బ్యాంకు ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులతోకలిసి గజ్వేల్‌లో ఉంటున్నది. ఈ నెల 26న ఆమెకు వివాహం జరగాల్సిఉన్నది. ఈ క్రమంలో మంగళవారం దారుణహత్యకు గురైంది. మాజీ ప్రియుడు వెంకటేశే హత్యకు పాల్పడి ఉంటాడని దివ్య తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా నిందితుడు వేములవాడ పోలీసులకు లొంగిపోవడంతో అతడిని గజ్వేల్ పోలీసులకు అప్పగించారు.


సురభి శంకరశర్మకు బిరుదును ప్రదానం చేస్తున్న సదుగరు ప్రతాప దక్షిణామూర్తి దీక్షితులు

## సురభి శంకరశర్మకు 'భర్తృహరి' బిరుదు

**కోహీర్:** ఆస్థానల్ మేనేజర్ సురభి శంకర శర్మకు బుధవారం భర్తృహరి బిరుదును ప్రదానం చేశారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ పట్టణంలోని ఓంకారేశ్వరాలయంలో నిర్వహించిన అష్టావధానం కార్యక్రమంలో ఆయన ప్రతిభను కనబర్చారు. దీంతో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్, ఆలయ పీఠాధిపతి సద్గురు డాక్టర్ ప్రతాప దక్షిణామూర్తి ఆయనకు బిరుదును ప్రదానం చేశారు.


వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో బుధవారం ఐదు కిలోల బరువుతో శిశువు జన్మించినట్టు దవాఖాన సూపరింటెండెంట్ హరీశ్‌సాగర్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా రాంపురానికి చెందిన చంద్రశేఖర్, లక్ష్మి దంపతులకు మొదటి కాన్పులో ఈ శిశువు జన్మించినట్టు తెలిపారు. - వనపర్తి వైద్యం


నిరుపేదలు ఆత్మగౌరవంతో బతుకాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించి ఇస్తున్నదని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలో నూతనంగా నిర్మించిన 20 డబుల్ బెడ్‌రూం ఇండ్లను జెడ్పీ అధ్యక్షురాలు దావ వసంతతో కలిసి బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. జగిత్యాల మండలంలో నర్సింగాపూర్, ధరూర్ గ్రామాల శివారులో ఇదివరకే ఇరవై ఇండ్లను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ జీ రవి తదితరులు పాల్గొన్నారు. - జగిత్యాల రూరల్

## ముగ్గురు దోపిడీ దొంగల పట్టివేత

**న్యాల్‌కల్:** తెలంగాణ- కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో దారిదోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు అనుమానితులను సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం వడ్డి, శంశోల్లాపూర్ గ్రామస్థులు మంగళవారం రాత్రి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన కొందరు దుండగులు బీదర్ - జహీరాబాద్ దారిలో వెళ్లేవారిని అడ్డగించి డబ్బు, నగలు దోచుకుంటున్నారు. దీంతో వడ్డి, శంశోల్లాపూర్ గ్రామానికి చెందిన కొందరు రహదారి పక్కన కాపుకాచి ముగ్గురు అనుమానితులను పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారమందించగా వారు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.

నమస్తే తెలంగాణ
# రైతుబడి
[ కరీంనగర్ ]
గురువారం 20 ఫిబ్రవరి 2020
raithubadi@ntnews.com





# రైతు స్థాయిలోనే కాకరలో విత్తనోత్పత్తి

**రాష్ట్రంలో** సాగవుతున్న పందిరి కూరగాయ కాకర. ఎన్నో ఔషధ గుణాలున్న దృష్ట్యా కాకరకాయను వినియోగదారులు ఎక్కువగా ఇష్టపడుతారు. అయితే విత్తు దగ్గరే రైతు నష్టపోతున్నాడు. కొన్ని కిటుకులు పాటిస్తే రైతుస్థాయిలోనే కాకరలో విత్తనోత్పత్తి చేసుకోవచ్చు. ఏడాదంతా ఈ పంటలో రాష్ట్రంలో విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. అయితే గాలిలో తేమ ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో యాసంగి లేదా ఎండకాలంలో విత్తనోత్పత్తి చేపట్టాలి. ఎత్తయిన గిరిజన ప్రాంతాలలో అయితే కచ్చితంగా ఎండకాలంలోనే విత్తనోత్పత్తి చేయాలి. సెప్టెంబర్ చివరి వారం లేదా అక్టోబర్ మొదటివారంలో విత్తనాలు విత్తుకోవచ్చు.

**రకాలు**

**నేలలు:** విత్తనోత్పత్తికి ఎంచుకునే నేలలో సొంతంగా విత్తుకున్న మొక్కలు ఉండరాదు. మురుగునీరు పోయే నేలలు, సారవంతమైన నేలలు అనుకూలం.

**విత్తన ఎంపిక**

కచ్చితంగా నమ్మకమైన సంస్థ లేదా నాణ్యమైన వనరుల నుంచి మాత్రమే విత్తనం సేకరించాలి. నాణ్యంగా, ఆరోగ్యకరంగా ఉండి చీడపీడలులేని విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. పలిగిన, రంగు కోల్పోయిన విత్తనాలు తీసివేయాలి.

**విత్తన మోతాదు:** ఎకరాకు రెండు కిలోలు

నాటడానికి ముందు విత్తనాలను 30 నిమిషాల పాటు వెచ్చని నీటిలో ఉంచాలి. దీంతో విత్తన చివరి గట్టిపొర మెత్తబడుతుంది. తడి ఉన్న గోనె సంచి లేదా తేమతో కూడిన గుడ్డ సంచులలో 3–4 రోజులు ఉంచితే కూడా గింజలు మెత్తబడి, మొలకలు త్వరగా వస్తాయి. కిలో విత్తనానికి నాలుగు గ్రాముల చొప్పున ట్రైకోడెర్మా విరిడి జీవ శిలీంధ్ర నాశనితో విత్తనశుద్ధి చేస్తే శిలీంద్రాల తాకిడి తగ్గుతుంది.

**ప్రధాన పొలంలో నాటడం:** ప్రధాన పొలాన్ని 3–4 సార్లు మెత్తగా దున్నాలి. రెండు మీటర్ల మధ్య దూరంతో 60 సెం.మీల వ్యాసార్థంతో కాలువలు చేయాలి. కాలువల సాలులో ఒక మీటరు లోతులో 30 సెం.మీ వ్యాసార్థంతో గుంతలు తయారుచేయాలి. గుంతలలో రెండు సెం.మీ లోతులో నిలువుగా విత్తనాలు విత్తుకోవాలి. మొదట ఒక గుంతకు రెండు విత్తనాలు నాటి, మొలకొచ్చిన తర్వాత పలుచన చేయాలి. విత్తే ముందు గుంతలను తడుపాలి.

**పోషక యాజమాన్యం:** ఎకరానికి 10 టన్నులు బాగా చివికిన పశువుల ఎరువు చివరి దుక్కిలో వేయాలి. ఒక కిలో పశువుల ఎరువును 100 గ్రాముల వేపచెక్కతో కలిపి ప్రతి గుంతలో ప్రాథమికంగా వేయాలి. ఒక నెల తర్వాత గుంతకు 500 గ్రాముల చొప్పున వానపాముల ఎరువు పైపాటుగా మొక్క మొదలులో వేయాలి. సకాలంలో కలుపును తీసివేయాలి. నాటిన తర్వాత వారం వ్యవధులతో నీటి తడువివ్వాలి. పూత సమయం, కాయలు ఏర్పడే దశలలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

**కల్తీలు ఏరివేత**

కాకర స్వతహాగా స్వపరాగం చెందే మొక్క అయితే కొంతమేరకు పరపరాగ సంపర్కం కూడా జరుగుతుంది. శాఖీయ దశ, పూత దశ, కాయలు ఏర్పడే దశలో లక్షణాల ఆధారంగా కల్తీలు గుర్తించి ఏరివేయాలి. 0.2 శాతం కంటే కల్తీలు మించకుండా చూడాలి. మూడు దఫాలుగా క్షేత్ర తనిఖీలు చేపట్టాలి.

వేర్పాటుదూరం: ఫౌండేషన్ విత్తనానికి అయితే 1000 మీటర్లు, ధృవీకరణ విత్తనానికి అయితే 500 మీటర్లు వేర్పాటు దూరం ఉండేలా చూడాలి.

**కాయల కోత:** కాయలు ఆకుపచ్చ రంగు నుంచి పసుపు పచ్చ లేదా నారింజ రంగులోకి మారిన దశలో మొక్క నుంచి సేకరించాలి. చేతులతో మొక్కల నుంచి ఏరి, పగిలే లేదా నీడలో ఆరబట్టాలి. అవి పగిలిన తర్వాత ప్రకాశవంతమైన విత్తనాలు కన్పిస్తాయి. లేదా తొడుకలు తీసిన తర్వాత రక్తపు రంగుతో కూడిన గింజలను ఒకరోజు పాటు నీళ్లలో మురుగబెట్టాలి. ఆ తర్వాత బాగా కడిగి, ఎండబెట్టి నిల్వ చేయాలి. విత్తన తేమ ఏడు శాతం మించకుండా ఉండాలి. చల్లని, పొడి పరిస్థితులలో నిల్వ చేస్తే ఐదేండ్ల వరకు మొలక శాతం తగ్గకుండా కాకర గింజలు నాణ్యంగా ఉంటాయి.



### నాణ్యతా ప్రమాణాలు

**కనీస మొలక శాతం: 60, జన్యు స్వచ్ఛత: 98 శాతం**

**గరిష్ఠ విత్తన తేమ : 74 శాతం, గరిష్ఠ జడ పదార్థం: 2 శాతం**

ఒకసారి ఉత్పత్తి చేసిన విత్తనాన్ని రైతులు పై నాణ్యతా ప్రమాణాలు ఉంటే నాలుగు, ఐదేండ్ల వరకు సాగు చేసుకోవడానికి వాడుకోవచ్చు. మేలైన దిగుబడులు పొందవచ్చు. అయితే సూటి రకాలలో మాత్రమే విత్తనోత్పత్తి చేసుకోవాలి. హైబ్రీడ్లలో రైతు స్థాయిలో విత్తనోత్పత్తి చేపట్టరాదు.

**డాక్టర్ పిడిగెం సైదయ్య**
సీనియర్ శాస్త్రవేత్త,
శ్రీ కొండా లక్ష్మణ్
తెలంగాణ రాష్ట్ర ఉద్యాన
విశ్వవిద్యాలయం
7780509322



# పిక్స్ సంచుల్లో పక్కాగా పల్లి నిల్వ

ప్రస్తుతం రాష్ట్రం పల్లి పంట చేతికి వచ్చింది. వెంటనే మార్కెటింగ్ సాధ్యం కాదు. ఈలోపు పల్లి కాయలను బ్రూచిడ్, నల్లబూజు ఆశించి గింజల నాణ్యతను దెబ్బ తీస్తాయి. దీంతో రైతులు గిట్టుబాటు ధరలు రాక నష్టపోయే ప్రమాదం ఉన్నది. కాబట్టి పల్లీల నిల్వ కోసం మూడుపొరల సంచులు మన్నిగా ఉంటాయి. రైతులు వీటిని వినియోగించుకుని మార్కెట్‌లో మంచి ధర ఉన్నప్పుడే అమ్ముకునే అవకాశం ఉన్నది.




**పంట** కోత అనంతరం వివిధ ధాన్యాలు, పప్పు దినుసులు నిల్వచేసినప్పుడు 15–40 శాతం వరకు నష్టం జరుగుతుంది. ముఖ్యంగా పల్లి లాంటి ధాన్యాన్ని సంప్రదాయ పద్ధతిలో జనపనార/ గోనె సంచులను ఉపయోగించి నిల్వచేసినప్పుడు బ్రుచిడ్ పురుగు త్వరితగతిన వృద్ధి చెందుతుంది. దీనివల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు ఇక్రిశాట్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ హరికిషన్ సూదిని మొదటిసారిగా 2011 నుంచి భారతదేశంలో పల్లీల నిల్వ కోసం ఈ సంచుల వినియోగంపై పరిశోధనలు చేశారు. పర్డ్యూ యూనివర్సిటీ సహకారంతో చేసిన ఈ పరిశోధనలు మంచి ఫలితాలు ఇచ్చాయి. ఈ సంచులను వివిధ పంటల నిల్వల కోసం లక్షలాదిమంది రైతులు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం మన దేశంలో ఈ సంచులు అందుబాటులోకి వచ్చాయి. పిక్స్ (PICS ) సంచులు పంట కోత అనంతరం పురుగుల తాకిడికి గురై నష్టపోకుండా గింజలు, ధాన్యాలు, పప్పు దినుసులు ఇతర వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను కాపాడుతాయి. మొదటిసారిగా పశ్చిమాఫ్రికా దేశంలో బొబ్బర్ల నిల్వకు ఈ సంచులను వాడారు. తర్వాత ఆసియా, ఇతర ఆఫ్రికా దేశాలకు విస్తరించింది. ఈ నేపథ్యంలో ఈ సంచులకు సంబంధించిన పరిజ్ఞానాన్ని తెలుసుకొని సక్రమంగా వాడుకునే విధానం తెలుసుకుందాం.



**డాక్టర్ హరికిషన్ సూదిని**
ఇక్రిశాట్ ప్రధాన శాస్త్రవేత్త

**పల్లీల నిల్వకు**

డాక్టర్ హరికిషన్ సూదిని పరిశోధనలో విత్తన అంకురోత్పత్తి ఏ మాత్రం తగ్గకుండా ఈ సంచులు కాపాడినట్లు తేలింది. దీంతో అనంతపురం జిల్లాలోని కొద్దిమంది ఎంపిక చేసిన రైతులకు ఈ మూడు పొరల సంచులను ప్రయోగాత్మకంగా ఇచ్చి వారిని పల్లి నిల్వకు వినియోగించమని ప్రోత్సహించారు. ఆ తర్వాత రైతుల అభిప్రాయాలను సేకరించినప్పుడు వారు ఈ సంచులు చాలా బాగా పనిచేశాయని చెప్పారు. జనపనార/గోనె సంచులను ప్రత్యామ్నాయంగా ఈ మూడు పొరల సంచులలో పల్లి కాయలను నిల్వ చేశారు. దీంతో పురుగు, కీటకాలను సమర్థవంతంగా నిలువరించి, పల్లికాయల నాణ్యతను కాపాడుకోవచ్చని తేలింది. అంతేగాకుండా పల్లిలో విత్తన మోతాదు అధికం. ఎకరానికి దాదాపు 60–80 కిలోల విత్తనం వాడాలి. రైతులు తాము పండించిన పల్లి కాయలను మళ్లీ వచ్చే కాలానికి అంటే దాదాపు 6–8 నెలల వరకు ఈ సంచులలో నిల్వ చేసుకున్నట్లయితే విత్తనంపై పెట్టే ఖర్చును భారీగా తగ్గించుకోవచ్చు. ఇక్రిశాట్ వారి పరిశోధనలో విత్తన మొలక శాతం కూడా ఏ మాత్రం తగ్గకుండా ఈ సంచులు పల్లి కాయలను కాపాడినట్లు తేలింది. నల్లబూజును కూడా సమర్థవంతంగా తగ్గించింది. ఈ సంచులు కావాల్సిన రైతులు 9177178001 సంప్రదించగలరు.

## రైతుబడికి ఆహ్వానం




రచనలు పంపవలసిన చిరునామా:
**8-2-603/1/7,8,9, కృష్ణాపురం,**
**రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.**
raithubadi@ntdaily.news, Fax-040-23291118

## కోతదశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

**గరిడేపల్లి:** వాణిజ్యపరంగా విలువైన పంట మిరప. ఈ పంట సాగు చేసిన రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. ఫలితంగా ఆశించిన దిగుబడులు పొందవచ్చు. అట్లనే రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. అయితే ప్రస్తుతం మిరపలో కోతలు అవుతున్నాయి. వాటిని కోసే ముందు, కోసిన తర్వాత సరైన పద్ధతులు అవలంబించాలి. దీనివల్ల విలువతో కూడిన దిగుబడులను సాధించవచ్చు. తద్వారా మార్కెట్‌లో మంచి రేటును పొందవచ్చునని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త సీహెచ్.నరేష్ వివరించారు. అదనపు సమాచారం కోసం 9603268682 నెంబర్‌ను సంప్రదించవచ్చు. మిరపలో కోతదశ నుంచి నిల్వ చేసే వరకు పాటించాల్సిన విధానాల గురించి ఆయన తెలిపిన వివరాలు...



- మొక్కలపైన మిరప కాయలను ఎక్కువగా పండనివ్వకూడదు.
- ఎక్కువగా పండితే మిరప నాణ్యత తగ్గుతుంది. ఎప్పటికప్పుడు పండిన కాయలను కోయడం వలన దిగుబడులు పెరుగుతాయి.
- కాయలు కోసే ముందు సస్యరక్షణ మందులు పిచికారీ చేయకూడదు. పిచికారీ చేస్తే కాయల మీద అవశేషాలు ఉండి ఎగుమతికి ఆటంకాలు ఏర్పడతాయి.
- మిరపకాయలను పాలిథీన్ పట్టాల మీద లేదా సిమెంట్ గచ్చు మీద ఎండబెట్టాలి. లేకపోతే అఫ్లోటాక్సిన్ అనే విషపదార్థం ఎక్కువగా వృద్ధి చెందుతుంది.
- రాత్రిపూట మంచుబారిన పడకుండా కాయలను కప్పి ఉంచాలి. 10 శాతానికి మించి ఎక్కువ తేమ లేకుండా ఎండబెట్టాలి.
- ఎండబెట్టేటప్పుడు దుమ్ము,ధూళి, చెత్త చేరకుండా వాటిని శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.
- తాలు కాయలను, మచ్చకాయలను గ్రేడింగ్ చేసి వేరుచేయాలి.
- నిల్వ చేయడానికి తేమ లేకుండా ఉన్న శుభ్రమైన గోనె సంచులలో కాయలను నింపాలి.
- తేమ తగలకుండా వరిపొట్టు లేదా చెక్కబల్లాల మీద గోడలకు అరమీటర్ దూరంలో నిల్వ చేయాలి.
- అవకాశం ఉన్నచోట్ల శీతల గిడ్డంగులలో నిల్వ చేస్తే రంగు, నాణ్యత తగ్గిపోకుండా లాభదాయకంగా ఉంటుంది.
- అకాల వర్షాలకు గురికాకుండా, మంచుబారిన పడకుండా రంగు కోల్పోకుండా ఆధునిక డ్రయ్యర్‌లలో ఎండబెట్టి నాణ్యమైన మిరప దిగుబడులు పొందవచ్చు.

# మినుము, పెసర సాగు మేలు

**యా**సంగి పంటగా పెసరను నీటి పారుదల కింద ఆరుతడి పంటగా తేలిక భూముల్లో కూడా సాగు చేసుకోవచ్చు. తేమ బాగా నిలుపుకును భూముల్లో నీటి తడులు బాగా ఇచ్చే పరిస్థితి ఉంటే మినుము సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పెసర, మినుము సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వారు తెలిపిన వివరాలు...

**విత్తే సమయం:** వేసవిలో మినుము, పెసర పంటలను ఫిబ్రవరి నుంచి మార్చి 15 వరకు విత్తుకోవచ్చు. వరి మాగాణుల లో అయితే వేసవి పంట తర్వాత మార్చి చివరివరకు విత్తుకోవచ్చు.

**రకాల ఎంపిక:** తక్కువకాలంలో కాపునకు వచ్చి ఎండకాలంలో వేడిని, నీటిఎద్దడిని తట్టుకొనే రకాలను ఎంపిక చేసుకోవాలి. అలాగే ఎండకాలంలో వచ్చే ప్రధానమైన వైరస్ తెగుళ్ళను తట్టుకొనే రకాలను ఎంపిక చేసుకోవాలి.

**అనువైన రకాలు**

**పెసర:** డబ్ల్యూజిజి 42, టి.ఎం 96–2, ఐపియం 2–14 అనువైనవి. ఈ రకాలు 60–65 రోజులలో కాపునకు వస్తాయి.

**మినుము:** అన్నికాలాల్లో సాగు చేయడానికి బాగా అనువైన టి.బి.జి 104, ఎల్.బి.జి 787, పి.యు 31 అనువైనవి. ఈ రకాలు 70–80 రోజులలో కాపునకు వస్తాయి.

**విత్తన మోతాదు:** పెసర ఆరుతడి మెట్ట పంటకు ఎకరాకు 6–7 కిలోలు, వరి మాగాణుల్లో అయితే 12 కిలోల విత్తనాలు వాడాలి. మినుమును వేసవిలో ఆరుతడి పంటగా సాగు చేసినట్లైతే ఎకరాకు 8–10 కిలోలు, వరి మాగాణుల్లో అయితే 14–16 కిలోలు సాగుకు వాడాలి.

**విత్తనశుద్ధి:** పంట విత్తుకునే 24–48 గంటల ముందుగా ఒక కిలో విత్తనానికి 5 మి.లీల ఇమిడాక్లోప్రిడ్ లేదా థయోమిథాక్సిమ్ 70 డబ్ల్యూఎస్ 5 గ్రాములు+ కార్బెండిజమ్ 2.5 గ్రాములు చొప్పున కలిపి విత్తనశుద్ధి చేయాలి. దీనివల్ల తొలి దశలో వైరస్ తెగుళ్ళను వ్యాపింపజేసే రసంపీల్చే పురుగులు, వేరుకుళ్ళు తెగుళ్ళ బారి నుంచి పంటను కాపాడుకోవచ్చు.

**కలుపు నివారణ:** మెట్ట భూముల్లో ఆరుతడి పంటగా సాగుచేసినప్పుడు పెండిమిథాలిన్ 30శాతం ఎకరాకు 1.3 నుంచి1.6 లీటర్ల చొప్పున విత్తిన వెంటనే గానీ విత్తిన మరుసటిరోజుగానీ పిచికారీ చేయాలి. విత్తిన 20–25 రోజులలో గొర్రుతో అంతర కృషి చేయాలి. వరి మాగాణుల్లో గడ్డిజాతి వెడల్పాటి మొక్కలు ఉంటే ఇమాజిథాపిర్ 10శాతం ద్రావణం ఎకరాకు 250 మి.లీ.ల చొప్పున విత్తిన 20–25 రోజుల మధ్య పిచికారీ చేయాలి. ఊద, చిప్పర, గరికె లాంటి గడ్డిజాతి మొక్కలు నిర్మూలనకు పెనాక్సోప్రాప్ ఇథైల్ 9శాతం ద్రావణం ఎకరాకు 250 మి.లీ, లేదా క్విజలాపాప్ ఇథైల్ 5శాతం ద్రావకం ఎకరాకు 400 మి.లీ,ల చొప్పున ఏదో ఒక దానిని 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 20–25 రోజుల మధ్య పిచికారీ చేసి కలుపు నివారించవచ్చు.

**ఎరువుల యాజమాన్యం:** ఎకరాకు 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం ఇచ్చే ఎరువులను వేయాలి. వరి మాగాణులలో ఎరువులు వాడాల్సిన అవసరం లేదు.

**నీటి యాజమాన్యం** విత్తిన 20–25 రోజులలో ఒకసారి తదుపరి 40–45 రోజులలో మరోసారి అవసరమైతే మూడవ తడి ఇస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

**సస్యరక్షణ:** వేసవిలో సాగు చేసే పెసర, మినుము పైర్లను వైరస్ తెగుళ్ళు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

**పల్లాకు తెగులు:** ఈ తెగులు తెల్లదోమ దోమ ద్వారా మినుము, పెసర పంటకు వ్యాప్తి చెంది అధిక నష్టం కలుగజేస్తుంది.





తెగులు సోకిన మొక్కల్లోని ఆకులపై పసుపు ఆకుపచ్చ రంగు మచ్చలు కన్పిస్తాయి. అందువల్లే దీనిలో ఎల్లో మొజాయిక్ అనే పేరు వచ్చింది. తొలిదశలో ఈ తెగులు ఆశిస్తే పైరంతా పసుపు రంగులోకి మారిపోయి పూత, పిందె ఏర్పడదు. పిందెలు, కాయలు కూడా పసుపు రంగులోకి మారిపోయి వంకలు తిరిగి తాలు కాయలుగా మారతాయి.

**ఆకుముడత తెగులు:** ఈ తెగులు ఉధృతి వర్షభావ పరిస్థితుల్లో ఎక్కువ. ఈ తెగులు తామర పురుగులు, త్రిప్స్ ద్వారా ఒక మొక్క నుంచి మరోమొక్కకు వ్యాపిస్తాయి. తెగులు సోకిన ఆకుల అంచులు వెనుకకు ముడుచుకుని మెలికలు తిరిగి గిడసబారి రాలిపోతాయి. అతి తక్కువ కాపు ఉండి దిగుబడి గణనీయంగా తగ్గుతుంది.

**సీతాఫలం తెగులు (బొబ్బర తెగులు):** వైరస్ తెగులు పేనుబంక ద్వారా ఒక మొక్క నుంచి వేరొక మొక్కకు వ్యాప్తి చెందుతుంది. ఈ తెగులు సోకిన మొక్కల ఆకులకాడలు, ఆకులు పెద్దవిగా అయ్యి ఆకుపై ఉబ్బెత్తుగా ఏర్పడి ముడతలు పడి సీతాఫలం కాయల్లాగా కన్పిస్తుంది. ఆకులు ముదురు ఆకుపచ్చ రంగుకు మారుతాయి. పూత, పిందె అభివృద్ధి చెందక కాయలు ఏర్పడవు. ఈ తెగులు చాలావరకు విత్తనం ద్వారా వ్యాప్తి చెందుతుంది. కనుక ఈతెగులు సోకని పంట నుంచి విత్తనం సేకరించుకోవాలి. తెగులు వ్యాప్తికి కారణమైన పేనుబంక పురుగులను నివారించుకోవాలి.

**సమగ్ర యాజమాన్యం:** వైరస్ తెగుళ్ళు తెల్లదోమ, తామర పురుగుల, పేనుబంక ద్వారా కలుపు మొక్కల నుంచి పంట మొక్కలకు వ్యాప్తి చెందుతాయి. ఈ తెగుళ్ల నివారణకు ఎటువంటి క్రిమిసంహారక మందులు లేవు. కాబట్టి ఈ తెగులు వ్యాప్తికి కారకాలైన తెల్లదోమ, తామర పురుగులు, పేనుబంక పురుగులను అరికట్టడం ద్వారానే ఈ తెగుళ్ళను నివారించగలం.

1) పల్లాకు తెగులును తట్టుకునే రకాలను సాగు చేయాలి. 2) విత్తనశుద్ధి తప్పకచేయాలి. 3) పంట విత్తే సమయంలో పొలం చుట్టూ నాలుగు వరుసలలో మక్కజొన్న, జొన్న, సజ్జ పంటలను విత్తుకుంటే పక్కపొలాల నుంచి తెల్లదోమ, తామరపురుగుల, పేనుబంక పురుగులను రాకుండా నివారించవచ్చు. 4) పొలం గట్ల మీద కలుపు లేకుండా చేయాలి. 5) పొలంలో తెగులు సోకి మొక్కలను గమనించి వెంటనే పీకి నాశనం చేయాలి. 6) పొలంలో అక్కడక్కడ ఎకరాకు తెల్లదో మ నివారణకు 20 చొప్పున పసుపు రంగు జిగురు అట్టాలు/ రేకులు, తామరపురుగులకు ఎకరాకు 20 చొప్పున నీలిరంగు జిగురు అట్టాలను ఉంచి ఆయా పురుగుల ఉనికిని, ఉధృతిని అంచనా వేసుకుని సస్యరక్షణచర్యలు చేపట్టవచ్చు. 7)విత్తిన 15–20 రోజులకు ఒకసారి వేపనూనె 5 మి.లీ.లు లీటరు నీటికి లేదా 5శాతం వేపగింజల కషాయాన్ని పిచికారీ చేసి పంటకు రసం పీల్చే పురుగులు ఆశించకుండా కాపాడుకోవచ్చు.

**తెల్లదోమ నివారణ:** అంతర్వాహిక కీటకనాశనులైన ట్రైజోఫాస్ 1.5 మి.లీ లేదా ఎసిఫేట్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి వాడాలి.

**తామర పురుగుల నివారణ:** ఎసిఫేట్ 1 గ్రాముల లేదా ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా థయోమిథాక్సిమ్ 0.2 గ్రాములు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**పేనుబంక నివారణ:** ఎసిఫేట్ 1 గ్రాముల లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా థయోమిథాక్సిమ్ 0.2 గ్రాములు లేదా డైమిథోయేట్ 2 మి.లీ.లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**మారుకా మచ్చల పురుగు:** ఈ పురుగు మొగ్గ, పూత, పిందె దశలో ఆశించి ఎక్కువ నష్టం కలుగజేస్తాయి. దీని నివారణకు పూత దశలో తప్పని సరిగా 5శాతం వేప గింజల కాషాయాన్ని లేదా వేపనూనె 5.0 మి.లీ.లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే రెక్కల పురుగు గుడ్డు పెట్టకుండా నివారించవచ్చు. పెట్టిన గుడ్లు పొదగవు. పురుగు గుడ్డు పెట్టడానికి ఇష్టపడదు. తక్కువ కాలపరిమితి గల పైర్లలో ఇది అత్యంత ఉపయోగకరం. మొగ్గ, పూత దశలో కొన్ని మొగ్గలను సేకరించి వాటిని తెరచి పిల్ల పురుగులు ఉన్నాయో లేదో గమనించి ఉన్నట్లయితే వెంటనే క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా థయోడికార్బ్ 1 గ్రాము లేదా ఎసిఫేట్ 1.5 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పంటలో గూళ్ళు గమనించినట్లైతే ఎసిఫేట్ 1.5 గ్రాము లేదా క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా నోవోల్యూరాన్ 1.0 మి.లీ.లు ఏదో ఒకదానిని ఊదర స్వభావం కలిగిన డైక్లోరోవాస్ మందును 1.0 మి.లీ.లను లీటరు నీటికి పైమందులతో కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి బాగా ఉంటే సైనోశాడ్ 0.3 మి.లీ. లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా ఫ్లూబెండిఎమైడ్ 0.2 మి.లీ.లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**పొగాకు లద్దె పురుగు:** దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి మంచి ఫలితాలను పొందవచ్చు. పురుగు ఉధృతిని బట్టి నోవోల్యూరాన్ 1.0 మి.లీ. లేదా థయోడికార్బ్ 1 గ్రామును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

### యాజమాన్య పద్ధతులతో సాగు లాభదాయకం



యాసంగి పెసర, మినుమును విత్తుకునే రైతులకు ఇది మంచి సమయం. వీటిని నాటిన తర్వాత యాజమాన్య పద్ధతులు పాటించాలి. వీటి సాగు రైతులకు లాభదాయకం. సాధారణంగా ఎండకాలంలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి దానికి తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలి. అలాగే తక్కువ కాలవ్యవధి ఉన్న రకాలు ఎంచుకుంటే మంచిది. వీటిని నాటడానికి ముందు విత్తనశుద్ధి చేసుకోవాలి. నాటిన తర్వాత కలుపు నివారణ చర్యలు చేపట్టి అవసరమైన మేరకు నీటి తడులు ఇవ్వాలి. తెగుళ్ల నివారణకు నిపుణులు సూచనల మేరకు తగిన మందులు పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు.

– అరిగెల కిరణ్, 7893989055, కేవీకే మృత్తికా శాస్త్రవేత్త, గడ్డిపల్లి

**నట్టె కోటేశ్వర్‌రావు**, 9989944945
గరిడేపల్లి, సూర్యాపేట జిల్లా

# స్వీటుతో ఘాటుగా..

'శివ.. శివ' అంటూ శివరాత్రి నాడు..
రోజంతా ఉపవాసం ఉండి..
రాత్రి జాగారం చేస్తారు..
కానీ ఆ ఉపవాస దీక్షలో కొన్ని తినాలనే
నియమం ఉంటుంది..
వివిధ రకాల పండ్లతో పాటు..
శివుడికి ప్రీతి పాత్రమైన స్వీట్ పాటాటో అదేనండీ..
కందగడ్డ.. మొరంగడ్డ.. గన్సుగడ్డ..
ఇలా తీరొక్క పేరుతో పిలుచుకునే ఈ గడ్డను..
అలాగే తినడం ఆనవాయితీగా వస్తున్నది..
అయితే దాంతో ఇలా కొత్త రకాల
వంటకాలను ట్రై చేసి చూడండి..

## పాయసం



**కావాల్సినవి :**

**స్వీట్‌పొటాటో :** 250 గ్రా.,
**పాలు :** అర లీటరు,
**చక్కెర :** 200 గ్రా.,
**యాలకులపొడి :** అర టీస్పూన్,
**సోంపుపొడి :** అర టీస్పూన్,
**నెయ్యి :** 2 టీస్పూన్స్,
**డ్రైఫ్రూట్స్ :** 2 టీస్పూన్స్

**తయారీ :**

ముందుగా స్వీట్‌పొటాటోలను శుభ్రంగా కడిగి తురుముకొని పక్కన పెట్టుకోవాలి. మందపాటి గిన్నెలో నెయ్యి వేడిచేసి దానిలో తురిమిన స్వీట్‌పొటాటో వేయించాలి. తర్వాత పాలు పోసి సన్నని సెగపై అప్పుడప్పుడు కలుపుతూ మరగనివ్వాలి. ఇప్పుడు చక్కెర, యాలకులపొడి, సోంపుపొడి వేసి కొంచెం సేపు ఉడికించాలి. సగం తరిగిన డ్రైఫ్రూట్స్‌ని పాయసంలో వేసి మిగిలిన సగం గార్నిష్ చేసుకొని వేడి వేడిగా సర్వ్ చేసుకోవాలి.

## దప్పళం



**కావాల్సినవి :**

**స్వీట్‌పొటాటో :** 250 గ్రా., **ముద్దపప్పు :** ఒక కప్పు, **బెల్లం :** చిన్నముక్క, **ఆవాలు :** పావు టీస్పూన్, **జీలకర్ర :** పావు టీస్పూన్, **చింతపండుగుజ్జు :** ఒక కప్పు, **పసుపు :** పావు టీస్పూన్, **కారం :** అర టీస్పూన్, **మెంతులు :** పావు టీస్పూన్, **పచ్చిమిర్చి :** 6, **కరివేపాకు :** 2 రెమ్మలు, **నెయ్యి :** సరిపడా, **ఉప్పు :** తగినంత

**తయారీ :**

స్వీట్‌పొటాటోలను శుభ్రం చేసుకొని పెద్దముక్కలుగా కోసుకోవాలి. పచ్చిమిర్చిని చీలికలుగా కట్‌చేయాలి. తర్వాత కడాయిలో నూనె వేడిచేసి అందులో ఆవాలు, జీలకర్ర, మెంతులు వేయాలి. వేగిన తర్వాత కరివేపాకు, ఉప్పు, పసుపు, స్వీట్‌పొటాటో ముక్కలు వేసి బాగా మగ్గనివ్వాలి. తర్వాత కొంచెం నీరు, చింతపండు గుజ్జు, కారం వేసి బాగా ఉడికించాలి. ఇప్పుడు ముద్దపప్పు, నెయ్యి, బెల్లం వేసి కొంతసేపు మగ్గనిచ్చి ఉప్పు, కారం సరిచూసుకోవాలి. వేడివేడిగా అన్నంతోపాటూ సర్వ్ చేసుకుంటే స్వీట్‌పొటాటో దప్పళం చాలా రుచిగా ఉంటుంది.

## మసాలా వేపుడు



**కావాల్సినవి :**

**స్వీట్‌పొటాటో :** 250 గ్రా.
**పసుపు :** పావు టీస్పూన్
**కారం :** పావు టీస్పూన్
**ధనియాలపొడి :** పావు టీస్పూన్
**అల్లంవెల్లుల్లిపేస్ట్ :** ఒక టీస్పూన్
**కొత్తిమీర :** ఒక కట్ట
**పచ్చిమిర్చి :** 4
**జీలకర్రపొడి :** పావు టీస్పూన్
**గరంమసాలా పొడి :** పావు టీస్పూన్
**కరివేపాకు :** 2 రెమ్మలు
**నూనె :** సరిపడా
**ఉప్పు :** తగినంత

**తయారీ :**

ముందుగా స్వీట్‌పొటాటోలను శుభ్రం చేసుకొని ఉప్పు వేసి ఉడికించాలి. వాటి పొట్టు తీసి చిన్నముక్కలుగా కట్‌చేసుకోవాలి. పచ్చిమిర్చిని చీలికలుగా చేసి, కొత్తిమీరను సన్నగా తరగాలి. తర్వాత కడాయిలో నూనె వేడిచేసి కరివేపాకు, పచ్చిమిర్చి, అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి కొంతసేపు వేయించాలి. ఇప్పుడు ధనియాలపొడి, జీలకర్ర పొడి, గరంమసాలాపొడి, కారం, పసుపు వేసి దోరగా వేయించాలి. ఆ తర్వాత ముందుగా ఉడికించి ముక్కలుగా కట్ చేసుకున్న స్వీట్‌పొటాటోలను వేసి నిదానంగా కలుపుతూ ఉప్పు, కారం సరిచూసుకోవాలి. చివరగా సన్నగా తరిగిన కొత్తిమీర వేసి దించేయాలి. అంతే.. రుచికరమైన వేపుడు రెడీ!

## జామూన్



**కావాల్సినవి :**

**స్వీట్‌పొటాటో:** 250 గ్రా.,
**చక్కెర :** 200 గ్రా.,
**యాలకులు :** 6,
**మైదాపిండి :** 50 గ్రా.,
**నూనె :** సరిపడా

**తయారీ :**

స్వీట్‌పొటాటోలను శుభ్రం చేసి ఉడికించి తురుముకొని పక్కన పెట్టుకోవాలి. మందపాటి గిన్నెలో చక్కెర, ఒక గ్లాసు నీరు పోసి అందులో యాలకులపొడి వేసి పాకం పెట్టుకోవాలి. దీనిలో మైదా పిండి, స్వీట్‌పొటాటో తురుము వేసి ఉండలు లేకుండా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని చిన్న ఉండల్లా చేసుకోవాలి. తర్వాత కడాయిలో నూనె వేడిచేసి ఉండలు వేసుకోవాలి. వీటిని గోల్డ్‌కలర్‌లోకి వచ్చేవరకు వేయించుకోవాలి. ఈలోపు మళ్లీ కాస్త చిక్కటి పాకం చేసుకొని ఈ ఉండలను అందులో వేస్తే మరింత టేస్టీగా ఉంటాయి.



**జి.యాదగిరి**
కార్పొరేట్ చెఫ్
వివాహభోజనంబు రెస్టారెంట్
జూబ్లీహిల్స్, హైదరాబాద్
పార్క్‌లైన్, సికింద్రాబాద్

## పొట్టను తగ్గించుకోవచ్చిలా..



**అనేక కారణాల వల్ల చిన్నవయసులోనే ఊబకాయుల్లా మారుతున్నారు చాలామంది. జీవనశైలి, ఆహారపు అలవాట్లు ఇలా ఎన్నో కారణాల వల్ల పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోయి అందవిహీనంగా కనిపిస్తున్నారు. అలాంటి వారు కొన్ని చిట్కాలు పాటించి పొట్టను తగ్గించుకోవచ్చు.**

- రాత్రి పడుకునే ముందు గోరువెచ్చని నీటిలో త్రిఫల చూర్ణం కలిపి తాగితే కొవ్వు కరిగిపోతుంది. రోజూ ఉదయాన్నే పరిగడుపున ఉసిరి రసాన్ని తాగడం వల్ల అధిక బరువు సమస్య నుంచి బయటపడుతారు.
- రాత్రి పూట మెంతులను నీటిలో నానబెట్టి ఉదయాన్నే ఆ నీటిని తాగి మెంతులను పరిగడుపున తింటే బరువు తగ్గుతారు. నీటిని ఎక్కువగా తాగుతూ ఆహారాన్ని ఒకేసారి కాకుండా కొంచెం కొంచెం ఎక్కువ సార్లు తీసుకుంటే మంచిది.
- నల్ల ఉలవలను ఉడికించి అందులో సైందవ లవణం కలిపి తీసుకోవడం వల్ల ఒంట్లోని కొవ్వు కరిగిపోతుంది. ఎక్కువ ఫైబర్ ఫుడ్, తాజా కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవడం వల్ల పొట్ట తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుంది.
- పొటాషియం సమృద్ధిగా లభించే అరటి, బొప్పాయి, పెరుగు వంటివి ఆహారంలో తీసుకుంటే పొట్టను తగ్గించడంలో సహాయపడడమే కాకుండా కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తాయి. అల్లంను తురిమి గ్రీన్ టీలో వేసుకొని తాగవచ్చు. అల్లం గ్యాస్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది.
- నిమ్మకాయలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఎసిడిటీ తగ్గించి మొండి రోగాల్ని దూరం చేస్తుంది. ఉదయాన్నే గ్లాసెడు గోరువెచ్చని మంచినీళ్లలో అరచెంచాడు రసంలో రెండు చుక్కల తేనె కలిపి తాగాలి. ఇలా నెలరోజుల పాటు చేస్తే పొట్ట తగ్గుతుంది.

## గారెలు కరకరలాడాలంటే..



- గారెల పిండిలో సేమియా వేసి కలిపితే కరకరలాడుతాయి.
- గోబీపువ్వు కూరలో చెంచాడు పాలు వేస్తే తెల్లదనం పోదు.
- బియ్యం కడిగిన నీళ్లలో తరిగిన అరటికాయ ముక్కలను 2 నిమిషాలు ఉంచితే నల్లబడవు.
- ఉడుకుతున్న ఆలుగడ్డలు రంగు మారకుండా ఉండాలంటే రెండు చుక్కల నిమ్మరసం వేస్తే సరి.
- ఇత్తడి వస్తువుల్ని ముందు ఉప్పునీటితో తోమి ఆ తర్వాత మామూలు నీటితో తోమితే బాగా మెరుస్తాయి.
- తేనె ఎక్కువకాలం నిల్వ ఉండేందుకు రెండు లవంగాలు వేయాలి.
- కందిపప్పులో ఎండుకొబ్బరి చిప్పను ఉంచితే పురుగుపట్టదు.

# మన సాంస్కృతిక వైభవం.. రాచకొండ ఉత్సవాలు!

**భూమి ఉన్నంతవరకూ చెప్పకునే చరిత్ర తెలంగాణది. ఇక్కడ కంటికి కనిపించే ప్రతి రాయికీ.. కాలికి తగిలే ప్రతి మట్టి రేణువుకీ ఓ నేపథ్యం ఉంటుంది. బీటలువారిన ప్రతి కోటకూ.. కాట్లు పడిన ప్రతి కట్టడానికీ ఓ కథ ఉంటుంది. చరిత్ర పుటల్లో దాగివున్న అలాంటి ఓ అపురూప కట్టడమే రాచకొండ. ఆ రాజసం నేటి తరానికి తెలియజేయాలని తెలంగాణ సాంస్కృతిక శాఖ సంకల్పించింది. రాచప్ప సమితి సహకారంతో నేటి నుంచి (20వ తేది) నుంచి 22 వరకు రాచకొండ సాంస్కృతిక-పర్యాటక ఉత్సవాలను నిర్వహిస్తున్నది. ఆ గొప్పదనమేంటో మనమూ చూద్దాం.. తెలుసుకుందాం పదండీ.!**











**అణువణువూ** చరిత్రను అలుముకొని.. అందనంత ఎత్తులో ఏపుగా పెరిగినట్లు దర్శనమిచ్చే అపురూప రాతి సమూహమే రాచకొండ. ఎంత తిరిగినా.. ఎంత శోధించినా ఒడువని ముచ్చట రాచకొండది. సుందర.. సుకుమార.. సుస్థిర చరిత్రకు దర్పణం ఇది.

### సాంస్కృతిక-పర్యాటక ఉత్సవాలు

సమైక్య పాలనలో రాచకొండ నిర్లక్ష్యానికి గురైంది. తెలంగాణ సర్కారు రాచకొండకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నది. రాచకొండ గొప్పదనం నేటి తరానికి తెలిసేలా ప్రతీయేటా 'రాచకొండ సాంస్కృతిక-పర్యాటక ఉత్సవాలు' నిర్వహిస్తున్నది.

### చరిత్రకు సాక్ష్యం

రాచకొండ ఒకప్పుడు తెలంగాణకు రాజధాని. ఎన్నో చారిత్రక ఘట్టాలకు.. వీరోచిత విజయాలకు కేంద్రం. అద్భుత కట్టడాలకు.. ఆధ్యాత్మిక కేంద్రాలకు నెలవు. అలాంటి రాచకొండ వైభవాన్ని చాటిచెప్పేందుకు తెలంగాణ సాంస్కృతిక.. పర్యాటక శాఖలు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నాయి. రాచకొండ చారిత్రక.. పర్యావరణ.. పర్యాటక.. పరిరక్షణ సమితి (రాచప్ప) సహకారం అందిస్తున్నది. ఇక్కడ శివాలయం, రామాలయం, భైరన్నగుడి, వీరన్నగుడి, బోగందాని మంచెం, కుమ్మరి మట్టం, చాకలి మఠం, శత్రుదుర్భేద్య గోడ, శివలింగం, గాడీ పీర్ల దర్గా, స్నానాల గదులు ఉన్నాయి. వీటిని చూసేందుకు పర్యాటకులు వస్తుంటారు.

### ఎలా చేరుకోవాలి?

యాదాద్రి భువనగిరి జిల్లా.. రంగారెడ్డి జిల్లాల సరిహద్దుల్లో హైదరాబాద్‌కు 50 కిలోమీటర్ల దూరంలో రాచకొండ ఉంటుంది. నాగార్జున సాగర్ జాతీయరహదారి నుంచి వెళ్లాలనుకుంటే ఇబ్రహీంపట్నం.. మంచాల.. తిప్పాయిగూడెం మీదుగా వెళ్లాలి. విజయవాడ జాతీయరహదారి నుంచి వెళ్లాలనుకుంటే చౌటుప్పల్.. సంస్థాన్ నారాయణపూర్.. తిప్పాయిగూడ నుంచి వెళ్తే రాచకొండ అలనాటి రాజసంతో దర్శనమిస్తుంది.

### సాహితీ వైభవం

రాచకొండ రాజులు శత్రుదుర్భేద్య కోటలను నిర్మించడమే కాదు శత్రు రాజ్యాలను కూల్చి.. గెలిచి ధాన్య భాండాగారాలను స్వాధీనం చేసుకునేవారట. ఆ సొమ్ముతో చెరువులు, కుంటలు, బావులు తోడేవారట. ప్రజలు సిరిసంపదలతో ఉండేవారట. అనపోత సముద్రం, రాయసముద్రం, సంకెళ్లబావి, కొలువు కూటం వాళ్లు నిర్మించినవే. సాహితీ పరిమళాలూ ఇక్కడ వెదజల్లేవనీ.. పోతన ఇక్కడి 'భోగినీ మండపం'లోనే 'భోగినీ దండకం' రాశారని చరిత్రకారులు చెప్తున్నారు.

### ఏ రోజు.. ఏ కార్యక్రమం?

రాచకొండను సాంస్కృతికంగా.. పర్యాటకంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ఫిబ్రవరి 20, 21, 22 తేదీల్లో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నది. 20న ఉత్సవాల ప్రారంభోత్సవం జరుగుతుంది. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభం అవుతుంది. గణపతి పూజ.. రాచకొండ ఫొటో ప్రదర్శన.. సాంస్కృతిక కార్యక్రమాలు ఈ రోజున ఉంటాయి. 21న కళాకారుల ఆటపాటలు, రాచకొండ గురించి కవితలు రాసిన కవులు, కథనాలు రాసిన రచయితల పరిచయం ఉంటుంది. తర్వాత ప్రసంగాలు.. యక్షగానం ఉంటాయి. 22న కవులు, రచయితలకు సన్మానం, ముగింపు కార్యక్రమంలో భాగంగా రాచకొండ వైభవం గురించి ప్రసంగాలు ఉంటాయి.

### తెలుసుకోండి.. తెలియజేయండి

రాచకొండను సింగమ వంశస్థులు, అనపోతనాయుడు తదితరులు రాజులుగా పరిపాలన సాగించారు. రేచర్ల గోత్రం పద్మనాయకులు రాచకొండ రాజులే. దేవరకొండ.. ఓరుగల్లు.. అమనగల్లు పట్టణాలు రాచకొండ పరిధిలో ఉండేవి. చారిత్రక.. ఆధ్యాత్మిక.. పర్యాటక ప్రాంతంగా వెలుగొందుతున్న రాచకొండ గురించి నేటి తరానికి తెలపాల్సిన ఆవశ్యకత ఎంతో ఉన్నది. స్వయంభుగా వెలసిన శివలింగం ప్రాంగణంలో రాచకొండ పర్యాటక-సాంస్కృతిక ఉత్సవాలు జరుగుతాయి.

### పిల్లలతో రండి :



చరిత్ర మూటను పదిలంగా భద్రపరిచిన రాచకొండ ఎప్పటికీ వైభవోపేతంగానే కనిపించాలి. అలా ఉండాలంటే ఇలాంటి ఉత్సవాలు ఎన్నో జరిగాలి. అందులో ప్రజల భాగస్వామ్యం ప్రత్యక్షంగా కనిపించాలి. కాబట్టి పిల్లలను ఈ పర్యాటక ఉత్సవాలకు తీసుకురండి. వీలుకానివాళ్లు సెలవురోజుల్లో వెళ్లి రాచకొండ వైభవం ఎలాంటిదో కనులారా చూడండీ.

**బద్దుల కృష్ణ కుమార్,**
రాచప్ప సమితి అధ్యక్షుడు

... దాయి శ్రీశైలం


రణ్‌వీర్‌సింగ్, దీపికాపదుకునే

# రోమీభాటియాదేవ్

భారత క్రికెట్ చరిత్రలో 1983వ సంవత్సరాన్ని సువర్ణధ్యాయంగా అభివర్ణిస్తుంటారు. కపిల్‌దేవ్ సారథ్యంలో భారత జట్టు తొలిసారి ప్రపంచకప్‌ను గెలిచి చరిత్ర సృష్టించింది. ఈ ప్రయాణాన్ని వెండితెరపై ఆవిష్కరిస్తూ రూపొందిస్తున్న చిత్రం '83'. కపిల్‌దేవ్ పాత్రలో రణ్‌వీర్‌సింగ్ నటిస్తున్నారు. కబీర్‌ఖాన్ దర్శకుడు. ఈ చిత్రంలో కపిల్‌దేవ్ భార్య రోమీభాటియా పాత్రలో దీపికా పదుకునే నటిస్తున్నది. ఆమె ఫస్ట్‌లుక్‌ను బుధవారం చిత్ర బృందం విడుదలచేసింది. రణ్‌వీర్, దీపికా ఒకరి కళ్లల్లోకి మరొకరు ప్రేమగా చూస్తున్నట్లుగా ఉన్న ఈ లుక్ అభిమానులను ఆకట్టుకుంటున్నది. బాబ్ హెయిర్‌కట్‌లో చిరునవ్వులు చిందిస్తూ దీపికా అచ్చం రోమీభాటియాను తలపిస్తున్నదని అంటున్నారు. పెళ్లి తర్వాత రణ్‌వీర్‌సింగ్, దీపికా పదుకునే జంటగా నటిస్తున్న తొలి చిత్రమిది. ఏప్రిల్ 10న విడుదలకానుంది.

# వన్స్‌మోర్!

ఎన్టీఆర్-త్రివిక్రమ్ కలయికలో వచ్చిన 'అరవింద సమేత వీరరాఘవ' చిత్రం చక్కటి విజయాన్ని సొంతం చేసుకుంది. వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతున్నది. తాజాగా ఇందుకు సంబంధించిన ప్రకటన వెలువడింది. హారిక హాసిని క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు), నందమూరి కల్యాణ్‌రామ్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ వేసవిలో చిత్రీకరణ ప్రారంభించి 2021 వేసవిలో ప్రేక్షకులముందుకు తీసుకొస్తామని చిత్రబృందం ప్రకటించింది. ఎన్టీఆర్ కథానాయకుడిగా నటిస్తున్న 30వ సినిమాగా ఈ చిత్రం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో తెలియజేస్తారు. ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో రామ్ చరణ్‌తో కలిసి మల్టీస్టారర్ చిత్రం 'ఆర్ఆర్ఆర్'లో (వర్కింగ్ టైటిల్) నటిస్తున్నారు ఎన్టీఆర్. ఈ చిత్రం పూర్తయిన వెంటనే ఎన్టీఆర్-త్రివిక్రమ్ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. మరోవైపు 'అల వైకుంఠపురములో' చిత్రం ద్వారా ఇటీవలే అపూర్వ విజయాన్ని సొంతం చేసుకున్నారు త్రివిక్రమ్.


ఎన్టీఆర్, త్రివిక్రమ్


వెంకటేష్

# ఎర్ర ఎడారిలో..

వెంకటేష్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'నారప్ప'. శ్రీకాంత్ అడ్డాల దర్శకుడు. ధనుష్ నటించిన తమిళ చిత్రం'అసురన్'కు రీమేక్ ఇది. డి.సురేష్‌బాబు, కలైపులి ఎస్ థాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం తమిళనాడులోని తెరికాడు ఎర్ర ఏడారిలో చిత్రీకరణ జరుగుతున్నది. ఫైట్‌మాస్టర్ పీటర్ హెయిన్స్ నేతృత్వంలో పోరాట ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'పదిరోజుల పాటు తీసిన ఈ యాక్షన్ ఘట్టాలు సినిమాలో ప్రధానాకర్షణగా ఉంటాయి. 12000వేల ఎకరాల్లో ఉండే ఈ ప్రదేశాన్ని రెడ్ డిజర్ట్ ఆఫ్ తమిళనాడుగా పిలుస్తారు. ఇప్పటికే 27రోజులు షూటింగ్ చేశాం. ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించబోతున్నాం' అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శ్యామ్ కె నాయుడు, సంగీతం: మణిశర్మ, కథ: వెట్రిమారన్.


రుహానిశర్మ, విశ్వక్‌సేన్

# ఇలాంటి సినిమాలు చేయాలంటే ధైర్యం కావాలి

హీరోగా బిజీగా ఉంటూనే నిర్మాతగా మారి 'అ!' అనే విభిన్నమైన సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందించారు నాని. మరోసారి ఆ పంథాలోనే వైవిధ్యతను నమ్మి ఆయన నిర్మించిన సినిమా ఇది. ఇలాంటి సినిమాలు చేయడానికి చాలా ధైర్యం కావాలి' అని అన్నారు దిల్ రాజు. విశ్వక్‌సేన్, రుహానిశర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'హిట్'. హీరో నాని సమర్పణలో ప్రశాంతి తిపిరనేని నిర్మిస్తున్నారు. శైలేష్ కొలను దర్శకుడు. ఈ నెల 28న ఈ చిత్రం విడుదలకానుంది. బుధవారం హైదరాబాద్‌లో నిర్మాత దిల్‌రాజు ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ప్రయోగాత్మక కథాంశాలతో నాని మరిన్ని సినిమాలు నిర్మించాలి. నటుడిగా మాత్రం కమర్షియల్ సినిమాలు మాత్రమే చేయాలి. శైలేంద్ర తండ్రి శేషగిరిరావు మా నిర్మాణ సంస్థలోనే పన్నెండేళ్లుగా పనిచేస్తున్నారు. శైలేంద్ర దర్శకుడుకావాలనుకుంటున్నాడని శేషగిరి రావు చెప్పగానే సినిమా ఇండస్ట్రీలోకి రావడమే రిస్క్ వద్దన్నాను. కానీ తన కథతో నానిని ఒప్పించాడు. ట్రైలర్ చూస్తుంటే థియేటర్‌లో సినిమా చూడాలనే ఆసక్తి కలుగుతుంది. నైజాం, వైజాగ్‌లో ఈ చిత్రాన్ని మా సంస్థ ద్వారా విడుదలచేస్తున్నాం' అని పేర్కొన్నారు. విశ్వక్‌సేన్ మాట్లాడుతూ 'సక్సెస్ తర్వాత ఎలాంటి సినిమా చేయాలనే భయం ఉంటుంది. శైలేష్ చెప్పిన ఈ కథ వినగానే ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా అంగీకరించాను. ఇప్పటివరకు చేసిన ప్రతి సినిమాలో నటనతో పాటు ఇతర విభాగాల బాధ్యతలు చేపట్టాను. కానీ ఇందులో యాక్టింగ్‌పై మాత్రమే దృష్టిపెట్టాను' అని తెలిపారు. ట్రైలర్‌లో చూపించిన వాటికంటే ఎన్నో ఆసక్తికరమైన అంశాలు సినిమాలో ఉంటాయని, ప్రారంభం నుంచి ముగింపు వరకు ఆద్యంతం ఉత్కంఠను పంచే థ్రిల్లర్ సినిమా ఇదని దర్శకుడు అన్నారు. కథ, కథనాలపై నమ్మకంతో రెండేళ్ల తర్వాత తాము నిర్మించిన చిత్రమిదని ప్రశాంతి చెప్పింది. కథాబలమున్న మంచి సినిమాలో భాగమవ్వడం అదృష్టంగా భావిస్తున్నానని రుహానిశర్మ తెలిపింది. ఈ కార్యక్రమంలో మణికందన్, గ్యారీ బీహెచ్ పాల్గొన్నారు.

# మూడేళ్లు టైం తీసుకున్నా!


నితిన్

కథల ఎంపికలో మున్ముందు మరింత జాగ్రత్తగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు నితిన్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'భీష్మ'. వెంకీ కుడుముల దర్శకుడు. సూర్యదేవరనాగవంశీ నిర్మించారు. ఈ నెల 21న విడుదలకానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో నితిన్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'కెరీర్ పరంగా, వ్యక్తిగతంగా నా జీవితంలో ప్రత్యేకమైన ఏడాది ఇది. షాలినితో నా పెళ్లి ఏప్రిల్ 16న దుబాయ్‌లో బంధువులు, సన్నిహితుల సమక్షంలో జరగనున్నది. పెళ్లి అనేది జీవితంలో వేయబోతున్న ముఖ్యమైన అడుగు కాబట్టి మానసికంగా సిద్ధం కావడానికి మూడేళ్లు సమయం తీసుకున్నాను. ఏప్రిల్ 15న నిశ్చితార్థం, 21వ తేదీన హైదరాబాద్‌లో రిసెప్షన్ జరుగనున్నది. 2012లో కామన్ ఫ్రెండ్స్ ద్వారా షాలినితో పరిచయం ఏర్పడింది. తొలుత ఇద్దరం స్నేహితులమయ్యాం. నాలుగైదేళ్ల తర్వాత మా మధ్య ప్రేమ చిగురించింది. గత ఏడాది పెళ్లిచేసుకుందామని ఫిక్స్ అయ్యాం. మా పెళ్లికి కుటుంబసభ్యులు అంగీకరించారు. తొలుత నేనే షాలినికి ప్రపోజ్ చేశాను. గులాబీ మొక్క ఇచ్చి నా ప్రేమ గురించి చెప్పాను' అని తెలిపారు. అలాగే తదుపరి సినిమాల గురించి వెల్లడిస్తూ ' ఈ ఏడాది నాలుగు సినిమాలు చేస్తున్నాను. చంద్రశేఖర్ యేలేటి దర్శకత్వంలో నటిస్తున్న చిత్రానికి 'చెక్ 'అనే టైటిల్‌ను నిర్ణయించాం. వెంకీ అట్లూరి దర్శకత్వంలో 'రంగ్‌దే' కథ నచ్చి అంగీకరించాను. ఇందులో 24 ఏళ్ల యువకుడిగా నా పాత్ర సరికొత్తగా ఉంటుంది. అలాగే 'పవర్‌పేట' కథ 1960లో మొదలై 1990 వరకు జరుగుతుంది. 20 నుంచి 60 ఏళ్ల వరకు ఓ వ్యక్తి జీవిత ప్రయాణాన్ని ఆవిష్కరిస్తూ దర్శకుడు కృష్ణచైతన్య ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. 'అంధాదూన్' రీమేక్ మేనెలలో మొదలుపెట్టనున్నాం. ఈ రీమేక్‌కు మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు. విరామం లేకుండా మూడు సినిమాలు చేయడానికి చాలా కష్టపడ్డాను. నిద్ర పోకుండా పనిచేయాల్సివచ్చింది' అని తెలిపారు.



సుజోయ్, సాయిరోనక్, ప్రీతి అస్రాని, నందినిరెడ్డి, తనికెళ్లభరణి, సంగీత, క్రిష్, సుశీల్

# యువతకు స్ఫూర్తినిస్తుంది!

'మూడు నెలల క్రితం ఈ సినిమా చూశాను. ఎక్కడో చిన్న అసంతృప్తి అనిపించింది. అదే విషయాన్ని దర్శకులకు చెప్పాను. కొన్ని మార్పులతో చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఈ మధ్యే మొత్తం సినిమా చూశాను. అద్భుతంగా ఉంది' అన్నారు ప్రముఖ దర్శకుడు క్రిష్. ఆయన ఓ ముఖ్యఅతిథిగా పాల్గొన్న 'ప్రెజర్ కుక్కర్' చిత్ర ప్రీరిలీజ్ వేడుక మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. సాయిరోనక్, ప్రీతి అస్రాని జంటగా నటించిన ఈ చిత్రానికి సుజోయ్, సుశీల్ దర్శకులు. సుశీల్‌సుభాస్ కారంపురి, అప్పిరెడ్డి నిర్మాతలు. ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్ర బిగ్‌సీడీని యువహీరో విశ్వక్‌సేన్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 'నా స్నేహితులు అమెరికా వెళ్లిపోతుంటే బాధగా అనిపిస్తుంది. మా బృందంలో సగం మంది వెళ్లిపోగా, సగం మంది ఇక్కడ మిగిలిపోయాం. ఈ ఇష్యూపై తీసిన సినిమా ఇది. తప్పకుండా కొత్తదనంతో ఆకట్టుకుంటుంది' అన్నారు. 'ఈ సినిమా విషయంలో దర్శకుడు క్రిష్ ఎంతో సహాయం చేశారు. 'నేను మీకు సహాయం చేస్తున్నాం. మీరు రేపు మరొకరికి సహాయం చేయాలి' అని చెప్పారాయన. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుంటాం. ఈ సినిమా ఆరంభం నుంచి మధుర శ్రీధర్, తరుణ్‌భాస్కర్ ఎంతగానో సహకరించారు' అని దర్శకులు చెప్పారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమా యువతకు స్ఫూర్తినందిస్తూ ఓ ప్రేరణలా ఉంటుంది. ప్రతి సన్నివేశం వాస్తవికతను ప్రతిబింబిస్తూ సాగుతుంది. చిత్రాన్ని విడుదల చేస్తున్న అభిషేక్ పిక్చర్స్‌కు ధన్యవాదాలు' అన్నారు. 'అమెరికా వెళ్లాలనే వ్యామోహంతో తపించిపోయిన నా మిత్రులను కొందరిని దృష్టిలో పెట్టుకొని సినిమాలో కిషోర్ అనే పాత్రను పోషించాను. నేటి యువతకు ప్రేరణనిచ్చే సినిమాగా నిలుస్తుంది' అని హీరో సాయిరోనక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తనికెళ్ల భరణి, మధురశ్రీధర్‌రెడ్డి, రాజ్ కందుకూరి, రాహుల్ సిప్లిగంజ్ తదితరులు పాల్గొన్నారు.


లక్ష్

# దిశ ఘటనతో సంబంధం లేదు!

'ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన దిశ ఘటనతో మా చిత్రానికి ఎలాంటి సంబంధం ఉండదు. ఆ ఘటనను క్యాష్ చేసుకోవాలనే ఆలోచన మాకు లేదు' అని అన్నారు లక్ష్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'వలయం'. రమేష్ దర్శకుడు. చదలవాడ పద్మావతి నిర్మాత. ఈ నెల 21న విడుదలకానుంది. బుధవారం హైదరాబాద్‌లో లక్ష్ మాట్లాడుతూ 'సినిమాలో అరవింద్ అనే యువకుడిగా కనిపిస్తాను. అతని భార్య అదృశ్యమవుతుంది. ఆమె కోసం అన్వేషించే క్రమంలో అరవింద్ తెలుసుకున్న వాస్తవలేమిటన్నది థ్రిల్‌ను పంచుతుంది. బాలనటుడిగా గతంలో మూడు సినిమాల్లో నటించాను. హీరోగా నీతోవస్తా, 786, మేస్త్రీ, శంకర్ సినిమాలు చేశాను. పదహారేళ్ల వయసులో నా కెరీర్ ఆరంభమైంది. చదువు కోసం విరామం తీసుకున్నాను. దాదాపు పదమూడేళ్ల తర్వాత నటుడిగా పునరాగమనం చేయడం ఆనందంగా ఉంది. 'బిచ్చగాడు'తో నిర్మాతగా మారాను. ఆ సినిమా తర్వాత కంటెంట్ ప్రధాన సినిమాలకు ఆదరణ పెరిగింది. చిన్న సినిమా, పెద్ద సినిమా అనే భేదాలు లేకుండా కథ బాగున్న సినిమాల్ని సక్సెస్ చేస్తున్నారు. ఆ ఆలోచనతోనే కంటెంట్‌ను నమ్మి నటించాను. ఇదివరకు యాక్షన్ ప్రేమకథల్లో నటించాను. వాటికి భిన్నంగా సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలతో ఈ సినిమా ఉంటుంది. హీరో పాత్ర కోసం దాదాపు ఇరవై కేజీలు తగ్గాను. నటనపై తపనతో కష్టపడ్డాను. దిశ ఘటన జరగడానికి ముందే మా సినిమా చిత్రీకరణ మొదలైంది. దిశ పేరుతోనే దర్శకుడు రమేష్ ఈ కథ రాశారు. కానీ మహిళా ప్రధాన సినిమాగా అపోహపడతారని టైటిల్ మార్చాం' అని అన్నారు.









## ఏఎఫ్‌సీ చాంపియన్స్ లీగ్‌కు గోవా అర్హత

**జంషెడ్‌పూర్:** భారత పుట్‌బాల్ చరిత్రలో సరికొత్త అధ్యాయం. ప్రతిష్ఠాత్మక ఏఎఫ్‌సీ చాంపియన్స్ లీగ్‌లో బెర్తు దక్కించుకున్న తొలి భారత క్లబ్‌గా ఎఫ్‌సీ గోవా నిలిచింది. ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్‌ఎల్)లో భాగంగా బుధవారం జంషెడ్‌పూర్ ఎఫ్‌సీతో జరిగిన మ్యాచ్‌లో గోవా 5-0తో ఘన విజయం సాధించింది. హ్యుగో బౌమస్(70ని, 90ని) డబుల్ గోల్స్ విజృంభించగా, ఫెర్రాన్ కొరోమినాస్(11ని), జాకిచాంద్ సింగ్(84ని), మౌర్టడా ఫాల్(87ని) గోల్స్ చేశారు. దీనికి తోడు లీగ్ దశలో అత్యధిక గోల్స్(46)తో ఇది వరకు తమ పేరిటే ఉన్న రికార్డును గోవా తిరుగరాసింది.



## చెన్నైలో సింధు అకాడమీ

### శంకుస్థాపన చేసిన స్టార్ షట్లర్

**చెన్నై:** తన పేరిట చెన్నైలో నిర్మిస్తున్న బ్యాడ్మింటన్ అకాడమీ, స్టేడియానికి భారత స్టార్ షట్లర్ పీవీ సింధు బుధవారం శంకుస్థాపన చేసింది. చెన్నై నగర శివారు కోలప్పాకమ్‌లోని ఓ పాఠశాలలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ఈ అకాడమీని ఏర్పాటు చేస్తున్నది. గతంలో హార్ట్‌ఫుల్‌నెస్‌లో సింధు ధ్యాన సాధన చేసింది. ఈ అకాడమీ 18-24 నెలల్లో పూర్తవనుండగా.. ఇందులో మొత్తం ఎనిమిది కోర్టులతో పాటు వెయ్యి మంది కూర్చునే గ్యాలరీ, జిమ్ కేంద్రం, యోగా, ధ్యానం చేసుకునేందుకు ప్రత్యేక స్థలం లాంటి సదుపాయాలు ఉంటాయని హార్ట్‌ఫుల్‌నెస్ తెలిపింది. 'ఈ అకాడమీతో దేశ బ్యాడ్మింటన్‌కు ఎంతో ఊతం, ప్రోత్సాహం లభిస్తుంది. ప్లేయర్లకు శిక్షణ ఇచ్చేందుకే కాకుండా జాతీయ, అంతర్జాతీయ టోర్నీలు నిర్వహించేందుకు ప్రణాళికలు ఉన్నాయి. ఈ అకాడమీకి నా పేరు పెట్టడం గౌరవంగా భావిస్తున్నా. హార్ట్‌ఫుల్‌నెస్‌లో ధ్యానం చేయడం వల్ల మానసికంగా మరింత ప్రశాంతంగా, దృఢంగా తయారయ్యా. మరింత ఎక్కువగా ఏకాగ్రత సాధించగలిగా' అని సింధు చెప్పింది.

## మూడేండ్ల తర్వాత ఓ నిర్ణయానికొస్తా


కోహ్లీ

**వెల్లింగ్టన్:** విరాట్ కోహ్లీ..భారత క్రికెట్ జట్టుకు వెన్నెముక. అరంగేట్రం చేసినప్పటి నుంచి నిర్విరామంగా మూడు ఫార్మాట్లు ఆడుతున్న కోహ్లీ తన మనసులోని మాటను బయటపెట్టాడు. న్యూజిలాండ్‌తో శుక్రవారం నుంచి మొదలవుతున్న తొలి టెస్టు సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'మరో మూడేండ్లు అన్ని ఫార్మాట్లు ఆడుతానన్న నమ్మకముంది. ఆ తర్వాత వయసును బట్టి ఆటతీరులో మార్పు రావచ్చు. అవును.. ఎందుకంటే గత ఎనిమిదేండ్ల నుంచి దాదాపు ప్రతి ఏడాదిలో 300 రోజులు క్రికెట్ ఆడుతున్నాను. ఇందులో ప్రాక్టీస్ సెషన్లకు తోడు పర్యటనలు ఉన్నాయి. ఇది ఒక రకంగా మనపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కానీ ఆటగాళ్లు దీని గురించి అంతగా ఆలోచించడం లేదు. విరామం తీసుకుని ఆడిన ప్రతిసారి నాలో కొత్త ఉత్తేజాన్ని నింపుకున్నాను. కొంత సేద తీరాలని ఎవరికైనా ఉంటుంది. కానీ బిజీ షెడ్యూల్ దృష్ట్యా అన్ని ఫార్మాట్లు ఆడే ఆటగాళ్లకు సాధ్య పడటం లేదు. మిగతావారితో పోల్చుకుంటే కెప్టెన్‌గా మరింత ఒత్తిడికి గురి కావాల్సి ఉంటుంది. ప్రత్యర్థి జట్లపై వ్యూహ రచనలు, ఎత్తులకు పైఎత్తులు, ఆటగాళ్ల ఎంపిక ఇలా అన్ని అంశాల్లో కెప్టెన్ భాగం కావాల్సి ఉంటుంది. మరో మూడేండ్లు ఆటలో ఇదే దూకుడు కొనసాగిస్తా. ఎందుకంటే జట్టుకు నా అవసరం చాలా ఉంది. ఆ తర్వాత ప్రాధామ్యాలు మారిపోతాయి' అని కోహ్లీ అన్నాడు.

**టెస్టు చాంపియన్‌షిప్ బెస్ట్**

అన్నింటితో పోల్చుకుంటే టెస్టు చాంపియన్‌షిప్ అత్యుత్తమమైందని భారత కెప్టెన్ కోహ్లీ అన్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌కు మరింత వన్నెలద్దాలనే ఉద్దేశంతో ఐసీసీ తీసుకొచ్చిన భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా టెస్టు చాంపియన్‌షిప్ మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. ఇందులో టాప్-2లో నిలిచిన జట్లు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ కోసం తలపడుతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని రానున్న భవిష్యత్తులో టీ20 చాంపియన్స్ కప్(2024-28), వన్డే చాంపియన్స్ కప్(2025-29) ప్రతిపాదనలను తీసుకురాబోతున్నట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో విరాట్ మాట్లాడుతూ 'మిగతా ఫార్మాట్లతో పోల్చుకుంటే టెస్టు చాంపియన్‌షిప్ అత్యుత్తమం. చారిత్రక లార్డ్స్ మైదానంలో టైటిల్ కోసం తలపడాలనేది ప్రతి ఒక్కరి కల. దానికి మేము అతీతులం కాదు. త్వరలోనే మేము అర్హత సాధిస్తాం, ఇందులో ఎలాంటి సందేహం లేదు. టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా ఇప్పటి వరకు సొంతగడ్డపైనే టెస్టులు ఆడాం. తొలిసారి కివీస్‌తో ఆడబోతున్నాం. పాయింట్లు కీలకమైనందున ప్రతి మ్యాచ్ ప్రతిష్ఠాత్మకమే. ఇటీవల ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా మధ్య టెస్టు సిరీస్ ఎంత రసవత్తరంగా సాగిందో చూశాం' అని విరాట్ అన్నాడు.

# కొత్త చరిత్ర కోసం

### టీ20 ప్రపంచకప్‌నకు సిద్ధమైన భారత మహిళల జట్టు.. ఫేవరెట్‌గా బరిలోకి..

### మిడిలార్డర్ సమస్యపై ప్రత్యేక దృష్టి.. ఆసీస్‌తో శుక్రవారం తొలి పోరు




**చరిత్ర సృష్టించేందుకు భారత మహిళా క్రికెటర్లకు మరో అవకాశం వచ్చింది. తొలి ప్రపంచకప్‌ను కైవసం చేసుకొని మహిళల ఆటకు కొత్త ప్రాభవం తెచ్చే చాన్స్ ముగింట ఉంది. ఈ తరుణంలో అన్ని విభాగాల్లో సత్తాచాటి టీ20 విశ్వకప్‌ను ముద్దాడాలని మన జట్టు తహతహలాడుతున్నది. టాపార్డర్ రాణిస్తున్నా.. మిడిలార్డర్‌లో లోపాలు జట్టును కలవరపెడుతున్నాయి. పొట్టి ఫార్మాట్‌లో నిలకడలేమి సైతం వెంటాడుతున్నది. సీనియర్ ప్లేయర్లు మిథాలీ రాజ్, జులన్ గోస్వామి లేకుండానే చాలా ఏండ్ల తర్వాత ఓ ప్రధాన టోర్నీలో అడుగుపెడుతున్నది. ప్రపంచకప్ సమరాన్ని టీమ్‌ఇండియా శుక్రవారం ప్రారంభించనున్న నేపథ్యంలో జట్టు బలాబలాలపై ప్రత్యేక కథనం...**

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

మూడుసార్లు టీ20 ప్రపంచకప్ టోర్నీ సెమీఫైనల్స్(2009,10,18)లో నిరాశకు గురైన భారత మహిళల జట్టు ఈసారి ఆ దశను అధిగమించి టైటిల్‌ను దక్కించుకోవాలని పట్టుదలగా ఉంది. 2017 వన్డే విశ్వకప్ తుదిపోరులో ఓడినా.. పొట్టిఫార్మాట్‌లో టైటిల్‌ను కైవసం చేసుకొని తొలిసారి జగజ్జేతగా నిలవాలని ఆకాంక్షిస్తున్నది. ఆస్ట్రేలియా గడ్డపై శుక్రవారం టీ20 ప్రపంచకప్ టోర్నీ ఆరంభం కానుండగా తొలి మ్యాచ్‌లో టీమ్‌ఇండియా... ఆతిథ్య ఆసీస్‌తో పోరాటాన్ని ప్రారంభించనుంది. ప్రతిభావంతులతో కూడిన భారత జట్టు టైటిల్ ఫేవరెట్లలో ఒకటి అనడంలో సందేహమే లేదు. అయితే, జట్టుగా రాణించడంలో మాత్రం ఎక్కువసార్లు విఫలమవుతున్నది. ముఖ్యంగా టాపార్డర్ అదరగొడుతున్నా... చాలా సందర్భాల్లో మిడిలార్డర్ చేతులెత్తేస్తుండడం ప్రతికూలంగా మారుతున్నది. ఇటీవలి సిరీస్‌ల్లో బౌలర్లు రాణిస్తుండడం జట్టుకు కాస్త ఊరట కలిగించే అంశం. 2018 ప్రపంచకప్ తర్వాత రెండు టీ20 సిరీస్‌ల్లో గెలిచిన భారత మహిళల జట్టు, రెండింట ఓటమిని చవిచూసింది. ఇటీవల జరిగిన ముక్కోణపు టీ20సిరీస్‌లో మోస్తరుగా రాణించి ఫైనల్ చేరినా.. ఆసీస్‌తో ఓడి నిరాశపరిచింది.

**మందన, షెఫాలీ మెరిస్తే..**

టీమ్‌ఇండియా ఓపెనర్ స్మృతి మంధాన అద్భుతమైన ఫామ్‌లో ఉంది. భారత క్రికెట్‌లో తనదైన ముద్రను వేస్తూ ముందుకు సాగుతున్నది. దూకుడైన ఆటతో జట్టుకు శుభారంభాలు ఇస్తున్నది. ఇటీవల ఆసీస్‌లో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో 135కు పైగా స్ట్రయిక్ రేట్‌తో టాప్‌స్కోరర్‌గా నిలిచి రాణించింది. మహిళల బిగ్‌బాష్ లీగ్ ఆడిన అనుభవమూ ఆమెకు ఉంది. మహిళా గంగూలీగా పిలుచుకునే లెఫ్ట్‌హ్యాండర్ స్మృతి ప్రపంచకప్‌లోనూ రాణిస్తే భారత్ పరుగుల వరద పారించేందుకు మార్గం సుగమమవుతుంది. 16ఏండ్ల షెఫాలీ వర్మ దూకుడుకు మారుపేరుగా మారింది. తొలి బంతి నుంచే బౌండ్రీ బాదాలనే కసితో బ్యాటింగ్ చేస్తూ వీరేందర్ సెహ్వాగ్‌ను గుర్తు చేస్తున్నది. వన్‌డౌన్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ నిలకడ లేమితో భారీ స్కోర్లు చేయడంలో విఫలమవుతున్నది.

**మిడిలార్డర్ చింత**

టీమ్‌ఇండియా మిడిలార్డర్‌లో నిలకడ కొరవడింది. పురుషుల జట్టులానే ఎక్కువగా మహిళల జట్టు కూడా టాపార్డర్‌పైనే ఆధారపడుతున్నది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ అడపాదడపా రాణిస్తున్నా.. భారీ ఇన్నింగ్స్‌లు ఆడలేకుంది. మిగిలిన వారు సైతం సరిగా ఆకట్టులేకపోతున్నారు. ఇన్నింగ్స్‌కు మెరుపు ముగింపులు ఇవ్వలేకపోవడంతో పాటు లక్ష్యఛేదనలోనూ చాలాసార్లు మిడిలార్డర్ బ్యాటర్లు తడబడుతున్నారు. ఇటీవల ఆసీస్‌తో జరిగిన ముక్కోణపు టీ20 సిరీస్ ఇందుకు మరోసారి సాక్ష్యంగా నిలిచింది. ఓపెనర్ మందన(66) అదరగొట్టడంతో 156పరుగుల లక్ష్యఛేదనలో ఓ దశలో టీమ్‌ఇండియా మూడు వికెట్లకు 115పరుగులు చేసి పటిష్ఠ స్థితిలో నిలిచింది. ఆ తర్వాత రోడ్రిగ్స్, హర్మన్ ప్రీత్, దీప్తి శర్మ విఫలమవడంతో 144 పరుగులకే ఆలౌటై గెలువాల్సిన దశ నుంచి ఓటమి పాలైంది. వెస్టిండీస్‌తో జరిగిన వామప్ మ్యాచ్‌లోనూ బ్యాటర్లు చేతులెత్తేయగా.. బౌలర్లు రాణించడంతో 2పరుగుల తేడాతో జట్టు గెలిచింది. అయితే ప్రపంచకప్‌లో మిడిలార్డర్ వైఫల్యాలను చక్కదిద్దుకోవాలని భారత్ ఆశిస్తున్నది. వేద కృష్ణమూర్తి సైతం ఫామ్‌లోకి రావాలని పట్టుదలగా ఉంది. ఆల్ రౌండర్ దీప్తి శర్మ, వికెట్ కీపర్ తానియా భాటియా సైతం తలా కొన్ని పరుగులు చేస్తే టీమ్‌ఇండియా మిడిలార్డర్ కష్టాలు తీరే అవకాశం ఉంది.


హర్మన్‌ప్రీత్

**సానుకూలంగానే ఉంటాం**

ప్రపంచకప్‌లో ఏ జట్టునైనా ఒత్తిడిలోకి నెట్టగల సామర్థ్యం తమ జట్టుకు పూర్తిస్థాయిలో ఉందని టీమ్‌ఇండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ చెప్పింది. ప్రత్యర్థి జట్టు ఏదైనా సానూకులంగానే ముందుకు సాగుతామని స్పష్టం చేసింది. ప్రపంచంలో ఎక్కడున్నా భారతీయులు క్రికెట్‌ను ప్రేమిస్తారని, ఆసీస్‌లోనూ తమ జట్టుకు మద్దతు పెద్ద సంఖ్యలోనే ఉంటుందని ఆశిస్తున్నట్టు చెప్పింది.

**స్పిన్నే బలం..**

ఆస్ట్రేలియా గడ్డపై విశ్వటోర్నీలో తలపడుతున్న టీమ్‌ఇండియాకు బౌలింగ్‌లో స్పిన్నర్లే కీలకం కానున్నారు. లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ మంచి ఫామ్‌లో ఉంది. విండీస్‌తో జరిగిన లోస్కోరింగ్ మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసి జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించింది. పొట్టి ఫార్మాట్‌లో రెండేండ్లలో 51వికెట్లు సైతం దక్కించుకొని సత్తాచాటింది. ఆఫ్ స్పిన్నర్ దీప్తి శర్మ సైతం కీలకమైన సమయాల్లో వికెట్లు తీసి సత్తాచాటుతున్నది. ముఖ్యంగా వికెట్ టు వికెట్ బౌలింగ్‌తో పొదుపుగా బౌలింగ్ చేయడం చేస్తున్నది. పేస్ విభాగాన్ని శిఖా పాండే ముందుండి నడిపించనుంది. పేస్‌కు అనుకూలించే ఆసీస్ పిచ్‌లపై స్పిన్నర్లతో పాటు ఫాస్ట్ బౌలర్లు తప్పక రాణించాల్సి ఉంటుంది.

**సంతోషకరమైన జట్టు మాదే : మందన**

టీ20 ప్రపంచకప్‌లో థాయ్‌లాండ్ కన్నా తమ జట్టే సంతోకరమైందని టీమ్‌ఇండియా స్టార్ ఓపెనర్ స్మృతి మందన చెప్పింది. జట్టు యువ ప్లేయర్లతో కళకళలాడుతున్నదని, వారితో తాను కలిసిపోతున్నానని తెలిపింది. 'ప్రపంచకప్‌లో మాదే సంతోషకరమైన జట్టు. ఈ విషయంలో థాయ్‌లాండ్ మాతో పోటీలో ఉంది. కొత్త ప్లేయర్లు సౌకర్యంగా ఫీలయ్యేందుకు నేను కూడా వారితో కలిసిపోయా. మేం కలిసి డ్యాన్స్ చేస్తున్నాం. పాటలు పాడుతున్నాం. ఎంతో ఉల్లాసంగా ఉన్నాం' అని మందన చెప్పింది. మిథాలీ రాజ్, జులన్ గోస్వామి లాంటి సీనియర్లు టీ20లకు గుడ్‌బై చెప్పడంతో భారత జట్టులో కొత్తవారు వచ్చారు.

**గ్రూప్ దశలో టీమ్‌ఇండియా మ్యాచ్‌లు**

| | |
|---|---|
| ఫిబ్రవరి 21 | ఆస్ట్రేలియాతో(సిడ్నీ) |
| ఫిబ్రవరి 24 | బంగ్లాదేశ్‌తో(పెర్త్) |
| ఫిబ్రవరి 27 | న్యూజిలాండ్ (మెల్‌బోర్న్) |
| ఫిబ్రవరి 29 | శ్రీలంకతో(మెల్‌బోర్న్) |

**భారత జట్టు**

హర్మన్ ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మందన, షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ దేవోల్, దీప్తిశర్మ, వేద కృష్ణమూర్తి, రిచా ఘోశ్, తానియా భాటియా(వికెట్ కీపర్), పూనమ్ యాదవ్, రాధాయాదవ్, రాజేశ్వరి గైక్వాడ్, శిఖ పాండే, పూజా వస్త్రాకర్, అరుంధతి రెడ్డి

## గ్రూప్‌లో భారత్‌కు గట్టిపోటీ

శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా, భారత్‌లను ఫేవరెట్ జట్లుగా క్రికెట్ పండితులు విశ్లేషిస్తున్నారు. ఈ రెండు జట్ల సమరంతోనే శుక్రవారం టోర్నీ ప్రారంభం కానుండడం ఆసక్తి రేపుతున్నది. ఈసారి విశ్వటోర్నీలో మొత్తం పది జట్టు రెండు గ్రూపుల్లో తలపడనున్నాయి. గ్రూప్-ఏలో ఆస్ట్రేలియా, భారత్, న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ ఉండగా... గ్రూప్-బీలో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, పాకిస్థాన్, థాయ్ లాండ్ ఉన్నాయి. వీటిల్లో బంగ్లా, థాయ్‌లాండ్ జట్లు క్వాలిఫయర్స్ ద్వారా టోర్నీకి అర్హత సాధించాయి.


ప్రపంచంలోనే అతి పెద్ద క్రికెట్ స్టేడియంగా నిర్మితమైన అహ్మదాబాద్‌లోని మొతేర స్టేడియం ఏరియల్ వ్యూ ఇది. అత్యధిక సీటింగ్ సామర్థ్యం కల్గి ఉన్న ఈ స్టేడియాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ త్వరలో ప్రారంభించబోతున్నారు.

## జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలు షురూ

### ప్రారంభించిన జగన్‌మోహన్‌రావు




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** కాన్పూర్(ఉత్తర్‌ప్రదేశ్) వేదికగా బుధవారం జాతీయ సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు మొదలయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జగన్‌మోహన్ రావు పోటీలను ప్రారంభించారు. టోర్నీలో తెలంగాణతో సహా మొత్తం 34 జట్లు బరిలోకి దిగుతున్నాయి. 750 మంది క్రీడాకారులతో పాటు 50 మంది సాంకేతిక సిబ్బంది పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ టోర్నీలో ప్రతిభ ఆధారంగా 150 మందిని ఎంపిక చేసి వారిని బిడ్డింగ్‌లో ప్రవేశ పెడుతామని ఆరు జట్లు వీరిని ఎంచుకుంటాయని తెలిపారు. ఈనెల 24న బిడ్డింగ్ ప్రక్రియ జరుగుతుందని ఆ తర్వాత ప్రొఫెషనల్ కోచ్‌ల సమక్షంలో వచ్చే నెల 4 వరకు బ్యూట్ క్యాంప్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పీహెచ్‌ఎల్) తొలి సీజన్ మార్చి 5న ప్రారంభమవుతుందని జగన్‌మోహన్ రావు మీడియాకు వివరించారు.

## ప్రిక్వార్టర్స్‌లో సైనా, శ్రీకాంత్



**బార్సిలోనా:** భారత స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్.. బార్సిలోనా స్పెయిన్ మాస్టర్స్ టోర్నీలో శుభారంభం చేశారు. వారితో పాటు అజయ్ జయరామ్, సహా మిక్స్‌డ్ డబుల్స్‌లో ఎన్ సిక్కిరెడ్డి - ప్రణవ్ జెర్రీ చోప్రా తమ విభాగాల్లో తొలి రౌండ్ నెగ్గి ప్రిక్వార్టర్స్‌లో ప్రవేశించారు. పారుపల్లి కశ్యప్, హెచ్ ప్రణయ్ ఆదిలోనే టోర్నీ నుంచి నిష్క్రమించారు. బుధవారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఐదో సీడ్ సైనా 21-16, 21-14తేడాతో యోనీ లీ(జపాన్)పై 35నిమిషాల్లోనే అలవోక విజయం సాధించింది. ఒలింపిక్స్‌లో చోటు సాధించాలన్న లక్ష్యంతో సత్తా చాటాలని సైనా పట్టుదలగా ఉంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో మూడో సీడ్ శ్రీకాంత్ 23-21, 21-18తేడాతో భారత్‌కే చెందిన యువ ఆటగాడు శుభంకర్ డేపై గెలిచాడు. మరో మ్యాచ్‌లో 21-14, 21-12తేడాతో క్రిస్టో పొపోవ్(ఫ్రాన్స్)పై గెలిచిన భారత ఆటగాడు అజయ్ జయరామ్‌తోనే ప్రిక్వార్టర్స్‌లో శ్రీకాంత్ గురువారం తలపడనున్నాడు. కాగా, భారత ఆటగాడు హెచ్ ప్రణయ్ 18-21, 15-21తో డారెన్ లీ(మలేషియా) చేతిలో ఓడాడు. పారుపల్లి కశ్యప్ 9-21, 21-18 12-14తో ఉన్న సమయంలో మూడో గేమ్‌లోనే గోర్ కోయిల్‌హో(బ్రెజిల్)తో మ్యాచ్‌లో గాయం కారణంగా వైదొలిగాడు. మిక్స్‌డబుల్స్‌లోనూ ఎన్.సిక్కిరెడ్డి - ప్రణవ్ జెర్రీ చోప్రా జోడీ 10-21, 21-16, 21-17తో మాథియాస్ క్రిస్టియాన్‌సెన్ - అలెగ్జాండ్రా బోజే(డెన్మార్క్) ద్వయంపై గెలిచి.. ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది.

## 22 నుంచి టీపీకేఎల్ మూడో సీజన్




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** గ్రామీణ క్రీడ కబడ్డీకి మన దేశంలో ఉన్న ఆదరణ అంతాఇంతా కాదు. పసి వయసు నుంచి పండు ముసలి వరకు కబడ్డీ అంటే అమితమైన ఆసక్తి కనబరిచే వాళ్లే. కార్పొరేట్ హంగులు అద్దుకున్న కబడ్డీ అభిమానులను అలరించేందుకు సిద్ధమైంది. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలికితీసే ఉద్దేశంతో మొదలైన తెలంగాణ ప్రీమియర్ కబడ్డీ లీగ్(టీపీకేఎల్) మూడో సీజన్ ఈనెల 22 నుంచి మొదలుకాబోతున్నది. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియం వేదికగా మార్చి 14 వరకు టీపీకేఎల్ పోటీలు జరుగనున్నాయి. బుధవారం ఓ హోటల్ వేదికగా టీపీకేఎల్ మూడో సీజన్‌లో బరిలోకి దిగుతున్న ఎనిమిది జట్ల పరిచయ కార్యక్రమం జరిగింది. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ సహకారంతో చింతల స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మద్దతునిస్తుండగా, సిల్లి మాంక్స్ ఎంటర్టైన్‌మెంట్ టీపీకేఎల్‌ను సమర్పిస్తున్నది. ఈ లీగ్‌లో కొత్తగా సైబరాబాద్ చార్జర్స్ చేరగా, డిఫెండింగ్ చాంపియన్స్ వరంగల్ వారియర్స్, నిరుటి రన్నరప్ కరీంనగర్ కింగ్స్, గద్వాల్ గ్లాడియేటర్స్, రంగారెడ్డి రైడర్స్, హైదరాబాద్ బుల్స్, నల్లగొండ ఈగల్స్, మంచిర్యాల్ టైగర్స్ టైటిల్‌పై కన్నేసాయి. కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్, టీపీకేఎల్ కమిషనర్ సంజయ్ రెడ్డి, లీగ్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఫ్రాంచైజీల యజమానులు పాల్గొన్నారు.

## రొమేనియాపై భారత్ గెలుపు

**న్యూఢిల్లీ:** టర్కీ వేదికగా బుధవారం రొమేనియాతో జరిగిన స్నేహపూర్వక మ్యాచ్‌లో భారత అండర్-17 బాలికల పుట్‌బాల్ జట్టు 1-0 తేడాతో విజయం సాధించింది. ప్రియాంక దేవి(29ని) భారత్ తరఫున ఏకైక గోల్ చేసింది. తొలి మ్యాచ్ 3-3తో డ్రా కావడంతో మలి ఆటను ఇరు జట్లు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. 12వ నిమిషంలో సుమతి కుమారి గోల్ కొట్టినా అది ఆఫ్‌సైడ్ అని తేలడంతో ఆశలు నీరుగారాయి. రెండు నిమిషాల వ్యవధిలో సునీత ముండా చేసిన గోల్ ప్రయత్నాన్ని రొమేనియా కీపర్ దీటుగా అడ్డుకోవడంతో సాధ్యపడలేదు. 28వ నిమిషంలో నిర్మలాదేవి గోల్ ప్రయత్నం విఫలమైనా..మరుసటి నిమిషంలోనే ప్రియాంక గోల్‌లో భారత్ ఖాతా తెరిచింది.

## భారత్‌కు మూడు కాంస్యాలు


హర్దీప్

**న్యూఢిల్లీ:** ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్ గ్రీకో రోమన్ విభాగంలో భారత్‌కు మరో మూడు పతకాలు దక్కాయి. బుధవారం ఇక్కడ జరిగిన టోర్నీ రెండో రోజు పోటీల్లో భారత కుస్తీవీరులు అషు(67కేజీలు), ఆదిత్య కుందు(72కేజీలు), హర్దీప్(97కేజీలు) వారి విభాగాల్లో చెరో కాంస్యం చేజిక్కించుకున్నారు. కాంస్యపోరులో అషు 8-1తేడాతో అబ్దుల్‌కరీమ్ మహమ్మద్ అల్‌హసన్(సిరియా)పై అలవోక విజయం సాధించాడు. మరో పోటీలో ఆదిత్య కుందు 8-0తేడాతో నవో కుసాక(జపాన్)ను 90సెకన్లలోనే మట్టికరిపించాడు. అనంతరం హర్దీప్ 3-1తో మఖమ్మద్‌జనోవిచ్(కిర్గిస్థాన్)పై గెలిచి కాంస్యం దక్కించుకోవడంతో.. గ్రీకోరోమన్‌లో భారత పతకాల సంఖ్య ఐదుకు చేరింది. మరో రెజ్లర్ జ్ఞానేందర్(60కేజీలు) కాంస్య బౌట్‌లో 0-6తేడాతో ఓడిపోయాడు. స్టార్ రెజ్లర్ సునీల్ కుమార్(87కేజీలు) మంగళవారం గ్రీకోరోమన్‌లో పోటీలో స్వర్ణం సాధించి, 27ఏండ్ల నిరీక్షణకు తెరదించగా... అర్జున్ హలకుర్కి(55కేజీలు) కాంస్యం చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే.

# మీ అలర్జీ పరీక్షను ఈరోజే చేయించుకోండి

## సగం కంటే తక్కువ ధరలకే

**కరీంనగర్, రామగుండం, ఆర్మూర్, జగిత్యాల, కోరుట్ల, మంచిర్యాల, పెద్దపల్లి, జహీరాబాద్, బోధన్‌ల వద్ద**

## ఒక బ్లడ్ టెస్ట్‌తోనే అలర్జీకి గల కారణాలను గుర్తించవచ్చు

## 21, 22, 23 & 24 ఫిబ్రవరి 2020

### రక్త పరీక్షల ద్వారా అలర్జీలను గుర్తించవచ్చు. అందునుండి సకాలంలో అలర్జీ చికిత్సకు దోహదపడుతుంది

**కరీంనగర్, రామగుండం, ఆర్మూర్, జగిత్యాల, కోరుట్ల, మంచిర్యాల, పెద్దపల్లి, జహీరాబాద్, బోధన్‌ల** వద్ద అంజన్ పాత్ ల్యాబ్స్ & అలర్జీ టెస్టింగ్ సెంటర్ యొక్క కలెక్షన్ సెంటర్లు 80–115 అలర్జీ కారకాలు (ఆహారం, చర్మం, శ్వాస, విస్తృతమైన) కలిగిన వాటికి 50% కంటే ఎక్కువ తగ్గింపుతో రాయితీగల రేట్ల వంతున అన్నిరకాల అలర్జీ (అలర్జీ) కొరకు అలర్జీ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఇవి **21, 22, 23 & 24 ఫిబ్రవరి ఉ. 9 గంటల నుండి సా. 5 గంటల వరకు** నిర్వహించ బడతాయి. ఈ పరీక్షలు నాలుగు రోజులకు మొత్తం ధరలో సగం కంటే తక్కువ ధరకు నిర్వహించబడతాయి.

గతంలో రోగి ఏ రకమైన అలర్జీతో బాధపడుతున్నాడు మరియు ఏ అలర్జెన్ దానికి కారణమవుతుందో తెలుసుకొనుటకు చేతిపై 98 చోట్ల పొడిచే స్కిన్ ప్రిక్ టెస్ట్ చేసేవారు. కానీ, ప్రస్తుతం ఒకే ఒక రక్తనమూనాతో తేలికగా ఈ పరీక్ష చేయబడుతుంది. ఈ పరీక్ష మా ల్యాబ్‌లో అందుబాటులో వున్న ఫాడియా 250 మరియు యూరో బ్లాట్ ఒన్ వంటి ప్రత్యేకమైన మెషీన్ల ద్వారా చేయబడుతుంది.

**డా. జి. సమ్రాట్ యాదవ్** – అలర్జీ (అలర్జీ) అనేది ఒక వ్యాధి. అయితే, ప్రజలు దానిని అలా భావించరు. ఒకసారి అది ప్రారంభమైతే వ్యక్తులను ఇబ్బందికి గురిచేస్తూ వుంటుంది. ఒక వ్యక్తికి సువాసనలు నచ్చకపోతే అతనికి పూలంటే అలర్జీ. వ్యక్తులకు తమ పెంపుడు జంతువుల నుండి కూడా అలర్జీ వుండవచ్చు. ఒకసారి ఈ అలర్జీలను గుర్తిస్తే సమర్థవంతమైన చికిత్స చేయించుకోవాలి. వీటికి చికిత్స వుంది. జాగ్రత్తలు కూడా పాటించాలి. **అలర్జీకి చికిత్స చేయుటకు వ్యాధి నిర్ధారణ మాత్రమే మార్గం.**

**డా. బి. సురేష్ రెడ్డి** – ఒక వ్యక్తి రోజువారీ జీవితంలో అనేక సమస్యలను అలర్జీ కలిగిస్తుంది కనుక దానిని నిర్లక్ష్యం చేయకూడదు. ఒక వ్యక్తి ప్రత్యేకించి రుతు సంబంధ అలర్జీతో బాధపడుతుంటే అది ప్రమాదకరం కనుక అతను/ఆమె వెంటనే డాక్టరును సంప్రదించాలి. అలర్జీ వ్యాధుల వ్యాధి నిర్ధారణను వెంటనే చేయడంవల్ల దానికి చికిత్స చేయవచ్చు మరియు జాగ్రత్తలు తీసుకోవాలి. అలర్జీ యొక్క వ్యాధి నిర్ణయం జరిగినప్పుడు రోగికి చికిత్స చేయుట డాక్టరుకు సులభతరమవుతుంది.

### అలర్జీలకు చికిత్స

ఒకసారి రోగనిర్ధారణ జరిగాక కొన్ని ప్రత్యేక ఆహార పదార్థాలు మానుట వలన లేదా వైద్యం ద్వారా మందుల ద్వారా చికిత్స చేయవచ్చు. అలర్జీ నిరోధక వైద్యం లేదా అలర్జీలు తొలగించి ఇమ్యూనో థెరపీ అని పిలువబడే అనుభవజ్ఞులైన డాక్టర్లచే ప్రత్యేక వైద్యం కావచ్చు.

**తెలంగాణ స్పెసిఫిక్ అలర్జీ ప్యానెల్ లభిస్తుంది**
**తెలంగాణ కాంప్రెహెన్సివ్ అలుర్జన్ ప్యానెల్.**
**తెలంగాణ కోసం అలెర్జన్ స్పెసిఫిక్స్ (ప్రచురించబడిన అధ్యయనాలు మరియు యదార్థ అనుభవాల ఆధారంగా)**

### అలర్జీ అంటే ఏమిటో తెలుసుకుందాం?

ప్రతి వ్యక్తి వారు పురుషులైనా లేదా మహిళలైనా ఇతర పదార్థాల ద్వారా కలిగే ఉద్దీపనలు సహించుటకు శక్తి కలిగి వుంటారు. అయినప్పటికీ కొన్ని పదార్థాలు ఒక వ్యక్తి వ్యాధినిరోధక వ్యవస్థలో అసాధారణ ప్రతిక్రియకు కారణమై అలర్జీని కలిగిస్తాయి (అలర్జీ).



**గతంలో రోగి ఏ రకమైన అలర్జీతో బాధపడుతున్నాడు మరియు ఏ అలర్జెన్ దానికి కారణమవుతుందో తెలుసుకొనుటకు చేతిపై 98 చోట్ల పొడిచే స్కిన్ ప్రిక్ టెస్ట్ చేసేవారు. కానీ, ప్రస్తుతం ఒకే ఒక రక్తనమూనాతో తేలికగా ఈ పరీక్ష చేయబడుతుంది.**

### టెస్టిమోనియల్స్



**పీటర్ జాన్** – నేను గత 8 సంవత్సరాలుగా • **ఊపిరి ఆడకపోవడం** • **ఊపిరి తగ్గిపోవడం** • **గురక** • **విపరీతంగా దగ్గు రావడం** • **ముక్కు కారడం మరియు తుమ్మడం** వలన బాధపడుతున్నాను. నేను ప్రజలకు సిఫారసు చేసిన వివిధ చికిత్సలకు ప్రయత్నించాను. అనేకమంది డాక్టర్లను సందర్శించాను. అయితే, తాత్కాలింగా ఉపశమనం కలిగింది. అప్పుడు నా స్నేహితులలో ఒకరు మీ ల్యాబ్ గురించి మరియు మీరు చేసే అలర్జీ పరీక్ష గురించి నాకు తెలిపారు. అది నా జీవితాన్ని మార్చివేసింది. నా ఆరోగ్యాన్ని వాస్తవంగా మెరుగుపరచిన సమాచారాన్నంతటినీ నాకు కల్పించిన మీకు నేను ధన్యవాదాలు తెలుపుతున్నాను.

పరీక్షలో పాజిటివ్‌గా కనబడిన ఆహార పదార్థాలను వినియోగించడం నేను మానివేశాను మరియు నాకు అలర్జీకి సంబంధించిన రియాక్షన్స్ వస్తాయని గతంలో నేను భావించిన కొన్ని ఆహార పదార్థాలను తిరిగి చేర్చుకున్నాను. ఈరోజు నేను ఎంతో ఆరోగ్యంగా ఉన్నట్లుగా భావిస్తున్నాను. మీ పరీక్షా విధానాన్ని నా స్నేహితులందరికీ, కుటుంబానికి మరియు తెలిసిన వారందరికీ సిఫారసు చేస్తున్నాను. మీకు కృతజ్ఞతలు!



**రామకృష్ణ:** నేను అంజన్ ల్యాబ్స్ గురించి ఎంతో విన్నాను. అందువలన వారి నుంచి నేను అలర్జీ పరీక్ష చేయించుకున్నాను. నాకు • **దురద** • **వాపు** • **చర్మంపై ముదురురంగు మచ్చలు** • **రసి కారణం** • **ఫిస్సర్స్** • **ఎర్రబారడం** • **దద్దుర్లు** వంటి అలర్జీ సమస్యలు ఉన్నాయి. అయితే వాటి నుంచి పరీక్ష చేయించుకున్న తరువాత నాకు వేటి నుంచి అలర్జీ వస్తోందో తెలుసుకున్నాను. ఇప్పుడు వాటిని తీసుకోవడం ఆపివేశాను. ఇప్పుడు నాకెంతో బాగుంది.

ఈ ప్రకటనల నుంచి నేను అలర్జీ పరీక్ష గురించి తెలుసుకున్నాను. అనేక సంవత్సరాలుగా అలర్జీ నుంచి ఇప్పటికే బాధపడుతున్న అటువంటి రోగులకు ఇది ఒక మాధ్యమం.
అంజన్ పాత్ ల్యాబ్స్‌కు శుభాకాంక్షలు.

**సగం కంటే తక్కువ ధరలకు అలర్జీ పరీక్ష ఫిబ్రవరి 21 నుండి 24 మధ్య మాత్రమే లభిస్తుంది**

### అలర్జీ లక్షణాలు

- చర్మం ఎర్రబడుట
- చర్మంపై దద్దుర్లు/దురద
- చర్మంపై మచ్చలు
- ముఖం, పెదవులు ఉబ్బుట
- కడుపు నొప్పి
- డయేరియా
- గొంతు నొప్పి, దగ్గు
- గజ్జి
- శ్వాస తీసుకొనుటలో ఇబ్బంది
- దద్దుర్లు
- అలర్జిక్ రినైటిస్ (తుమ్ముట)

### మీరు అలర్జీ పరీక్ష చేయించుకుంటే

## ఉచితం విటమిన్ B12 & విటమిన్ D పరీక్షలు

భారత్‌లో అలర్జీ పరీక్షకు మొదటి NABL అక్రెడిటెడ్ ల్యాబ్‌లలో జెరత్ పాథ్ ల్యాబ్స్ & అలర్జీ పరీక్షా కేంద్రం ఒకటి. జెరత్ పాథ్ ల్యాబ్స్ యొక్క సహ కంపెనీ ఆంజన్ పాథ్ ల్యాబ్. ఇప్పటివరకూ ఉత్తర మరియు పశ్చిమ భారతదేశంలోని 14 రాష్ట్రాలో JPL ఉన్నది మరియు APL ద్వారా అది దక్షిణ భారత భాగంలో తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలలో ప్రవేశించియున్నది.

**ECHS/ESI/CGHS**
**కార్డు హోల్డర్లకు అదనపు తగ్గింపు**

### అలర్జీకి కారణాలు (అలర్జీ)

మన దైనందిన జీవితాలలో మన చుట్టుప్రక్కల వున్న అనేకమైన వాటి వలన అలర్జీలు కలుగవచ్చు.
**గాలి ద్వారా వ్యాపించు అలర్జీలు,** విత్తులు, జంతువ్యర్థాలు, ధూలి దూసరితాలు మరియు మౌల్డ్.
**కొన్ని ఆహారములు,** ప్రత్యేకించి పల్లీలు, చెట్టుకాయలు, గోధుమలు, సోయా, చేప, గవ్వచేపలు, గుడ్లు మరియు పాలు.
**కీటకాల కాట్లు,** తేనెటీగ లేదా వ్యాస్ప్.
**మీరు తాకే ల్యాటెక్స్ లేదా ఇతర పదార్థాలు,** వీటివలన చర్మానికి అలర్జీ ప్రతిచర్యలు ఏర్పడును.
కేవలం ఒక రక్త నమూనాతో మనం ఏ అలర్జీనైనా కనుగొనగలము మరియు వాటిని రోగనిరోధక బూస్టర్లు, యాంటీ అలర్జీ డ్రగ్స్ మరియు ఇమ్యూనో థెరపీల ద్వారా కూడా చికిత్స చేయవచ్చు.

ఉదాహరణకి గాలి పీల్చుకోవడం, దగ్గు మరియు జలుబుతో బాధపడుతూ ఆస్త్మా చరిత్ర వున్న ఒక 12 సంవత్సరాల బాలికను తీసుకుందాం. ఆమె తన ఊపిరికి చెందిన ఏ రుగ్మతలూ స్పష్టంగా తెలుపలేదు. ఆమె వైద్యచరిత్రలో తాను ఒక ఫిజీషియన్‌ను తన ఆస్త్మా కోసం సంప్రదించి, చక్కగా మందు కూడా తీసుకున్నది. అయినప్పటికీ ఆమెకి నయం కాలేదు. ఆమె డిస్పోనియా మరియు ప్యూరిటీస్ చరిత్రలు కూడా కలిగి వుండి పీనట్స్, చిక్‌పీస్ మరియు రెంటిల్స్‌కి కూడా గురి అయినది. గతంలో ఆమె వీజింగ్ సందర్భాలు కాలానుసారంగా గడ్డికి, గాలిలో ఎగిరే విత్తులకు సంబంధించి వుండేది. ఆమెకి రక్త అలర్జీ పరీక్ష చేసి రోగనిరోధక థెరపీతో చికిత్స చేసి కొన్ని అలర్జీ నిరోధక డ్రగ్స్ ఇచ్చిన తరువాత ఆమె కోలుకున్నది. ఎవరికైనా శ్వాస సమస్యలు వున్నట్లయితే అతడు/ఆమె అలర్జీ పరీక్ష కూడా చేయించుకోవాలి. ఒకసారి అలర్జీ (అలర్జీ) గుర్తించబడితే సగం సమస్య తీరినట్లే. దీనివలన ప్రత్యేకత కలిగిన డాక్టర్స్ ప్యానల్ సహాయం ద్వారా సరైన చర్య తీసుకునే అవకాశం కలుగుతుంది మరియు వారి అలర్జీకి సరైన మందులతో చికిత్స చేయవచ్చు. యూరో బ్లాట్ మరియు ఫాడియాలు ఉపయోగించి అటువంటి అలర్జీలను డయాగ్నైజ్ చేయడానికి మా సర్వోత్తమ డాక్టర్ల ప్యానల్‌కి ప్రత్యేక శిక్షణ ఇవ్వబడినది.









**ప్రపంచ ప్రఖ్యాత మోడర్న్ మెషీన్లచే పరీక్షించబడినది**

Aanjan Path Labs & ALLERGY TESTING CENTRE

CORPORATE OFFICE : Plot No. - 29A ARK Colony (Anantha Ramakrishna Iyyer Colony) Eldams road, Teynampet Chennai.

| KARIMNAGAR | RAMAGUNDAM | ARMOOR | ZAHEERABAD | JAGTIAL |
|---|---|---|---|---|
| 9705505150, 9100370881<br>TATA HOSPITAL & TATA PATH LAB, SAI CHANDANA HOSPITAL, 3-4-173 RAJATALKIES ROAD SAI NAGAR | 8106959770<br>Moon Diagnostics, #4-2-171, Beside:SBIH-ATM, Jyothinagar, Medipally Road, N.T.P.C | 9440142321, 7013353998<br>Shylaja Diagnostic Centre, Beside Pisa Mallanna Temple Mahalakshmi colony | 9666775614, 8125461110<br>Y.S.K DIAGNOSTIC CENTRE, Opp. Bus Stand Beside Bharath Gas Office | 9394118119, 9440226033<br>JANATHA DIAGNOSTICS, Beside Dr. B. Shankar M.D, Hospital, Krishnanagar, Jagtial, Karimnagar, Telanaga |

| KORATLA | MANCHERIAL | PEDDAPALLI | BODHAN | MANCHERIAL |
|---|---|---|---|---|
| 9989180100<br>M.J DIAGNOSTICS, Opp. SBI Koratla Branch, Old Bus Stand, Kortla Complex, Ailapur Road | 9866514566, 8555949010<br>SRI SAI DIAGNOSTICS, Opp:DCP Office, Near Carmel School, ACC | 9491265834<br>MK DIAGNOSTICS, Masjid Road, opp. city cable | 9848175613, 9398678928<br>Balaji Pathology Lab, Sharbathi Canal Road, Dist. Nizamabad | 9652211678, 8790621678<br>Health Care, Bellampally Chowrastha, Beside: Andhra Bank, |

**HELPLINE : 63838-73278, 63838-48063, 95000-53404**

Member of Advertising Standards Council of India (Responsible Advertising)

epaper.ntnews.com